# దారి దీపం

DAARI DEEPAM - RNI Title Code : APTEL 16175
మాసపత్రిక

సంపుటి 3 - సంచిక 8 | మే 2025 | వెల : రూ.15

మసకబారిన మోదీ రాజకీయం

ముగిసిన యుద్ధం.. మిగిల్చిన ప్రశ్నలు

పహల్గాం దాడిలో సమాధానం దొరకని మూడు ప్రశ్నలు

ఓ దుర్ఘటనను మతోన్మాదకావేశకావేశాలు రెచ్చగొట్టే సందర్భంగా మారుస్తున్న మీడియా

'సరిహద్దులు' దాటుతున్న ఉన్మాదం.. ఉన్మత్తతతో ఊగిపోతున్న కాషాయదళం..

ఒక ప్రయాణం - భిన్న సందర్భాలు

నాటి ఫాసిజంపై విజయం.. నేటి పోరాటానికి స్ఫూర్తి

ద్రవ్య పెట్టుబడి - కృత్రిమ మేధస్సు - మార్క్స్

నూత్న ఆవిష్కరణలలో మనం ఎందుకు వెనుకబడి ఉన్నాము ?

చారిత్రక దృక్పథం లోపించిన 'విప్లవాగ్ని అల్లూరి' !

విశ్లేషణ, విమర్శలతో సాగే 'కొత్తచూపు'

జాతి పురోభివృద్ధికి సోపానాలు గ్రంథాలయాలు

తెలుగులో మార్క్సిస్టు సాహిత్య విమర్శ - పునరాలోచనలు

తెలుగులో మార్క్సిస్టు సాహిత్య విమర్శ చర్చా పత్రం

కులం పునాదులపై జాతిని నిర్మించలేమన్న అంబేద్కర్

అందాల పోటీలు - ఒక అవగాహన

అందాల పోటీలు అనేక సవాళ్లు

మే - 2025

పేజీలు : 54

# దారి దీపం

మాసపత్రిక

సంపుటి : 3 - సంచిక : 8


డి.వి.వి.యస్.వర్మ
- సంపాదకులు

సంపాదక వర్గం
కొప్పర్తి వెంకటరమణమూర్తి
మందలపర్తి కిషోర్
డి.సోమసుందర్
డా॥ బి.రమేష్ చంద్రబాబు

వెల : 15 రూపాయలు

## ఈ సంచికలో..

1). మసకబారిన మోదీ ప్రతిష్ట
- సంపాదకీయం 3
2). ముగిసిన యుద్ధం మిగిల్చిన ప్రశ్నలు
- ఎ.కృష్ణారావు 4
3). పహల్గాం దాడిలో సమాధానం దొరకని మూడు ప్రశ్నలు - ఇశాద్రితా లాహిడి 6
4). ఓ దుర్ఘటనను మతోన్మాదకావేశకావేశాలు రెచ్చగొట్టే సందర్భంగా మారుస్తున్న మీడియా
- సంజీవ్ కిశోర్ సూద్ 7
5). 'సరిహద్దులు' దాటుతున్న ఉన్మాదం.. ఉన్మత్తతతో ఊగిపోతున్న కాషాయదళం..
- వీరయ్య కొండూరి 9
6). ఒక ప్రయాణం - భిన్న సందర్భాలు
- గౌరవ్ 11
7). నాటి ఫాసిజంపై విజయం నేటి పోరాటానికి స్ఫూర్తి - డి.వి.వి.యస్.వర్మ 14
8). ద్రవ్య పెట్టుబడి - కృత్రిమ మేధస్సు - మార్క్స్ - ఎం.డి అబ్బాస్ 18
9). నూత్న ఆవిష్కరణలలో మనం ఎందుకు వెనుకబడి ఉన్నాము? - కవితా కబీర్ 20
10). చారిత్రక దృక్పథం లోపించిన 'విప్లవాగ్ని అల్లూరి'! - దివికుమార్ 23
11). విశ్లేషణ, విమర్శలతో సాగే 'కొత్తచూపు' -కె.శరచ్చంద్ర జ్యోతిశ్రీ 27
12) జాతి పురోభివృద్ధికి సోపానాలు గ్రంథాలయాలు - చెన్నాప్రగడ శర్మ 30
13). తెలుగులో మార్క్సిస్టు సాహిత్య విమర్శ -పునరాలోచనలు - ఎన్.వేణుగోపాల్ 32
14). తెలుగులో మార్క్సిస్టు సాహిత్య విమర్శ చర్చా పత్రం 37
15). కులం పునాదులపై జాతిని నిర్మించలేమన్న అంబేద్కర్ - టి.స్కైలాబ్‌బాబు 38
16). పుస్తకాల స్వీకారం 39
17) ప్రయత్నం - కార్ల్ మార్క్స్ 40
అనుబంధం 18) అందాల పోటీలు - ఒక అవగాహన
- తోట జ్యోతిరాణి, కాత్యాయనీ విద్మహే, వి.శోభ 41
19) అందాల పోటీలు అనేక సవాళ్లు - ఎ.సునీత 51
20) కార్టూన్లు 53
21) కొత్త పుస్తకాల స్వీకారం 54




కార్టూన్ : సతీష్ ఆచార్య ఫేస్‌బుక్ సౌజన్యంతో..

దారి దీపం
మాసపత్రిక
మీ విరాళాలను ఈ క్రింది అకౌంట్‌కు పంపండి

**Daari Deepam**
Union Bank of India
Branch : TANUKU
**A/C No : 0554 1101 0000 054**
**IFSC code : UBIN0805548**

మీ పేరు విరాళం వివరాలను..
డాక్టర్ బి.రమేష్ చంద్రబాబు
నంబరుకు విధిగా
వాట్సాప్ మెస్సేజ్ పెట్టండి.
ఫోన్ నెంబరు 93971 14495

వివరాలకు సంప్రదించండి : డా॥ బి.రమేష్ చంద్రబాబు, 34-15-1, దొడ్డిపట్ల వారి తోట వీధి, తణుకు - 534211, ప.గో.జిల్లా, ఏపీ ఫోన్ : 93971 14495

దారి దీపం గత సంచికల కోసం : DVVSVARMA.COM



# మసకబారిన మోదీ రాజకీయం

మోదీకి ఎన్నికలలో ప్రయోజనం పొందే రాజకీయ కళ తెలుసు. ప్రతి సంఘటనను రాజకీయ ప్రయోజనాలకు వినియోగించుకునే చతురత తెలుసు. పహల్గాంలో పర్యాటకుల మీద ఉగ్రవాదులు జరిపిన హేయమైన హత్యాకాండ దేశ ప్రజలలో తీవ్ర ఆగ్రహావేశాలను కలిగించింది. పర్యవసానంగా ఉగ్రవాదులకు బాసటగా వున్న పాకిస్థాన్‌పై ఆపరేషన్ సిందూర్ ప్రారంభమైంది. పేరు పెట్టడంలోనే మోదీ ప్రత్యేకత కనిపిస్తుంది. అది హిందూ సాంస్కృతిక భావనను వ్యక్తీకరిస్తుంది. దేశ ప్రజలందరూ ముక్త కంఠంతో ప్రాంత, భాష, మత విభేదాలకు తావు లేకుండా ఒక్కటిగా ఉగ్రవాదంపై నినదించిన వేళ కూడా మోదీ తన రాజకీయ విభజనను మాత్రం విడిచి పెట్టలేదు. నాలుగు రోజుల యుద్ధం కాల్పుల విరమణ ఒప్పందంతో ముగిసింది. ముగింపు అనంతరం ప్రధాని జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలో ఈ ఘన విజయాన్ని ప్రజలకు వివరించడానికి 11 రోజుల తిరంగా యాత్రను ప్రకటించారు. ఈ తిరంగా యాత్ర విజయోత్సవాలలో ప్రజలు భాగస్వామ్యం అంతంతమాత్రంగానే వుంది. ఎన్‌డీఏ మిత్రపక్షాల కార్యక్రమంగానే జరుగుతున్నాయి. దేశమంతా ఉవ్వెత్తున ఎగసిన సంఘీభావం ఇక్కడ కనిపించకపోవడం యాదృచ్ఛికం కాదు. ఈ మొత్తం వ్యవహారంలో మోదీ రాజకీయం మసకబారినట్లు కనిపిస్తుంది.

కాశ్మీర్‌లో ఇటీవలే శాసనసభ ఎన్నికలు జరిగాయి. ప్రజలు పెద్ద ఎత్తున ప్రజాస్వామ్య ప్రక్రియలో పాలుపంచుకున్నారు. అధికారాన్ని చేజిక్కించుకోవడానికి మోదీ ప్రభుత్వం అనేక ఎత్తులు జిత్తులు వేసింది. నియోజకవర్గాల విభజనను తనకు అనుకూలంగా మార్చింది. కొత్త ఓటర్ల పేరుతో స్థానికులు కాని వారికి ఓటు హక్కు కల్పించింది. అయినా కాశ్మీర్ ప్రజలు తమ పట్ల బీజేపీ అనుసరిస్తున్న వైఖరిని తిరస్కరించారు. మోదీ ప్రభుత్వం కొత్తగా ఎన్నికైన ప్రభుత్వాన్ని ఉత్సవ విగ్రహం చేసింది. దానికి ఎలాంటి అధికారాలు లేకుండా సర్వాధికారాలను లెఫ్టినెంట్ గవర్నర్ ద్వారా తానే నిర్వహిస్తున్నది. సరిహద్దు రక్షణ, పౌర భద్రత అంతా కేంద్రం చేతుల్లోనే వుంది. పహల్గాం ఘటనలో భద్రతా వైఫల్యం స్పష్టంగా కనిపిస్తుంది. కేంద్రం కనుసన్నల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు, నిఘా వ్యవస్థలు వున్నప్పటికీ ఉగ్రవాద ముష్కరులు సరిహద్దులు దాటి రావడమే కాదు. పహల్గాం వరకు రావడం పూర్తిగా భద్రతా వైఫల్యమే. ఈ ఘటన జరిగినప్పుడు ఒక్క జవాన్ కూడా అక్కడ లేరని ప్రత్యక్ష సాక్షులు స్పష్టం చేస్తున్నారు. ఈ భద్రతా వైఫల్యం ఎంత దాచినా అది దేశ ప్రజలను మభ్యపెట్టలేకపోతున్నది.

ఇక ఆపరేషన్ సిందూర్‌ను కాల్పుల విరమణ ఒప్పందంతో ముగింపు మోదీ ప్రతిష్టనే కాదు.. దేశ ప్రతిష్టను దిగజార్చింది. కాల్పుల విరమణ ఒప్పందాన్ని మోదీ ప్రకటించలేదు. ట్రంప్ ప్రకటించాడు. ఆ తర్వాతే ఒప్పందం కుదిరినట్లు ఇరు దేశాలు ప్రకటించాయి. ఇది దేశ సార్వభౌమాధికారానికి సంబంధించిన అంశం అయ్యింది. ట్రంప్ మరో అడుగు ముందుకు వేసి తన వాణిజ్య బెదింపు వల్లనే ఈ ఒప్పందం కుదిరిందని ప్రకటించాడు. ఈ ప్రకటనలను ఖండించలేని దుస్థితిలో మోదీ ప్రభుత్వం పడింది. ఇది అత్యంత అవమానకరమైన పరిణామం. మోదీ జాతిని ఉద్దేశించి చేసిన ప్రసంగంలో దీనిపై ఒక్కమాట కూడా మాట్లాడలేదు. భారతదేశ ఆత్మగౌరవాన్ని ఇలా అమెరికా ముందు ఫణంగా పెట్టిన సంఘటన స్వతంత్ర భారతంలో ఏనాడూ జరగలేదు. ఇవన్నీ ఇప్పుడు ప్రజల ఆలోచనలలో భాగం అవుతున్నాయి. మోదీ తిమ్మిని బమ్మిని చెయ్యడానికి చేసే ప్రతి ప్రయత్నమూ ఈ సారి మోదీకి కలిసి రావడం లేదు. ఇది మోదీ రాజకీయం మసకబారడానికి నిదర్శనంగా కనిపిస్తున్నది.

**- డి.వి.వి.యస్.వర్మ**
**సంపాదకులు, 85006 78977**

# ముగిసిన యుద్ధం మిగిల్చిన ప్రశ్నలు



- ఎ.కృష్ణారావు

గగనతలంలో యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. యుద్ధ విమానాలు శత్రు స్థావరాలపై క్షిపణుల వర్షం కురిపించాయి. డ్రోన్‌లు పేలుడు పదార్థాలతో నిప్పులు కక్కాయి. సరిహద్దులు కాల్పులతో దద్దరిల్లాయి. కేవలం నాలుగు రోజుల్లోనే భారత్ పాకిస్థాన్‌ల మధ్య యుద్ధం తీవ్రస్థాయికి చేరుకుంది. ఇది ఆధునిక యుద్ధతంత్రం కనుక టెక్నాలజీ సాయంతో నిర్దిష్ట లక్ష్యాలను ఛేదించగలగడం, క్షిపణులను, డ్రోన్‌లను గాలిలోనే పేల్చివేయడం వంటి అపూర్వ దృశ్యాలను మనం చూడగలిగాం.

పహల్గాంలో పర్యాటకులను ఉగ్రవాదులు దారుణంగా కాల్చి చంపిన 15 రోజుల్లోనే భారతదేశం సర్వశక్తులను మోహరించి పాకిస్థాన్‌పై దాడులు ప్రారంభించిన వైనాన్ని, పాకిస్థాన్ మనను ఎదుర్కొనే విషయంలో విఫలం కావడం స్పష్టంగా కనపడింది. ఆపరేషన్ సిందూర్ పేరిట భారత సైనిక దళాలు ప్రారంభించిన యుద్ధం మొత్తం దేశాన్నే గగుర్పొడిచేలా చేసింది. భారత మహిళల సిందూరాన్ని తుడిచివేసిన పాక్ ప్రేరిత ఉగ్రవాదులకు బుద్ధి చెప్పేందుకు తగిన పేరే పెట్టినందుకు దేశవ్యాప్తంగా హర్షామోదాలు వ్యక్తమయ్యాయి. 'ఉగ్రవాదులను, వారికి వెనుక ఉన్న శక్తులను మట్టిలో కలిపేస్తాం' అని ప్రధాన మంత్రి చేసిన హుంకారం దేశమంతటా ప్రతిధ్వనించింది. పాకిస్థాన్ కూడా భారత్‌ను ఎదుర్కొనేందుకు సమాయత్తం కావడంతో ఈ యుద్ధం చాలాకాలం సాగుతుందని, ఈసారి భారతదేశం లాహోర్‌లో ప్రవేశించడమే కాదు, పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను కూడా కైవశం చేసుకుంటుందనే భావనలు అంతటా పెల్లుబుకాయి. కాని యుద్ధం ప్రారంభించిన నాలుగు రోజుల్లోనే ఉన్నట్లుండి ఇరు దేశాలు యుద్ధ విరమణను ప్రకటిస్తాయని, శతఘ్నులు, విమానాలు మూగపోతాయని ఎవరూ ఊహించలేదు. ఏదో జరగబోతుందని, ఈసారి పాకిస్థాన్‌కు మనం కనీవినీ ఎరుగని రీతిలో బుద్ధి చెబుతామని భావించిన తరుణంలో పాక్ కాల్పుల విరమణను ప్రతిపాదించడం, అందుకే ఎదురుచూస్తున్నట్లుగా మనం నాటకీయంగా అందుకు అంగీకరించడం దేశవ్యాప్తంగా అనేకమందికి ఆశ్చర్యం కలిగించింది. నిజానికి మనమే కాల్పుల విరమణను ముందుగా ప్రతిపాదించామని, అందుకు తాము ఒప్పుకున్నామని పాకిస్థాన్ ప్రకటించింది. 2022 ఫిబ్రవరిలో రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య ప్రారంభమైన యుద్ధం ఎంతో బీభత్సం సృష్టించిన తర్వాత ఇప్పుడిప్పుడే శాంతి బాటలోకి పయనిస్తోంది. ఇజ్రాయిల్-పాలస్తీనా మధ్య నెత్తుటి సంఘర్షణ కొన్ని దశాబ్దాలుగా కొనసాగుతూ వస్తోంది.

గతంలో ఇరాన్, ఇరాక్‌ల మధ్య యుద్ధం 8 సంవత్సరాలకు పైగా సాగింది. అమెరికా సంకీర్ణ దళాలకూ, ఇరాక్‌కు మధ్య మరో 8 సంవత్సరాలు హోరాహోరీ సాగింది. వియత్నాంపై అమెరికా యుద్ధం కూడా 20 సంవత్సరాలకు పైగా జరిగింది. మరెందుకు భారత-పాకిస్థాన్‌ల మధ్య యుద్ధం కేవలం నాలుగు రోజుల్లోనే యాంటీ క్లైమాక్స్ లాగా ఎందుకు ముగిసింది? ఈ యుద్ధం ఇలా అర్థాంతరంగా ముగియడాన్ని బట్టే యుద్ధం గురించి స్వతంత్రంగా మనం నిర్ణయాలు తీసుకోలేమని, తీసుకున్నా దాన్ని కొనసాగించలేమని అర్థమవుతుంది. ఈ యుద్ధ విరమణను భారత-పాకిస్థాన్ దేశాలు తమంతట తాము ప్రకటించాయని అనుకోవడానికి ఏ మాత్రం వీల్లేదు. ఉన్నట్లుండి కత్తులు ఒరల్లోకి చేరిపోవడం యాదృచ్ఛికం కానేకాదు. అసలు సుదీర్ఘకాలం యుద్ధం జరగాలని, సైనికులు, ప్రజలు చనిపోవాలని, అభివృద్ధి స్తంభించిపోవాలని ఎవరూ కోరుకోరు. ప్రపంచశాంతి ఏర్పడాలనే అందరూ కోరుకుంటారు. గతంతో పోలిస్తే ఒకటి రెండుచోట్ల తప్ప ప్రపంచంలో యుద్ధ వాతావరణం అంతగా లేదు. చైనా, అమెరికా లాంటి దేశాలు వాణిజ్య భాషకే ప్రాధాన్యతనిస్తున్నాయి.

భారతదేశం కూడా వికసిత్ భారత లక్ష్యం నెరవేరాలంటే యుద్ధాన్ని సాధ్యమైనంత మేరకు నివారించాలి. యుద్ధం చేయడమంటే పులిపై స్వారీ చేయడమే. ప్రారంభించే ముందే దాని పర్యవసానాల గురించి ఆలోచించాలి. అందువల్ల యుద్ధం ఎందుకు ప్రారంభించాల్సి వచ్చింది ? యుద్ధాన్ని ఎందుకు ముగించాల్సి వచ్చింది అన్న ప్రశ్నలపై మాత్రం చర్చ జరగడం అవసరం. రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య, ఇజ్రాయిల్-హమాస్‌ల మధ్య యుద్ధాన్ని ఆపలేకపోయిన అంతర్జాతీయ శక్తులు భారత-పాకిస్థాన్‌ల విషయంలో మాత్రం ఎందుకు విజయవంతం కాగలిగాయి ? ఒకటి రెండు ఫోన్ కాల్స్‌తో ఇరు దేశాలు ఎందుకు శాంతించాయి ? భారత పాకిస్థాన్‌ల మధ్య యుద్ధం ప్రారంభించిన వెంటనే అమెరికా, బ్రిటన్, సౌదీ అరేబియాతో సహా అనేక దేశాలు మధ్యవర్తిత్వానికి ప్రయత్నించాయి. ఇరు దేశాలు తమ నిర్ణయాన్ని ప్రకటించకముందే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భారత పాక్ దేశాలు కాల్పుల విరమణకు అంగీకరించాయని ప్రకటించారు. తామే ఇరు దేశాలను ఒప్పించామని, ఈ దేశాలు తమ వివేకాన్ని, విజ్ఞతను

ప్రదర్శించాయని ఆయన అభినందించారు. తాను, అమెరికన్ ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ భారతదేశం, పాకిస్థాన్‌లోని సైనిక నాయకత్వంతో మాట్లాడామని, పరిస్థితి విషమించకుండా ఒప్పందం కుదిరేలా చేసామని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో అన్నారు. దాదాపు పది, పన్నెండు దేశాలు ఇరు దేశాలను శాంతింపచేసేందుకు ప్రయత్నాలు చేసినప్పటికీ ప్రధానంగా భారత పాకిస్థాన్‌ల మధ్య తాత్కాలిక శాంతి ఏర్పర్చడంలో అమెరికా కీలకపాత్ర వహించినట్లు స్పష్టమవుతోంది.

తమకు సంబంధం లేని యుద్ధంలో తాము జోక్యం చేసుకోబోమని తొలుత ప్రకటించిన అమెరికా తన వైఖరి మార్చుకుని పెద్దన్న పాత్ర పోషించింది. యుద్ధం, సంఘర్షణలు జరిగినప్పుడే తమ పక్షాన ఎవరు నిలబడతారో అన్న విషయం స్పష్టమవుతుంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో వ్యక్తిగత స్నేహం కూడా ఏర్పర్చుకుని పరమ మిత్రుడుగా వ్యవహరించారు. అయితే ఆయనే యుద్ధాన్ని ఆపేయాలని హెచ్చరించే స్వరంతో చెప్పారు. యుద్ధం ప్రారంభమైన తర్వాత కూడా అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ పాకిస్థాన్‌కు 2.4 బిలియన్ డాలర్ల రుణాన్ని మంజూరు చేసింది. సౌదీ ఆరేబియా, చైనా, యూఏఈ పాక్‌కు ఈ రుణం లభించేందుకు గట్టి మద్దతునిచ్చాయి. ఈ రుణం లభించకుండా వీటో చేసే అధికారాలున్నా అమెరికా అడ్డుకోలేదు. జపాన్, జర్మనీ, యూకే కూడా మాట్లాడలేదు. పాకిస్థాన్‌కు మద్దతునిస్తే ఉగ్రవాదానికి మద్దతునిచ్చినట్లేనన్న భారత్ నిరసనలకు మద్దతు లభించలేదు. దీనితో పాక్‌కు ఐఎంఎఫ్ రుణం ఇచ్చే విషయంలో ఐఎంఎఫ్ బోర్డులో ఓటింగ్ చేయకుండా భారత్ వైదొలగాల్సి వచ్చింది.

ఈ నాలుగు రోజుల యుద్ధం కొన్ని ప్రశ్నలను మిగిల్చింది. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ నిజంగా తన లక్ష్యాన్ని సాధించిందా? పహల్గాంలో హత్యకు గురైన అమాయక భారతీయుల మరణాలకు ప్రతీకారాలు తీర్చుకున్నారా ? పాకిస్థాన్‌లో ఉగ్రవాద నెట్‌వర్క్‌ను మనం పూర్తిగా ధ్వంసం చేశామా ? భారతీయ పర్యాటకులను హత్య చేసి అదృశ్యమైన ఉగ్రవాదులను మనం వెతికి వేటాడి చంపగలిగామా ? పహల్గాం ఘటన సూత్రదారి మూసా, లష్కరే వ్యవస్థాపకుడు హాఫీజ్ సయీద్, జైషే మహమ్మద్ వ్యవస్థాపకుడు మసూద్ అజర్, హిజ్బుల్ ముజాహిదీన్‌కు చెందిన సలావుద్దీన్ ఏ రహస్య స్థావరాల్లో దాక్కున్నారు ? వారిని అప్పగించేందుకు పాకిస్థాన్ సిద్ధపడిందా ? భారతదేశం కొన్ని స్థావరాలను ధ్వంసం చేసిన మాట నిజమే. పాకిస్థాన్‌కు మనం తీవ్ర నష్టం చేశామని మన సైనిక దళాలు వివరాలు ఇచ్చాయి. కాని మనకు జరిగిన నష్టం గురించి తెలిసేందుకు ఆస్కారం లేదు. మన యుద్ధ విమానాలను కూల్చివేయడం గురించి పాక్ చెప్పుకోవడంపై ప్రశ్నించినప్పుడు 'యుద్ధం అన్న తర్వాత నష్టాలు జరగక తప్పదు' అని భారతీయ వైమానిక దళం ప్రకటించింది కాని వివరాలు చెప్పలేదు. పాకిస్థాన్‌కు ఎంత నష్టం జరిగినా, కొంత గాయపరిచినా, వంద మందిని పైగా హతమార్చామని చెప్పుకున్నా, పాక్‌లో ఉగ్రవాద నెట్‌వర్క్‌ను పూర్తిగా ధ్వంసం చేయడం, ఆక్రమిత కశ్మీర్‌ను అప్పగించడం, కశ్మీర్‌లో పూర్తిగా శాంతి నెలకొనడం అనే భారత దీర్ఘకాలిక లక్ష్యాలు ఇంకా నెరవేరాల్సి ఉన్నది. ముఖ్యంగా ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌ను ప్రపంచదేశాల్లో ఏకాకి చేయడం, దౌత్య, ఆర్థిక సహాయం అందకుండా చేయడం అంత సులభం కాదని తాజా పరిణామాలతో స్పష్టమైంది. నిజానికి నేరుగా యుద్ధం చేయకుండా పాకిస్థాన్ మాదిరే ఆ దేశంలో అల్లకల్లోలం సృష్టించడం, అంతర్గత భద్రతా పరిస్థితులను ఏర్పర్చడం సులభం. కాని దీనివల్ల ప్రచారం లభించదు కదా!

ఇజ్రాయిల్‌లో నెతన్యాహుకు ప్రతికూల పరిస్థితులు ఏర్పడి అరెస్టయ్యే దశలో హమాస్‌పై దాడి చేసి తనకు తిరుగులేని పరిస్థితిని కల్పించుకున్నారు. భారతదేశంలో నరేంద్రమోదీ కూడా తన ప్రాబల్యాన్ని పెంచుకునేందుకు పహల్గాం ఘటన దోహదం చేసింది. పాకిస్థాన్ గురించి, ఉగ్రవాద శక్తుల గురించి ఆయన మాట్లాడిన ఒక్కొక్క మాటకూ దేశ ప్రజలు ఉప్పొంగిపోయారు. నాలుగు రోజులపాటు మన యుద్ధ విమానాలు పాక్ గగనతలంలో స్వైర విహారం చేసినట్లు వచ్చిన వార్తలు విన్నప్పుడు, మన టీవీ యాంకర్లు టెలివిజన్ తెరలపై యుద్ధాన్ని ఉచ్ఛస్వరాలతో త్రీడీలో ఆవిష్కరించినప్పుడు ప్రజలు ఉత్కంఠతలో మునిగిపోయారు. ఇప్పుడు ఆకస్మికంగా యుద్ధం ఆగిన తర్వాత మోదీ ప్రజల్లో ఆ వేడిని కొనసాగించేందుకు విశ్వ యత్నాలు చేస్తున్నారు. దేశ ప్రజలను, సైన్యాన్ని ఉద్దేశించి ఆయన వీరోచితంగా ప్రసంగాలు చేయడం, ఆపరేషన్ సిందూర్ విజయవంతమైనదంటూ దేశవ్యాప్తంగా బీజేపీ తిరంగా యాత్ర నిర్వహించడం ఇందుకు నిదర్శనం. ప్రశ్నలకు తావివ్వకుండా ప్రచారం చేయడం ఒక రకంగా మంచిదే. కాని ప్రచారం సద్దుమణిగిన తర్వాత మళ్లీ ప్రశ్నలకు ఆస్కారం కలగక తప్పదు. అందువల్ల 'ధీరుల్ విఘ్న నిహన్య మానులగుచున్ ధ్రుత్యున్నతోత్సాహులై' అని భర్తృహరి అన్నట్లు మన ప్రధానమంత్రి నరేంద్రమోదీ తాను ప్రారంభించిన కార్యాన్ని ఇంకా పూర్తిచేయాల్సి ఉన్నది.

ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే పాకిస్థాన్‌ను రెండు ముక్కలు చేసిన ఇందిరాగాంధీకి, ఇతర దేశాల జోక్యాన్ని వ్యతిరేకిస్తూ ఆమె గతంలో చేసిన ప్రకటనలపై అంతటా చర్చ జరుగుతోంది! ❑

**(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)**

# పహల్గాం దాడిలో సమాధానం దొరకని మూడు ప్రశ్నలు

\- ఇశాద్రితా లాహిడి

పహల్గాం దాడి తరువాత దానికి సంబంధించినవి, బాధితులవి పలు వీడియోలు బయటికి వచ్చాయి. ఈ వీడియోలలో ఒకటి గుజరాత్‌కు చెందిన శీతల్ కలాథియాది. శీతల్ భర్త 44 ఏళ్ల శైలేష్‌భాయ్ కలాథియా కూడా ఈ దాడిలో మరణించారు. కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ సూరత్‌లోని శీతల్ కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్లారు. శీతల్ కేంద్ర మంత్రితో మాట్లాడుతూ "మీకు చాలా వీఐపీ కార్లున్నాయి. మరి, పన్ను చెల్లించే వారి సంగతేంటి? అక్కడ సైనికులు, వైద్యులు లేరు" అని అన్నారు. పహల్గాం దాడి నుంచి మహారాష్ట్రకు చెందిన పరాస్ జైన్ బయటపడ్డారు. ఆయనతో 'ది హిందూ' మీడియా మాట్లాడింది. ఈ దాడి 25-30 నిమిషాలపాటు కొనసాగిందని పరాస్ చెప్పారు. అక్కడ పోలీస్, జవాన్ ఎవరూ లేరని ఆయన పేర్కొన్నారు. దాడి జరిగిన ప్రదేశానికి ఏడు కిలోమీటర్ల దూరంలో సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్పీఎఫ్) శిబిరం ఉంది. ఆర్మీకి చెందిన రాష్ట్రీయ రైఫిల్స్ (ఆర్ఆర్) శిబిరం ఐదు కిలోమీటర్ల దూరంలో ఉంది.

### బైసరన్‌లో భద్రత ఎందుకు లేదు?

పహల్గాంలో దాడి తర్వాత, చాలా మందికి వస్తున్న ప్రశ్న.. ఈ పర్యాటక ప్రదేశంలో భద్రత ఎందుకు లేదు? '1990ల నుంచి జమ్ముకశ్మీర్‌లో సైనిక భద్రత లేని బహిరంగ ప్రదేశం నేనెప్పుడూ చూడలేదు. ప్రతిచోటా భద్రతా సిబ్బంది కనిపిస్తారు. కానీ, ఈ ప్రాంతంలో లేకపోవడం ఆశ్చర్యంగా ఉంది' అని జర్నలిస్ట్, కశ్మీర్ వ్యవహారాల నిపుణురాలు అనురాధ భాసిన్ అన్నారు. దాడి జరిగిన కొన్ని గంటల్లోనే నిందితుల పేర్లు ఎలా బయటికి వచ్చాయని అనురాధ ప్రశ్నించారు. 'భద్రతా దళాలు అక్కడికి చేరుకోవడానికి చాలా సమయం పట్టింది. కొంత సమయం తర్వాత వారి వద్ద నిందితుల స్కెచ్‌లు ఉన్నాయి. వారిని ఎలా గుర్తించారు?' అని ఆమె ప్రశ్నించారు. 'గత ఐదేళ్లలో పలు సంఘటనలు జరిగాయి. ఉగ్రవాదం ముగిసిందని చెప్పలేం. భద్రతా అధికారులు ఈ సమస్య గురించి మాట్లాడేటప్పుడు 'నియంత్రించాం' వంటి పదాలను ఉపయోగించారు తప్ప 'అంతం' వంటి పదాలను వాడలేదు. ఉగ్రవాదం అంతమైందనేది 'రాజకీయ కథనం'. గత ఐదేళ్లలో ఎలాంటి శాంతి ఏర్పడినా అది కేవలం సైనిక నియంత్రణ కారణంగానే జరిగింది' అని అనురాధ భాసిన్ అన్నారు. ప్రొఫెసర్ అమితాబ్ మట్టూ జవహర్‌లాల్ నెహ్రూ విశ్వ విద్యాలయం (జేఎన్‌యూ)లోని స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ స్టడీస్‌లో బోధిస్తుంటారు. అంతర్జాతీయ సంఘర్షణ, భద్రత విషయాలలో ఆయన నిపుణుడు. అనురాధ ప్రశ్నలకు మట్టూ సమాధానమిస్తూ 'గత కొన్ని సంవత్సరాలుగా పర్యాటక ప్రాంతాలలో సైనిక దళాలను తక్కువగా మోహరించే విధానాన్ని తీసుకొచ్చారు' అని ఆయన అన్నారు. 'వారు ఒక వ్యూహాన్ని అవలంబించారు. అది ప్రభావవంతంగానే ఉంది. కానీ, స్పష్టం గా లేదు. ఇది పెద్ద భద్రతా లోపం' అని మట్టూ అభిప్రాయ పడ్డారు. పర్యాటకులు మారుమూల ప్రాంతానికి వెళుతున్నందున అక్కడ కూడా భద్రత పెంచి ఉండాల్సిందని జమ్ము కశ్మీర్ మాజీ డీజీపీ ఎస్పీ వైద్ బీబీసీతో అన్నారు. రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ సతీశ్ దువా కూడా చాలాకాలం జమ్ము కశ్మీర్‌లో విధులు నిర్వర్తించారు. దువా మాట్లాడుతూ 'సైన్యం, నేషనల్ రైఫిల్స్ దేశం లోపల ప్రతిచోటా ఉండలేవు. వారిని సరిహద్దులో మోహరిస్తారు. పోలీసుల గురించి మాట్లాడుకుంటే.. కశ్మీర్ లోయ 120 కిలోమీటర్ల పొడవు, 38 కిలోమీటర్ల వెడల్పుతో ఉంటుంది. ప్రతిచోటా పోలీసులను మోహరించడం సాధ్యం కాదు' అని చెప్పారు.

### సామాన్య ప్రజలను ఎందుకు లక్ష్యంగా చేసుకున్నారు?

పహల్గాం దాడిలో పౌరులను లక్ష్యంగా చేసుకోవడంపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ దాడిలో భిన్నమైన విధానం అనుసరించారు. దేశంలోని ఏ ప్రాంతంలోనైనా చాలాకాలం తర్వాత సాధారణ ప్రజలను ఇంత పెద్ద ఎత్తున లక్ష్యంగా చేసుకున్న దాడి ఇదే. సతీశ్ దువా దీనిని గురించి మాట్లాడుతూ.. 'గత ఐదేళ్లలో కశ్మీర్ లోయలో పరిస్థితి మెరుగు పడింది. సానుకూల మార్పు వచ్చింది. ప్రజలు మళ్లీ సాధారణ జీవితానికి తిరిగి రావడం ప్రారంభించారు. పర్యాటకం కూడా వేగంగా అభివృద్ధి చెందుతోంది. టెర్రరిస్టులు ఎక్కువగా పర్యాటక ప్రాంతాలను లక్ష్యంగా చేసుకోరు. అది కశ్మీర్‌లోనైనా మరెక్కడైనా. ఎందుకంటే టెర్రరిస్టులు అలా చేస్తే, అది స్థానిక కశ్మీరీల జీవనోపాధిని లక్ష్యంగా చేసుకోవడమే అవుతుంది. టెర్రరిస్టులు స్థానికుల నుంచి మద్దతు ఆశిస్తారు. అలా దాడి చేస్తే వారికి మద్దతు దొరకదు' అని అన్నారు. 'నేను కార్ప్స్ కమాండర్‌గా పనిచేసినపుడు కశ్మీర్‌కు రావొచ్చా అని ప్రజలు నన్ను అడిగేవారు. దయచేసి రండి అని చెప్పేవాడిని. దాల్ సరస్సు దగ్గర కూర్చోవచ్చు. పర్యాటక ప్రదేశాలను

(మిగతా 13వ పేజీలో)


# ఓ దుర్ఘటనను మతోన్మాదకావేశకావేశాలు రెచ్చగొట్టే సందర్భంగా మారుస్తున్న మీడియా

(అనువాదం: కొండూరి వీరయ్య) - సంజీవ్ కిశోర్ సూద్

ఏప్రిల్ 22న పహల్గాంలో జరిగిన దుర్ఘటనను మతోన్మాదపు దృక్కోణంలో దేశం ముందుంచటంలో ప్రసార మాధ్యమాలు – దృశ్యమానమైనవీ, వృత్తాంత భరితమైనవీ – పోటీ పడుతున్నాయి. ఏప్రిల్ 29న నా రోజువారీ సైక్లింగ్ సమయంలో దేశంలో ముస్లిం వ్యతిరేకత ఎంతగా వేళ్లూనుకుందో అర్థమైంది. ఆ రోజు ఇద్దరు బుర్ఖా వేసుకున్న మహిళలు నోయిడా సెక్టర్ 168 సమీపంలో ఉన్న చాప్రోలి గ్రామం కూడలి మీదుగా వెళ్తున్నారు. అందులో ఒకరు ఫోన్ ఎత్తిపెట్టి ఏదో రికార్డింగ్ చేస్తోందో లేక సెల్ఫీ తీసుకుంటుందో తెలీదు. దారిన పోయే వ్యక్తి ఒకరు జోక్యం చేసుకుంటూ రికార్డు చేసి పాకిస్థాన్ పంపుతావా ఏంటి అని కేకలేస్తున్నాడు. నిజానికి ఆ ఇద్దరు ముస్లిం మహిళలు వాళ్ల పనేదో వాళ్లు చేసుకుంటున్నారు. కానీ వాళ్లను చూసి వచ్చిన వ్యాఖ్యలు గమనిస్తే దేశంలో సాధారణ వ్యక్తుల్లో సైతం ముస్లింల పట్ల ద్వేషం, అపనమ్మకం ఏ స్థాయికి చేరాయో అర్థమవుతుంది.

పహల్గాంలో హిందువులైన పర్యాటకులను మతం అడిగి మరీ కాల్చి చంపారన్న వార్తలు ఎలక్ట్రానిక్ మీడియాలోనూ, డిజిటల్ మీడియాలోనూ పెద్ద ఎత్తున ప్రచారంలో ఉండటం వల్లనే సాధారణ భారతీయుల్లో కూడా ఈ రకమైన మనోభావాలు గడ్డకట్టుకునే స్థాయికి చేరి ఉండవచ్చు. పహల్గాంలో జరిగిన దాడి హేయమైనదనటంలో సందేహం లేదు. ఉగ్రవాదుల స్వైర విహారంలో 26 మంది పర్యాటకులు చనిపోయారు. ఈ పరిస్థితుల్లో చనిపోయిన వారిలో హిందూ ముస్లింలు ఎందరు, చంపిన వారెవరు అన్న కోణంలో కాకుండా ఇంత తీవ్రమైన నిరంతర నిఘా నీడలో ఉన్నా కూడా కశ్మీర్ లోయలో ఉగ్రవాదులు ఎలా జొరబడ్డారు, ఎలా ఆ ప్రాంతానికి చేరుకున్నారు, ఎలా అమాయకులను బలిగొన్నారు, ఉగ్రవాదులు ఈ ప్రాంతానికి సాయుధులై చేరుతున్న సమయంలో మన భద్రతా బలగాలు వీళ్ల కదలికలను పసిగట్టకుండా ఏమి చేస్తున్నాయనే కోణంలో చర్చలు జరిగితే మరింత లోతైన వివరాలు, విషయాలు పాఠకులు, వీక్షకుల దృష్టికి వచ్చేవి. ఎలక్ట్రానిక్ మీడియా అయినా ప్రింట్ మీడియా అయినా దృష్టి సారించాల్సిన కోణాలు ఇవి. ఇంతగా పర్యాటక రద్దీ ఉన్న ప్రాంతంలో భద్రతా బలగాలు కనీసం స్థానిక పోలీసులు ఒక్కరు కూడా ఎందుకు లేరన్నది మీడియా వేయాల్సిన మరో ప్రశ్న.

దీనికి భిన్నంగా మీడియా మాత్రం హిందువులనే లక్ష్యంగా




చేసుకుని కాల్పులు జరిగాయి అన్న ఓ బాధిత కుటుంబ సభ్యుని వ్యాఖ్యలనే పదేపదే ప్రసారం చేస్తున్నాయి. అవసరమైన రీతిలో తనిఖీ, పునఃపరిశీలన జరిగిన తర్వాతనే ఈ వీడియోలు ప్రసారం చేస్తున్నారా ? లేక వచ్చింది వచ్చినట్లు ప్రసారం చేస్తున్నారా ? అన్నది తెలీదు. హిందువులనే లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరిగాయన్న వార్తలు పుంఖానుపుంఖాలుగా ప్రసారం అవుతుంటే ఎంతో మంది పర్యాటకులను కాపాడటంలో ప్రాణాలకు తెగించి కృషి చేసిన స్థానిక ముస్లింల గురించిన కథనాలు మాత్రం మీడియా దృష్టిని ఆకర్షించలేకపోయాయి. మీడియా పాలకవర్గ దృక్కోణాన్ని నెత్తికెత్తుకొంటోందని, వాస్తవాలు చూడనిరాకరిస్తోందని చెప్పటానికి ఇది ఓ ఉదాహరణ. గందరగోళంలో చిక్కుకున్న పర్యాటకులను సాదరంగా ఆహ్వానించి తమ ఇళ్లల్లో ఆశ్రయం ఇచ్చి చివరకు మసీదులు కూడా వారికి శిబిరాలుగా ఏర్పాటు చేసిన విషయాలు గురించి లోకానికి తెలియచేసేందుకు మీడియా పెద్దగా ఆసక్తి చూపటం లేదు. స్థానిక ముస్లింలు అందించిన సహాయాన్ని కృతజ్ఞతా పూర్వకంగా ప్రశంసిస్తున్న పర్యాటకుల సోషల్ మీడియా పోస్టులు మాత్రం పెద్దగా ఆదరణకు నోచుకోలేదు.

పర్యాటకులను గుర్రాలపై తీసుకెళ్లే స్థానిక పర్యాటక రంగ సహచరుడు సయ్యద్ ఆదిల్ హుస్సేన్ ఉగ్రవాది నుంచి తుపాకి లాక్కోవడానికి చేసిన ప్రయత్నంలో తూటా గుండెల్లోంచి దూసుకెళ్లటంతో చనిపోయారు. ఈ విషయంగా ఒకటి రెండు టీవీ చర్చల్లో పాల్గొనే అవకాశం నాకు వచ్చింది. కానీ టీవీ స్టూడియోలో ఉన్న వ్యాఖ్యాతలు, యాంకర్లు పదేపదే నేను చెప్పదల్చుకున్నది పూర్తి చేసేంత వరకూ కూడా ఓపిక లేకుండా వ్యవహరించారు. మధ్యమధ్యలో అనేకసార్లు నన్ను వారించటానికి ప్రయత్నం చేశారు. ఈ విషయాన్ని పదేపదే ఛానల్ వారి దృష్టికి తేవటంతోపాటు దేశంలో వివిధ ప్రాంతాల

నుంచి వచ్చిన పర్యాటకులు ప్రధానంగా హిందువులే అన్న విషయాన్ని నొక్కి చెప్పాల్సి వచ్చింది.

హిందువులన్న వారిని ఎంపిక చేసుకుని కాల్చారన్న వార్తలో ఎంత నిజం ఉందో పర్యాటకుల స్వీయానుభవాలు నమోదు కానీయకుండా ఏకపక్షంగా పహల్గాం దాడి అంతా కేవలం హిందువులకు వ్యతిరేకంగా సాగిన దాడి అన్న వ్యాఖ్యానాలు ప్రసారం చేయటం ద్వారా సాధారణ ప్రజల్లో సైతం ఇరుగు పొరుగున నివసిస్తున్న ముస్లింల పట్ల ఏహ్యభావాన్ని నింపటానికి ప్రయత్నం జరుగుతోందన్న విషయం కూడా అంతే వాస్తవం. పహల్గాం ఉదంతాన్ని మతోన్మాద దృక్కోణంలో చూపించటం ద్వారా ఇప్పటికే దేశంలో పేట్రేగిపోతున్న ముస్లిం వ్యతిరేక భావోన్మాదాలకు ఆజ్యం పోస్తోంది మీడియా. ఈ పరిస్థితులు దేశవ్యాప్తంగా ఏదో ఒక వృత్తి కోసం పొట్ట చేతబట్టుకుని వచ్చిన కశ్మీరీలు, ముస్లింలకు వ్యతిరేంగా దాడులను ప్రేరేపిస్తున్నాయి.

ప్రతి రోజూ రాత్రి ఎనిమిది గంటలకు టీవీల్లో జరిగే చర్చల్లో కేవలం ముస్లిం వ్యతిరేకతే ప్రధానంగా సాగటం దేశంలో సాధారణ ప్రజల్లో సైతం వేళ్లూనుకుంటున్న ముస్లిం వ్యతిరేకతకు నిదర్శనం. నా వ్యాసం మొదట్లో ప్రస్తావించిన సంఘటనలు అమాయకులైన సాధారణ ముస్లింలు తమ జీవనోపాధి కూడా గౌరవంగా పొందలేని పరిస్థితులు కల్పిస్తున్నాయి. పైన ప్రస్తావించిన సంఘటన ఏదో ఒకటో అరగా జరిగిన వ్యవహారం కాదు. అకస్మాత్తుగా జరిగింది కూడా కాదు. దశాబ్దానికి పైగా సాగుతున్న ముస్లిం వ్యతిరేక మతోన్మాద ప్రచారం ఫలితమే ముస్లింలపై వేళ్లూనుకుంటున్న ద్వేషభావన. దీనికి పోలీసు సిబ్బంది తమ వంతు సహాయక పాత్ర పోషిస్తున్నారు. ఈ మధ్య కాలంలో జరిగిన దాడులు గురించి చూశాము. దాడులను నియంత్రించాల్సిన పోలీసు సిబ్బంది ప్రేక్షకపాత్ర వహిస్తూ ఉంటే వారి కళ్ల ముందే ముస్లిం కుటుంబాలు నాశనం చేసే స్థాయికి చేరింది. మరికొన్ని చోట్ల పోలీసులు ముష్కరులతో కలిసి ముస్లింలపై దాడులకు తెగబడ్డారు.

దాడులు, ముస్లింలకు వ్యతిరేకంగా జాతి వ్యతిరేక కార్యకలాపాలు నుంచి ముస్లింలను చట్టాలు కూడా కాపాడలేకపోతున్నాయి. అనేక సందర్భాల్లో కోర్టులకెక్కటం అంటే జీవితాంతం శిక్ష అనుభవించటంగా మారిపోయింది. సుదీర్ఘమైన విచారణ తర్వాత నేరారోపితులైన ముస్లింలు గౌరవంగా నిర్దోషులుగా జైళ్ల నుండి బయటికి వస్తున్నా ఆపాటికి వారి కుటుంబాలు కకావికలై కుటుంబ సభ్యులు బతుకులు ఛిద్రమవుతున్నాయి. ముస్లిం వ్యతిరేక భావోద్వేగాలను రెచ్చగొట్టడంలో భాగంగా మన రోజువారీ వ్యవహారాల్లో లవ్ జీహాద్, లాండ్ జీహాద్, ఓట్ జీహాద్, చివరకు యూపీఎస్సీ జీహాద్ వంటి పదాలు చొరబడుతున్నాయి. మసీదుల ముందు సంఘవిద్రోహ శక్తులు వికృత కార్యకలాపాలకు పాల్పడటం ఈ మధ్యకాలంలో సాధారణమైపోయింది. పండలు, పర్వదినాల్లో జరిగే ప్రదర్శనల్లో భాగంగా కత్తులు, ఇతర మారణాయుధాలు ప్రదర్శిస్తూ మసీదుల ముందు వికృత చేష్టలకు పాల్పడటం అప్పుడప్పుడూ ఘర్షణలకు దారితీస్తోంది. అనేక రాష్ట్రాల్లో ప్రభుత్వాలు చివరకు సుప్రీం కోర్టు ఆదేశాలు సైతం లెక్కచేయకుండా ముస్లింల నివాసాలను, వాణిజ్య కేంద్రాలను బుల్డోజర్లతో కూల్చివేస్తున్నాయి. ముస్లింలు కనీసం నోరెత్తి తమ గోడు చెప్పుకునేందుకు అవకాశం లేకుండా పోతోంది. ఈ మొత్తం వ్యవహారాలకు ప్రధాన కారణం మీడియానే అని చెప్పాలి. ఈ నేపథ్యంలోనే హిందూ ముస్లిం చీలికను పెంచే లక్ష్యంతో మీడియా సంస్థలు కశ్మీరీలను దోషులుగా చూపడానికి పదేపదే ప్రయత్నం చేయటం చూస్తున్నాము. ప్రాణాలు దక్కించుకున్న పర్యాటకులు మీడియా కథనాలకు భిన్నంగా తమ వాస్తవిక అనుభవాలు పంచుకోవటం కాస్తంత ఉపశమనం కలిగించే అంశం. సమాజంలో మరింత చీలికలు, విద్వేషాలు చెలరేగిపోకుండా ఉండాలంటే ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని నివారణోపాయాలు ఆలోచించాలి.

2008లో ముంబైపై దాడులు జరిగినప్పుడు అప్పటి ప్రధాని మన్మోహన్ ప్రకటనను, 2025లో పహల్గాం దాడి తర్వాత ప్రధాని మోడీ ప్రకటనను పోల్చి చూడటం ఉపయుక్తంగా ఉంటుంది. ముంబై దాడుల నేపథ్యంలో అప్పటి ప్రధాని 'ఈ దాడుల వెనకున్న శక్తులు లౌకిక ప్రజాతంత్ర దేశంలో మతోన్మాదాన్ని రెచ్చగొట్టేందుకు, సామాజిక ఆర్థిక అభివృద్ధిని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ దాడులతో లౌకిక ప్రజాతంత్ర భారతం అన్న భావనే పెనుసవాళ్లు ఎదుర్కొంటోంది సమైక్యంగా మనం ఈ సవాళ్లను అధిగమించాలి' అని పిలుపునిచ్చారు. అప్పటి వరకూ మతోన్మాద ప్రవృత్తితో దేశ ప్రజలు రెండు శిబిరాలుగా చీలిపోలేదు కాబట్టి ప్రధాని మన్మోహన్‌సింగ్ ఉగ్రవాద వ్యతిరేక పోరాటంలో దేశాన్ని ఏకతాటి మీద నిలబెట్టగలిగారు. ముంబైదాడుల నేపథ్యంలో పరిస్థితులు మతోన్మాద రాజకీయాలకు పెద్దపీట వేయలేకపోవటానికి మరో కారణం అప్పట్లో మీడియా మౌలిక లక్ష్యాలు, ఆదర్శాల విషయంలో రాజీ పడలేదు. స్వయం ప్రతిపత్తిని నిబద్ధతను నిలుపుకుంటూనే వచ్చింది. విపత్కర పరిస్థితుల్లో మతోన్మాదపు ధోరణులకు అవకాశం ఇవ్వలేదు. దురదృష్టవశాత్తూ నేడు పరిస్థితులు ఎంతో మారిపోయాయి. ప్రధాన స్రవంతి మీడియా, డిజిటల్ మీడియాలో ఓ భాగం నిరంతరం విచ్ఛిన్నకరవాదనలు సమాజం ముందుంచి ప్రజల మధ్య అగాధం పెంచేందుకు మాత్రమే పని చేస్తున్నాయి. విద్వేషపూరిత ప్రచార సాధానాలుగా మారిన మీడియా భారతదేశ వైఫల్యానికి కీలక కారణంగా మారుతుంది. ప్రజాస్వామ్య పరిరక్షణలో నాల్గో స్థంభంగా మీడియా తన విధి నిర్వహణకు కట్టుబడి ఉండాలి. ❑

# 'సరిహద్దులు' దాటుతున్న ఉన్మాదం..
# ఉన్మత్తతతో ఊగిపోతున్న కాషాయదళం..



- వీరయ్య కొండూరి

**భారత్ పాకిస్తాన్‌ల మధ్య సైనిక చర్యలు నిలుపుదల చేసి, దాదాపు మూడు రోజులు అవుతుంది. ఈ మూడు రోజులలో పాకిస్తాన్ వ్యతిరేకత తలకెక్కించుకున్న కొందరు వేస్తున్న వీరంగం దేశానికి పొంచి ఉన్న ప్రమాదం గురించి హెచ్చరిస్తుంది. నిజానికి చర్చించాల్సిన ఘటనలు వందల సంఖ్యలోనే ఉన్న స్థలభావం రీత్యా ఇక్కడ రెండు ఘటనలకు మాత్రమే పరిమితమవుతున్నాము. మొదటిది కరాచీ బేకరి ఉదంతం, రెండవది భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ ట్రోలింగ్ ఉదంతం.**




కరాచీ బేకరీల దుకాణాలపై విశాఖపట్నంలోనూ హైదరాబాద్ శివార్లలోనూ దాడులు జరిగాయి. శంషాబాద్‌లోని కరాచీ బేకరీ దుకాణంపై బీజేపీ అనుబంధ సంఘాలుగా చెప్పుకుంటున్న వారు దాడి చేసి బీభత్సం సృష్టించారు. కరాచీ అనే పేరును తీసివేయాలని దాడికి పాల్పడిన దుండగులు డిమాండ్ చేశారు. పాకిస్తాన్ వ్యతిరేక నినాదాలు ఇచ్చారు. ఈ వార్త వైరల్ కాగానే తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కరాచీ బేకరీ దుకాణాలకు భద్రత కలిపించే విషయంలో రాష్ట్ర డీజీపీ జితేంద్రకు ఆదేశాలు ఇచ్చారు. అయితే, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి తెలంగాణ ప్రాంతానికి చెందిన వాడే అయినప్పటికీ కరాచీ బేకరీ ఘటనపై నోరుమెదపకపోవడం గమనించాల్సిన విషయం. దుకాణం యజమానులు తమకు, పాకిస్తాన్‌కు ఎటువంటి సంబంధం లేదని మొత్తుకుంటున్నా దుండగులు తమ విధ్వంసక చర్యలను మాత్రం ఆపలేదు. కారణం కరాచీ అనగానే పాకిస్తాన్ అని. ఈ పేరు పెట్టుకున్న కంపెనీ యజమానులు పాకిస్తానీయులనే అపోహ మాత్రమే.

ఈ రెండు ఘటనల వెనుక ఉన్న కారణం ఒక్కటే పాకిస్తాన్ వ్యతిరేకత, కశ్మీరీల పట్ల వ్యతిరేకత. కరాచీ బేకరీని పాకిస్తాన్‌కు ప్రతినిధిగాను, విక్రమ్ మిస్రీని దేశద్రోహి గాను అపార్ధం చేసుకోవడంలోనే ఈ ముష్కరమూకల కార్యాచరణకు పునాదులు ఉన్నాయి. చరిత్ర అధ్యయనం పట్ల సంఘ పరివారం, బీజేపీ శ్రేణుల్లో ఉన్న సార్వత్రిక విముఖత కారణంగానే కరాచీ బేకరి అంటే పాకిస్తాన్ ప్రతినిధి అనే అవగాహనకు ఆలోచనలు కుదించుకుపోయాయి. నిజంగా కరాచీ అని పేరు పెట్టుకున్నంత మాత్రాన ఆ సంస్థ ముస్లింలదేనా? అందులోనూ పాకిస్తాన్ నుంచి వచ్చిన ముస్లింలదేనా? అనే ప్రశ్నలు వేసుకుంటే ఎన్నో ఆసక్తికరమైన విషయాలు, వివరాలు వెల్లడవుతున్నాయి.

కరాచీ బేకరీ ప్రపంచవ్యాప్తంగా 20 దేశాలకు బేకరీ ఉత్పత్తులను ఎగుమతి చేస్తున్న ఒక ప్రైవేట్ కంపెనీ. దాని యజమాని ఖాన్ చంద్ రామ్‌నాని. ఈయన అవిభక్త భారత్‌లో అంటే స్వాతంత్ర్య పూర్వపు భారతదేశంలో అందరిలాగే నిఖార్సైన భారతీయుడు. ఆయన జన్మస్థలం అప్పటి కరాచీ, ఇప్పుడు ఇదే నగరం పాకిస్తాన్‌లోని ఒక ముఖ్యమైన సింధ్ రాష్ట్ర రాజధాని. భారత్ నుంచి పాకిస్తాన్ వేరుబడిన తర్వాత 1947 నుంచి 1959 వరకు కరాచీ పాకిస్తాన్‌కు దేశ రాజధానిగా ఉంది. దేశ విభజన సమయంలో ఉమ్మడి పంజాబ్ నుంచి భారతదేశానికి వలస వచ్చిన లక్షలాది మంది భారతీయులలో, ముస్లిమేతరులలో ఖాన్‌చంద్ రామ్‌నాని కూడా ఒకరు. ఈయన సింధ్ రాష్ట్రంలోని కరాచీ నుంచి హైదరాబాద్‌కు వలస వచ్చిన హిందూ కుటుంబానికి చెందిన వారు. తమ చారిత్రక వారసత్వానికి గుర్తుగా తాను 1960 దశకంలో ప్రారంభించిన బేకరీ వ్యాపారానికి కరాచీ బేకరీ అని పేరు పెట్టుకున్నారు. మొదట్లో ఇది మొజంజాహీ మార్కెట్‌లో సీనా బేకరీ పక్కన ప్రారంభమైన చిన్న దుకాణం, నేడు దేశవ్యాప్తంగా ప్రధాన నగరాలన్నింటిలోను తనదైన ముద్ర వేసింది.

హైదరాబాద్‌లో ప్రతి టీకొట్టులోనూ దొరికే ఉస్మానియా బిస్కెట్‌లు మొట్ట మొదటిగా తయారు చేసింది ఖాన్‌చంద్ రామ్‌నాని అంటే ఆశ్చర్యపడక తప్పదు. సింధ్ ప్రాంతం నుంచి

వలస వచ్చిన సింధీ వ్యాపార కుటుంబానికి చెందిన ఖాన్‌చంద్ రామ్‌నాని తొలినాళ్లలో అనేక వృత్తులు చేసిన తర్వాత 1960లో బేకరీ రంగంలో ప్రవేశించారు. ఈ రంగంలోను మొదట కొంత కాలం రిటైల్ వ్యాపారిగా ఉన్నారు. బేకరీ ఉత్పత్తుల తయారీలో తనకున్న అనుభవం, ఆసక్తిని ఉపయోగించి ఉస్మానియా బిస్కెట్‌లు, ఫ్రూట్ బిస్కెట్‌లు, డ్రై ఫ్రూట్ బిస్కెట్‌లు, దిల్‌ఖుష్, ప్లమ్ కేక్, మ్యాక్రాన్స్ వంటి పలు సృజనాత్మక ఉత్పత్తులను మార్కెట్‌లోకి విడుదల చేశారు. 2000 సంవత్సరం తర్వాత మారుతున్న వినియోగదారుల ఆసక్తులను దృష్టిలో పెట్టుకొని రామ్‌నాని వారసులు ఓట్‌మీల్, రాగి ఉత్పత్తులు, చక్కెరలేని బిస్కెట్‌లు, చక్కెరలేని బేకరీ ఉత్పత్తులు వంటివి మార్కెట్‌కు పరిచయం చేశారు. ప్రస్తుతం రాజేశ్ రామ్‌నాని, హరీష్ రామ్‌నాని, విజయ్ రామ్‌నాని కరాచీ బేకరీని దేశవ్యాప్తంగా విస్తరింపజేస్తున్నారు. ప్రస్తుతం కరాచీ బేకరీ హైదరాబాద్ దక్కనీ సంస్కృతిలో అంతర్భాగంగా మారింది.

ఇటువంటి విశిష్టమైన సాంస్కృతిక వారసత్వం కలిగిన కరాచీ బేకరీపై సంఘ్ పరివారం దాడులు ఇప్పటివి కావు. 2019లో ఉగ్రవాదులు పుల్వామాలో సైనిక వాహన సముదాయంపైన జరిపిన దాడుల నేపథ్యంలో బెంగళూరులోని కరాచీ బేకరీ దుకాణంపై స్థానిక బీజేపీ శ్రేణులు దాడి చేశాయి. అంతకంటే ముందు 2008లో ఉగ్రవాదులు ముంబై నగరంపై దాడి చేసినప్పుడు కూడా ముంబైలో శివసేన శ్రేణులు, 2020లో మహారాష్ట్ర నవనిర్మాణ శ్రేణులు కరాచీ బేకరీ మీద దాడి చేశాయి. ఈ మౌలిక వాస్తవాలను విస్మరించి కరాచీ పేరు ఉన్నంత మాత్రానా వారంతా పాకిస్తాన్ అనుయాయులుగా భావించే స్థాయికి చేరుకోవడం సాధారణ ప్రజలలో కూడా మతోన్మాద భావాలు ఏ స్థాయికి చొప్పించబడుతున్నాయో అర్థం చేసుకోవడానికి ఉపకరించే అంశం.

ఇక రెండవ ఉదంతం భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ ట్విట్టర్ ఖాతాకు తాళం వేయాల్సిన పరిస్థితి. శనివారం సాయంత్రం 5 నుంచి భారత్ పాకిస్తాన్ మధ్య భూతలంలోనూ గగనతలంలోనూ కాల్పుల విరమణ అమలులోకి వచ్చిన తర్వాత ఆదివారం తెల్లారేసరికి విక్రమ్ మిస్రీ ట్విట్టర్ ఖాతా బూతులతో నిండిపోయింది. ఈ కాల్పుల విరమణ నిర్ణయాన్ని విక్రమ్ మిస్రీయే తీసుకున్నట్టు, అందువల్ల ఆయన ద్రోహి అని ట్విట్టర్ ఖాతాలలో ఉన్న కొందరు ఐటీ జనరేషన్ మతోద్రేకులు విక్రమ్ మిస్రీ ట్విట్టర్ ఖాతా టైమ్‌లైన్‌లో వందల సంఖ్యలో దారుణంగా విమర్శిస్తూ పోస్టులు పెట్టారు. కొన్ని పోస్టులలో ఉన్న విమర్శలు వ్యవహారపరమైన భిన్నాభిప్రాయాలను వ్యక్తిగత ద్వేషం స్థాయికి తీసుకెళ్లిన తీరు ఆందోళనకరంగా ఉంది. అంతకంటే ఆందోళనకరమైన విషయమేంటంటే ఈ దాడిని ఖండించేందుకు కేంద్ర ప్రభుత్వం కానీ, విదేశాంగ మంత్రి కానీ, బీజేపీ నాయకత్వం కానీ ముందుకు రాకపోవడం.

సరిహద్దు వెంబడి ఉద్రిక్తతలు తీవ్రమై పరస్పర కాల్పుల వరకు వెళ్లిన నాలుగు రోజులపాటు రక్షణ శాఖ తరపున విలేకరుల సమావేశంలో పాల్గొన్న ఏకైక ప్రభుత్వ ప్రతినిధి విక్రమ్ మిస్రీ. ఒక దశలో మే 7వ తేదీ వేకువజామున భారత సైన్యం సాగించిన మెరుపు దాడులలో జైషే మొహమ్మద్ ఉగ్రవాద సంస్థకు చెందిన ముఖ్యమైన నాయకుడు అబ్దుల్ రౌఫ్ అజాద్ చనిపోయాడని బీజేపీ సోషల్ మీడియాలో పోస్టులు వచ్చాయి. దీనిపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు స్పందిస్తూ 'ఈ విషయంపై ఇంకా సమాచారం రాలేదు' అని సున్నితంగా బీజేపీ చేస్తున్న ప్రచారం తప్పుడు ప్రచారమని చెప్పకనే చెప్పారు. మే 10వ తేదీ సాయంత్రం నుంచి అమలులో ఉన్న కాల్పుల విరమణ తర్వాత కుప్పలు తెప్పలుగా వచ్చిన సోషల్ మీడియా పోస్టులలో ప్రత్యేకించి ట్విట్టర్ పోస్టులలో విక్రమ్ మిస్రీ దేశద్రోహి అని, తన కూతురును విదేశాలకు పంపించి తాను పాకిస్తాన్ ముందు సాగిలపడుతున్నాడని, వెన్నుపూస లేని వాడని, పాకిస్తాన్‌తో కాల్పుల విరమణకు ప్రాధేయపడ్డాడని విచ్చలవిడిగా డిజిటల్ దాడి(ట్రోలింగ్) జరగటంతో విధిలేని పరిస్థితుల్లో విక్రమ్ మిస్రీ తన సోషల్ మీడియా ఖాతాలు ఇతరులకు అందుబాటులో లేకుండా తాళం వేసుకున్నారు. మరికొంతమంది విక్రమ్ మిస్రీ కుటుంబసభ్యుల ఫొటోలు కూడా డిజిటల్ స్పేస్ నుంచి తవ్వి తీసి మరీ తిట్లపురాణం ఎత్తుకున్నారు.

ఇవి సరిహద్దుల్లోని ఉద్రిక్తతలను దేశం లోపలికి తెచ్చి ఇరుగు పొరుగున ఉన్న ప్రజల మధ్య అనుమానాలు, అపోహలు, దురభిప్రాయాలు కలిగించేందుకు తద్వారా ఎక్కడిక్కడ ప్రజల్లో శాశ్వతమైన శత్రుభావాన్ని పెంచిపోషించేందుకు సంఘ్ పరివారం కేంద్ర ప్రభుత్వం ప్రాపకంతో సాగిస్తున్న దాడులు ఇవి.

**దేశ సరిహద్దుల లోపలే ప్రజలను చీల్చేందుకు విషబీజాలు నాటుతున్న సోషల్ మీడియా వారియర్‌ల గురించి, సరిహద్దులలో సైనికులు సాగించిన భౌతికయుద్ధం కంటే ఎక్కువ స్థాయిలో సరిహద్దుల లోపల టీవీ స్టూడియోలలోనూ డిజిటల్ స్పేస్‌లోనూ కొందరు సాగిస్తున్న భావోద్వేగ వికృత యుద్ధం దాని వల్ల జరుగుతున్న నష్టం గురించి సోమవారం సాయంత్రం ప్రధాని మోడీ జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలో కనీసం ప్రస్తావించకపోవడం గమనిస్తే డిజిటల్ స్పేస్‌లో జరుగుతున్న ఈ దాడుల వెనుక ప్రభుత్వ పెద్దల అండదండలు, ప్రోత్సాహం ఉన్నదని స్పష్టం అవుతుంది.** ❑

# ఒక ప్రయాణం - భిన్న సందర్భాలు

(లక్నో-కాన్పూర్ -కాకోరీ స్మృతులు)



- గౌరవ్

కాకోరీ. ఆగస్టు 9, 1925. సరిగ్గా వందేళ్ల క్రితం ఈ దేశపు యువ ధిక్కారాన్ని అగ్గిరగిల్చి ప్రపంచమంతా బిగ్గరగా పరిచయం చేసిన పేరు. హిందూస్థాన్ సోషలిస్టు రిపబ్లికన్ అసోసియేషన్ విప్లవకారులు ప్రత్యక్షంగా పాల్గొన్న విప్లవాచరణ అది. ఎన్నాళ్ల నుండి అనుకుంటున్నానో, ఇన్నాళ్ళకి వెళ్ళడమే కాక ఆ ఘటన మొత్తాన్ని రచించిన లక్నోలోని పురాతనమైన చేద్దీలాల్ ధర్మశాలలో ఓ రెండు రోజులు ఉండటం కుదిరింది. అప్పట్లో 227 గదిలో కాకోరీ పోరాట ప్రణాళిక సిద్ధం చేశారని అంటారు. అందులో ఉండటం కాలేదు కానీ అసలు ఇప్పుడున్న పరిస్థితుల్లో ఏ మాత్రం ఉండలేని 327 బాగా దుమ్ము పట్టున్న పాత గదిని ఇక తప్పక తీసుకున్నాను. రామ్‌ప్రసాద్ బిస్మిల్, అష్ఫాఖుల్లా ఖాన్ ఇద్దరూ మతాల్ని పక్కనపెట్టి సగటు మనిషిని దోపిడీ నుండి విముక్తి చేయడం కోసం హిందూ ముస్లిం సమైక్యతకు ప్రతీకగా సామ్రాజ్యవాదం మీద చేసిన పోరాటం కాకోరీ. 'విభజించి పాలించు' అనే పాలకుల పన్నాగాన్ని తుత్తునియలు చేసిన అసాధారణ కార్యక్రమం కాకోరీ. ఆ స్మృతులతో నిర్మించిన అమరుల స్మారక కేంద్రం కాకోరీ ఊరికి కొంత దూరంలో ఉంది. పట్టింపు లేదు. బాగా దుమ్ముపట్టి నిర్లక్ష్యానికి నిదర్శనంలా ఉంది.

**ఇక కమ్యూనిస్టు పార్టీ మొదటి మహాసభ**

ఒకనాడు Revolutionary Capital of Indiaగా పేరొందిన కాన్పూర్‌లో 1925, డిసెంబర్‌లో జరిగిన ఈ మహాసభ వివరాలు లభిస్తున్నవి తక్కువే. జరిగింది, జరిగిందనే కానీ ఆయా స్థలం తదితర వివరాలు ఒక్కరంటే ఒక్కరికి కూడా నిర్ధారణగా తెలీదు. కాంగ్రెస్ పార్టీకి చెందిన చాలా మంది కమ్యూనిస్టు వ్యవస్థాపక సమావేశంలో ఉన్నారు. పదుల సంఖ్యలో పాత కామ్రేడ్స్‌తో మాట్లాడి తీగ లాగితే మొత్తానికి గ్వాల్టోలి అనే దగ్గర మక్బారా వద్ద ఉన్న స్థలంలో ఆ సమావేశం జరిగిందనే డొంక దొరికింది. అసలా వివరాలు చెప్పగల వాళ్లు ఇప్పుడెవరు మిగల్లేదు సరికదా పదుల సంఖ్యలో ఉన్న వామపక్ష పార్టీలకు కనీసం ఆ వివరాలు ఇప్పటి వరకు పట్టలేదు. అందుకనే అక్కడ కనీసం ఒక్క స్మృతిచిహ్నం కూడా లేదు. మొత్తానికి ఎలాగోలా ఓ లింక్ పట్టుకు వెళ్లి ఆ గ్రౌండ్ ఫొటోస్ తీసుకున్నాను. మొత్తం పాడుబడ్డ రోడ్లు, చెత్త చెదారంతో ఉంది. భారతీయ సామ్యవాద మహాసభ సంస్థాపక సమావేశం అక్కడ జరిగిందంటే నమ్మలేం.

కమ్యూనిస్టు పార్టీ చరిత్ర చెప్పేటప్పుడు గుర్తుకు వచ్చే మొదటి వ్యక్తి హజ్రత్ మొహానీ. 'ఇంక్విలాబ్ జిందాబాద్' నినాద రూపకర్త. 'సంపూర్ణ స్వాతంత్రం' కోసం నినదించిన ఉద్యమ కారుడు. మొట్టమొదటి కమ్యూనిస్టు మహాసభ ఆహ్వానసంఘ అధ్యక్షుడు. అధ్యక్ష ప్రసంగం చేసిన వ్యక్తి. 'అభ్యుదయ రచయితల సంఘం' వ్యవస్థాపకుల్లో ఒకరు. ఇలా చెప్పుకుంటే ఎన్నో. నాకు ఎంతో ఇష్టమైన కవి. 'చుప్కే చుప్కే రాత్ దిన్ ఆన్సూ భహానా యాద్ హై...' విన్న ప్రతిసారీ గుండె ద్రవిస్తుంది. ఆయన జ్ఞాపకాలతోపాటు మహాత్మాగాంధీతో సహా ఎన్నో విలువైన ఆనాటి జ్ఞాపకాలతో నిండిన 'ఫిరంగి మహల్'ను చూడటం ఒకెత్తయితే, ఊరి మారుమూలొక రజాబ్ గంజ్ అనే చోట బాహ్ మౌల్వీ అన్వర్ అనే మసీదులో లిటరల్‌గా అష్టకష్టాలు పడి లోపల గల స్మశానంలో సమాధుల్ని వెతుక్కుని తప్పక తాళం తీయించి, చల్లటి చెట్టు నీడలో శాశ్వత విశ్రాంతి తీసుకుంటున్న మహనీయుడు హజ్రత్ మొహానీ స్మృతిని దర్శించుకోవడం ఇన్నాళ్ళకి నెరవేరింది.

ఒక ఆసక్తికర విషయం చెప్పాలి. మొదటి భారతీయ కమ్యూనిస్టు మహాసభ చేసిన తీర్మానాల్లో రోజా లక్సమ్బర్గ్, కార్ల్ లిబ్నిష్కల హత్యల్ని ఖండిస్తూ చేసిన తీర్మానం ఒకటి. తిరుగులేని రష్యన్ ప్రభావంతో దేశంలో మొట్టమొదట కమ్యూనిస్టు పార్టీ స్థాపిస్తున్న సమావేశంలో, అదే దేశంలో సిద్ధాంత విభేదాలతో చంపబడిన ఇరువురు మేధావులు, బుద్ధి జీవులకి నివాళి అర్పించడం భారతీయ కమ్యూనిస్టు ఉద్యమ ప్రజాతంత్ర దృక్పథానికి తిరుగులేని నిదర్శనం. ప్రపంచచరిత్రలో మరే దేశంలోనూ నాటికి, నేటికీ జరగని అపూర్వ విషయం. భిన్నాభిప్రాయాలు ఎన్నున్నా, ఈనాడు ఆదివాసుల మీద దేశవ్యాప్తంగా జరుగుతున్న హింసాకాండలో మౌనం పాటిస్తున్న మేధావులు మెలకువలో కూడా గ్రహించలేని విషయమిది. నక్సలైట్లనే నెపంతో పదుల సంఖ్యలో సాటి మనుషుల్ని చంపుతుంటే నోరు మెదపని మేధస్సు ఉంటే ఎంత ఉడితే ఎంత. రష్యన్ విప్లవంతో ప్రభావితమైన వారిలో హజ్రత్ మొహానీ ఒకరు. ఆనాడు ఆయన సభలో మాట్లాడుతూ భారతీయ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణ లక్ష్యాలు ఏ విధంగా ఉంటే మేలో ప్రసంగించారు. మద్రాస్ నుండి సింగరవేలు హాజరైన ఆ సభలో కులతత్వానికి వ్యతిరేకంగా చర్చ జరిగింది.

ఈ విషయం ప్రత్యేకంగా ప్రస్తావించడానికి కారణం ఉంది. నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో గణాంకాల ప్రకారం ఈ దేశంలో

ప్రతి 18 నిమిషాలకు దళిత బహుజనులు, స్త్రీలు, మైనారిటీల మీద ఒక దాడి జరుగుతోంది. వారానికి సగటున 13 మంది దళితులు హత్య చేయబడుతున్నారు. ఇంకా అనేక ప్రాంతాల్లో కులగజ్జి, అంటరానితనం బహిరంగంగానే అమలవుతోంది. బ్రాహ్మణత్వం, పెట్టుబడిదారీ స్వభావం కులాలకు అతీతంగా ప్రతి ఒక్కరిలోనూ ప్రవేశించింది. జీవితం సమష్టి సమ్మేళనంగా కాక వ్యక్తిగత వ్యవహారంగా మారింది. అహంకారం, గొప్పలు ప్రదర్శించుకోవడం ఉన్నతంగా చిత్రిస్తుంటే, సాటి మనుషుల్ని ప్రేమించడం, సమానత్వాన్ని పాటించడం, ఆదర్శాల్ని ఆచరించడం పిచ్చితనంగా భావించబడుతోంది. మార్పు కోసం పుట్టుకొచ్చిన ఉద్యమాలు అన్నీ ఈ కులతత్వానికి బలిపోయాయి. ఈ క్రమంలో అన్ని వామపక్ష విప్లవ రాజకీయాల్లో ఎన్నో విభేదాలకు, చీలికలకు కారణమైన 'కులం' గురించిన చర్చ కమ్యూనిస్టు వ్యవస్థాపక సమావేశంలో జరగడం ఎంత ఆహ్వానించదగిన విషయమో, తర్వాత కాలంలో కులనిర్మూలన దిశగా ఆ ప్రయత్నాన్ని చర్చను కొనసాగించక పోవడం అంతే బాధాకరమైన విషయం.

రెండు, గణేష్ శంకర్ విద్యార్థి. ఏం జీవితం ? జీవితం అంటే అది కదా, అనుకునే జీవితం. ఎన్నిసార్లు రాశాను. ఇంకెన్నిసార్లు ప్రసంగాల్లో ప్రస్తావించాను. అక్షరాలు, అంకితాలు సరే కానీ ఆయన జ్ఞాపకాలు మాత్రం పల్చబడుతున్నా ఇంకా పచ్చిగానే ఉన్నాయి. ఒక మెడికల్ కాలేజీ, ఒక పార్కు, రెండు గుళ్ళు నేటికీ ఆయన పేరిట మిగిలిన చిహ్నాలు. మత కలహాలను నిలువరించడానికి మానవత్వమనే ఆయుధంతో పోరాడి చనిపోయిన యోధుడు. రాజ్యాంగ స్ఫూర్తి చిహ్నంగా నాలుగు సింహాల ముద్ర కింద గణేష్ శంకర్ విద్యార్థిని చిత్రిస్తూ ఆయన హత్య జరిగిన చోట నిర్మించిన గుడి నాకు తెలిసి దేశంలోనే అపురూపమైనది. ఇప్పుడు పాడుపడిపోతోంది. ప్రతాప్ పత్రిక కార్యాలయం కూడా. ఎన్నేళ్లుగా అనుకుంటున్నానో, మనసారా ఆ మహనీయుడి త్యాగాన్ని కన్నీటితో స్మరించుకోడానికి. భారతీయ భావోద్యమాల చరిత్రలో మత సామరస్యం కోసం తన నెత్తుటితో చెరగని ముద్ర వేసిన అసాధారణ మహనీయుడు, అస్తమించని సూర్యుడు గణేష్ శంకర్ విద్యార్థి.

మూడో వ్యక్తి భదంత బోధనంద మహస్తవీర్. సాంప్రదాయక బౌద్ధాన్ని కాదని ఆధునిక యానంగా, ప్రజా ప్రవాహంగా భారత దేశంలో బౌద్ధాన్ని ఉద్యమ స్థాయిలో నిర్మించిన ఇరువురు మహా వ్యక్తులుగా మొదట బిక్కు మహావీర్‌ను పేర్కొంటే, రెండు బోదానందను చెబుతారు. ఆశ్చర్యకరంగా, నవీన బౌద్ధానికి బలమైన రథచక్రాలుగా నిలిచిన మహాపండిత్ రాహుల్ సాంకృత్యాయన్, డా. బాబాసాహెబ్ అంబేద్కర్ ఇద్దరు కూడా బోధానంద్ జీవితంతో అత్యధికంగా ప్రభావితమయ్యారు. అంబేద్కర్ తన ధర్మ దీక్ష బోధానంద్ చేతనే స్వీకరించాలని, ఆయన ఆధ్వర్యంలో భిక్కువుగా మారాలని తపించారు. కానీ బోధానంద్ ఆకస్మిక మరణంతో కుదరలేదు. ఉత్తర భారతదేశంలో మొట్టమొదటిసారిగా బౌద్ధాన్ని పీడితుల కోసం ఉద్యమంగా మలిచిన భోదానంద్ స్వయంగా బెంగాలీ బౌద్ధ ఆశ్రమంలో ఉండి దీక్ష స్వీకరించి కూడా, అక్కడ ఆధిపత్యాన్ని కాదని వందేళ్ల కిందట 1925లో ఉత్తర భారత భావోద్యమం కోసం బుద్ధ విహారను స్థాపించారు. మూఢత్వాన్ని చీల్చి చెండాడేలా ఉండే ఆయన బోధలు ఈ నాటికి సంచలనమేనని విన్న వారు అంటుంటారు. ఆయన రచనలు ఇంకా బయటికి రావాల్సి ఉంది. అనేక మంది జిజ్ఞాసువులు శిష్యులుగా కలిగిన ఆయన నిత్యం సంచారంలోనే గడిపారు. వ్యక్తిగతంగా ఆయన నిర్మించిన, బాబాసాహెబ్ అంబేద్కర్ మూడుసార్లు సందర్శించి ముగ్ధులైన ఆశ్రమం ఇప్పుడు మరమ్మతుల్లో ఉంది. ప్రస్తుతం బిక్కు జ్ఞానలోక్ దాని బాధ్యతలు చూస్తున్నారు. ఆయనతో కాసేపు చర్చించి, ఏవో కొన్ని సూచనలు చేసాను. ఎన్నాళ్ళుగానో నాలో స్ఫూర్తిని నింపుతున్న భదంత బోధానంద మహస్తవీర్ అంతిమ విశ్రమ స్థలాన్ని కూడా ఎక్కడికి దగ్గర్లోని బెంగాల్ బుద్ధ విహారాలో దర్శించుకోవడం ఇన్నాళ్ళకి నెరవేరిన కల. జీవితం నిజమని నమ్మేవాడిని, కలల్ని ఎక్కువ కాలం కనలేను. సత్యంతో సావాసం లేకుండా సాగలేను. ఇంతా చేసి ఉన్నది రెండు మూడ్రోజులే. విపరీతమైన వేడి, ఎండ. పరుగులాంటి పయనం. అయినప్పటికీ అవ్యక్తమైన సంతృప్తి. అదంతే.

ఎందుకని అడక్కండి. కృంగిపోతున్న గుండెని ఒడిసి పట్టుకుని చైతన్యాన్ని నెలకొల్పడం కోసం కృషి చేసి ఒదిగిపోయిన యోధులకు కుదిరినంతలో నీరాజనాలు అర్పించడం కోసం. పదుల సంఖ్యలో జీవితాల్ని తృణప్రాయంగా త్యాగం చేసిన వీరుల అమరత్వంతో అమలిన కరచాలనం చేయడం కోసం. బతుకుబాటలో ఎడతెగని అన్వేషణకే అంకితమైన హృదయాలు ఎంతో బాధతో ఒలికించిన రక్తాశ్రువుల తత్వశాస్త్రాన్ని అయినంతలో అధ్యయనం చేయడం కోసం. ప్రమాదాల చీకట్లతో నిత్యం యుద్ధం చేస్తూ నమ్మిన సైద్ధాంతిక దివిటీలతో వెలుతురు నింపుతున్న యువ కాంతి పుంజాల కోసం. స్వార్థం కోసం ప్రజల్లో అనేక సంక్షోభాలు రెచ్చగొడుతున్న సందర్భంలో, అక్కడక్కడా ఇంకా పూర్తిగా ఎండిపోకుండా పారుతున్న మానవత్వం కోసం. అట్టడుగు వర్గపు మనిషి కోసం. అడుగారిన అంతరంగ తరంగాల్ని తట్టి లేపడం కోసం. మన తదనంతర తరాల కోసం. ఇంకా, మనందరి కోసం. మానవీయ పరంపర కోసం. మూడు విభిన్న నేపథ్యాల నుంచి వచ్చి చరిత్ర క్రమాన్ని తమవంతు ప్రభావం చేసిన ముగ్గురు మహనీయుల స్ఫూర్తిని దేశమంతటా యుద్ధవాతావరణం నింపు తున్న ఈ సమయంలో గుర్తు చేసుకోవడం నా వరకు నాకో బలం. ఈ దేశపు మానవీయ సౌందర్య సారం ఇంకా పూర్తిగా ద్వేషంతో నిండి

కలుషితం కాలేదనే ధైర్యం. హిందూగా పుట్టి మత సామరస్యం కోసం జీవితాన్ని పణంగాపెట్టి ప్రాణాలిచ్చిన విద్యార్థి, ముస్లింగా ఉంటూ కూడా కృష్ణుడి పైకవిత్వం రాయడమే కాక జీవితాంతం మనిషి పక్షాన నినదించిన హజ్రత్ మొహానీ, అగ్ర కులంలో పుట్టి క్రైస్తవం నుండి స్ఫూర్తిని పొంది బౌద్ధునిగా మారి అట్టడుగు ప్రజాశ్రేణులతో బతికి జీవితాంతం బ్రాహ్మణత్వంపై యుద్ధం చేసిన బిక్కు బోధానందల సజీవ భావధారని తాదాత్మ్యం చెందుతూ తరించడం వారి ఆశయాల సాధనలో సాగే మహా ప్రయత్నాన్ని మనిషిగా ధరించడమే. కాకోరీ మహోజ్వల స్మృతిలో ప్రవహించిన ఈ ప్రయాణం నాకు నేను మరోసారి హృదయంతో చేసుకున్న జీవితకాల ప్రమాణం. ❑

(ఈ ఏడాది హజ్రత్ మొహానీ 150వ జయంతి, 74వ వర్ధంతి సందర్భంగా, వివిధ సంస్థల శతజయంత్యుత్సవాల్ని పురస్కరించుకుని, ఏ ప్రణాళికా లేని, అసలు ముందుగా అనుకోని ఈ ప్రయాణానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా వివిధ రకాలుగా సహకరించిన అందరికీ పేరు పేరున కృతజ్ఞతలు తెలుపుతూ ఈ చిన్న రైటప్.)

## పహల్గాం దాడిలో..

(6వ పేజీ తరువాయి)

సందర్శించవచ్చని చెప్పేవాడిని. ఎందుకంటే ఆ ప్రాంతాలలో ఎలాంటి దాడులు జరగవు' అని ఆయన అన్నారు. ఈసారి హిందువులే లక్ష్యంగా దాడి జరిగిందని అమితాబ్ మట్టూ అభిప్రాయపడ్డారు. 'ఉగ్రవాద గ్రూపులు పౌరులను లక్ష్యంగా చేసుకోవడం ఎందుకు ప్రారంభించాయి ? కశ్మీర్‌లో సాధారణ స్థితి ఉందనే ఆలోచన తప్పని చెప్పడానికా ? గతంలో ఉగ్రవాద గ్రూపులకు ఒక వ్యూహం ఉండేది. వారు స్థానిక ప్రజలుండే ప్రాంతాలలో కాకుండా, సైనిక లక్ష్యాలపై దృష్టి సారించేవారు. కానీ ఇప్పుడు ఆ తేడా లేదు, ఈ సారి హిందువులను లక్ష్యంగా చేసుకున్నారు' అని మట్టూ అన్నారు. దేశంలోని ఇతర ప్రాంతాలలో భావోద్వేగాలను రెచ్చగొట్టడం పౌరులను లక్ష్యంగా చేసుకోవడానికి ఒక కారణమని దువా అభిప్రాయపడ్డారు. 'ఉగ్రవాదులు హిందూ పురుషులను వేరు చేసి చంపారు. మహిళలు తమ నగరాలకు తిరిగి వెళ్లి వీటన్నింటి గురించి చెప్పడమే వారి ఉద్దేశం. ఒక మహిళ ఆవేదన ప్రతిచోటా ప్రభావం చూపుతుంది. అది దేశంలోని వివిధ ప్రాంతాలలో భావోద్వేగాలను రేకెత్తిస్తుంది. మనం వారి ఉచ్చులో పడకూడదు' అని దువా అన్నారు. ఇది 2023లో ఇజ్రాయెల్‌పై హమాస్ జరిపిన దాడి లాంటిదేనని దువా అభిప్రాయపడ్డారు.

**నిఘా వైఫల్యమా?**

పహల్గాం దాడిలో పాకిస్తాన్ ప్రమేయంపై తనకు ఎలాంటి సందేహం లేదని అమితాబ్ మట్టూ అన్నారు. 'పాకిస్తాన్ ఆర్మీ, ఐఎస్ఐ, లష్కరే తోయిబా వంటి సంస్థలు ఇందులో పాల్గొన్నాయని అక్కడి ప్రభుత్వానికి తెలియదా? దాడిలో పాకిస్తాన్ ప్రమేయంపై నాకు ఎటువంటి సందేహం లేదు. ఇది నిఘా వైఫల్యం. ఈ దాడిని పసిగట్టి, దానిని విఫలం చేయగలిగే ఎలక్ట్రానిక్ వ్యవస్థ భారత్ వద్ద ఎందుకు లేదు?' అని మట్టూ ప్రశ్నించారు. సతీశ్ దువా కూడా 'నిఘా వైఫల్యమే ఇక్కడ జరిగిన పెద్ద తప్పు' అని అభిప్రాయపడ్డారు. 'ఈ సంఘటనకు కొన్నిరోజుల ముందు, పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ ఒక ప్రకటన చేశారు. ఇందులో ఆయన హిందువులు, ముస్లింల గురించి మాట్లాడారు. ఆ సంకేతాన్ని మనం అర్థం చేసుకోవాలి. ఉన్నత స్థాయి ఉగ్రవాద దాడిని ఎల్లప్పుడూ ఉన్నతస్థాయిలోనే ఆమోదిస్తారు. కాబట్టి మనం మరింత జాగ్రత్తగా ఉండాలి" అని దువా అన్నారు. "దేశం మానవ నిఘా (హ్యూమన్ ఇంటెలిజెన్స్) మెరుగు పరుచుకోవాలి. మనం ఇప్పుడు ఎలక్ట్రానిక్ ఇంటెలిజెన్స్‌పై ఎక్కువగా ఆధారపడుతున్నాం. ఈ రెండు రకాల నిఘా వ్యవస్థల మేలు కలయిక అత్యంత అవసరం' అని ఆయన సూచించారు. ❑

## కృతజ్ఞతలు



శ్రీ బండారు పాండురంగారావు, సుశీల దంపతులు దారి దీపం పత్రిక పురోభివృద్ధిని కాంక్షిస్తూ అందించిన విరాళానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. ఈ దంపతుల కుమార్తె, మాకు మిత్రులు స్మిత గారికి ధన్యవాదాలు

# నాటి ఫాసిజంపై విజయం..
# నేటి పోరాటానికి స్ఫూర్తి



- డి.వి.వి.యస్.వర్మ

**ప్రపంచ చరిత్రను మూల మలుపులు తిప్పడంలో సోవియట్ యూనియన్ అద్వితీయ పాత్ర పోషించింది. రష్యాలో 1917లో జరిగిన అక్టోబరు విప్లవం ప్రపంచ చరిత్ర గతిని మార్చింది. పెట్టుబడిదారీ వ్యవస్థకు పూర్తిగా భిన్నమైన తొలి సోషలిస్టు రాజ్యం ఏర్పడింది. 1945 మే 9న హిట్లర్ ఫాసిజంపై సోవియట్ యూనియన్ సాధించిన విజయం ప్రపంచదేశాల బలాబలాలను సమూలంగా మార్చివేసింది. పలు దేశాలతో సోషలిస్టు శిబిరం ఏర్పడింది. మరోపక్క ఈ విజయం సామ్రాజ్యవాద దేశాల వలస పాలనకు చరమగీతం పాడింది. తుది సమరానికి జాతీయ విముక్తి ఉద్యమాల వెల్లువకు దారి తీసింది. యుద్ధానంతరం అనేక దేశాలు వలస పాలన నుంచి విముక్తి పొంది స్వతంత్ర రాజ్యాలుగా అవతరించాయి.**



రెండో ప్రపంచయుద్ధం చరిత్ర చదివితే రెడ్ ఆర్మీ, సోవియట్ ప్రజల వీరోచిత పోరాటాలు మనల్ని ఉద్విగ్న భరితుల్ని చేస్తాయి. లెనిన్ గ్రాడ్ ముట్టడి, మాస్కో యుద్ధం, స్టాలిన్ గ్రాడ్ పోరాటం ఒక్కొక్కటి వేలాది మంది ఆత్మార్పణతో సాగించిన యుద్ధం మనల్ని కలిచి వేస్తుంది. హిట్లర్ జర్మన్ సైన్యాల మీద ఈ యుద్ధం మూడు సంవత్సరాల పది నెలలపాటు జరిగింది. చాలీచాలని తిండి, పరిమితమైన ఆయుధ సామగ్రితో అకుంఠిత దీక్షతో సాగిన యుద్ధం. అడుగు అడుగునా రక్తతర్పణతో సాగిన దీర్ఘకాలిక యుద్ధం.

ఈ యుద్ధంలో సోవియట్ సైనికులు ప్రజలు 2 కోట్ల 60 లక్షల మంది మరణించారు. వేలాది మంది క్షతగాత్రులయ్యారు. జర్మన్ ఫాసిస్టు సైన్యానికి పట్టుబడిన 35 లక్షల యుద్ధ ఖైదీలు ఫాసిస్టు మూకల చెరలోనే మరణించారు. జర్మనీ ముందుగా ఆక్రమించిన సోవియట్ ప్రాంతంలో 8 కోట్ల 50 లక్షల జనాభా చిక్కుకున్నారు. అంటే దేశం జనాభాలో 45 శాతం మంది దిగ్బంధం పాలయ్యారు. అక్కడ వున్న 25 లక్షల ఇళ్లల్లో పది లక్షల ఇళ్లను ఫాసిస్టు సైన్యం నేలమట్టం చేసింది. రెండు కోట్ల 50 లక్షల మంది నిరాశ్రయులయ్యారు. జర్మన్ బలగాలు 1710 సోవియట్ పట్టణాలను, 70 వేల గ్రామాలను ధ్వంసం చేశారు. 65 వేల కిలోమీటర్ల రైలు, రోడ్డు మార్గాలను నాశనం చేశారు. ఇంతటి బీభత్సాన్ని, విధ్వంసాన్ని, ప్రాణ నష్టాన్ని తట్టుకుని నిలబడి రెడ్ ఆర్మీ, సోవియట్ ప్రజలు జర్మన్ ఫాసిస్టు సేనలను వెనక్కి తరిమికొట్టారు. అంతిమంగా 1945 మే 9న హిట్లర్ సైన్యాన్ని వారి సొంత గడ్డపైనే ఓడించి బెర్లిన్ పట్టణాన్ని స్వాధీనం చేసుకుని ఎర్ర జెండా ఎగురవేశారు.

రెండో ప్రపంచ యుద్ధంలో జర్మన్ ఫాసిస్టు సైన్యాన్ని ఓడించిన ఘనత సోవియట్ యూనియన్‌కు దక్కింది. ఇది అడుగడుగునా నెత్తురు పారించి సాధించిన విజయం. ఫాసిజంపై జరిగిన యుద్ధ కాలంలో భారత ప్రజలు, ఫాసిజానికి వ్యతిరేకంగా దృఢంగా నిలబడ్డారు. 1940 డిసెంబరులో మహాత్మాగాంధీ హిట్లర్‌కు రాసిన లేఖలో ఆయన చర్యలను పరమ కిరాతకమైనవిగా పేర్కొని దాని విజయానికి తమ ఆశీస్సులు వుండవని తేల్చి చెప్పారు. మరోపక్క జవహర్‌లాల్ నెహ్రూ బహిరంగంగానే ఫాసిజాన్ని ఖండిస్తూ రచనలు, ప్రకటనలు చేశారు. ఆయనకు ముస్సోలినీ, హిట్లర్ ప్రభుత్వాలు పంపిన ఆహ్వానాలను తిరస్కరించారు.

కమ్యూనిస్టు పార్టీ దీనిని ప్రజాయుద్ధంగా ప్రకటించింది. ఫాసిస్టు వ్యతిరేక ప్రచారాన్ని దేశవ్యాప్తంగా ముమ్మరంగా సాగించింది. కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు, మహిళా సంఘాలు తమ సభలు, సమావేశాలలో ఫాసిజం ప్రమాదం

మీద విస్తృతంగా ప్రచారం చేశారు. అభ్యుదయ రచయితలు ఉత్తేజపరిచే పాటలు, నాటికలు వంటి కళారూపాలను రచిస్తే ప్రజా నాట్యమండలి బృందాలు కళారూపాల ద్వారా ఫాసిజాన్ని ఎండగట్టారు. మహాకవి శ్రీశ్రీ రచించిన 'గర్జించు రష్యా గాండ్రించు రష్యా' అనే గేయం విశేష ప్రజాదరణ పొందింది.

రెండో ప్రపంచ యుద్ధంలో సోవియట్ యూనియన్ విజయం సాధించడంతో, ఆ పోరాటంలో విముక్తి పొందిన దేశాలలో కమ్యూనిస్టు బృందాలు అధికారంలోకి వచ్చాయి. ఒకే ఒక సోషిలిస్టు రాజ్యం ఇప్పుడు 12 దేశాల బృందం అయ్యింది. బ్రిటన్‌కు రవి అస్తమించని సామ్రాజ్యం వుంది. అనేక వలస దేశాల మీద పెత్తనం వుంది. అలాగే ఫ్రాన్స్‌కీ వలస దేశాలున్నాయి. రెండో ప్రపంచయుద్ధంలో ఈ దేశాల ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలాయి. మరోపక్క ఫాసిజంపై విజయం తర్వాత అనేక దేశాలలో జాతీయ విముక్తి ఉద్యమాలు తీవ్ర రూపం ధరించాయి. వలస పాలకులు ఇక్కడ పాలించడం అసాధ్యంగా మారింది. పర్యవసానంగా 1947లో భారత దేశానికి స్వతంత్రం వచ్చింది. అనతి కాలంలోనే పలు దేశాలు స్వతంత్ర దేశాలయ్యాయి.

మరో పక్క చైనాలో విప్లవం విజయవంతం అయింది. మే 9 ఫాసిజంపై సోవియట్ సాధించిన విజయం తర్వాత ఒక కొత్త ప్రపంచం ఏర్పడింది. వలస దేశాల స్థానంలో స్వతంత్ర రాజ్యాలు పుట్టుకొచ్చాయి. సోషలిస్టు శిబిరం ఏర్పడడంతో ఈ స్వతంత్ర దేశాలు అలీన విధానం అనుసరించడానికి వీలు కలిగింది. బలమైన అలీన ఉద్యమం ఏర్పడంతో సామ్రాజ్య వాదులు ఆడింది ఆట పాడింది పాట కాకుండా పోయింది.

## భారతీయ ఫాసిజం

1945 మే 9తో ఫాసిస్టు ప్రభుత్వాలు కూలిపోయాయి. ఇటలీలో ముస్సోలినీని ప్రజలు కొట్టి చంపారు. హిట్లర్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఫాసిస్టు రాజ్యాలు పతనం అయినా దానితో పాటే ఫాసిస్టు భావజాలం మాత్రం అంతరించలేదు. భారతదేశంతో సహా పలు దేశాలలో ఫాసిస్టు శక్తులు పనిచేస్తూనే ఉన్నాయి. 1925లో ఆర్ఎస్ఎస్ సంస్థ ఏర్పడింది. దాని వ్యవస్థాపకుడు డా॥ హెగ్డేవార్. ఆయన గురువు బీఎస్ మాన్‌జీ. అలాగే "హిందుత్వ" భావనకు రూపుదిద్దినవాడు దామోదర సావార్కర్. ఆయన హిందూ మహాసభ పేరుతో ఉన్నాడు. ఆర్ఎస్ఎస్ దాని సంఘ్ పరివారం ఏర్పడేనాటికి వారికి ముస్లిం వ్యతిరేకత తప్ప స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక వున్నట్టు కనిపించదు. వారు ఫాసిస్టు భావజాలాన్ని ముస్సోలినీ, హిట్లర్ నుంచి పొంది దానిని భారతీయ పరిస్థితులకు అనుగుణంగా రూపొందినట్టు కనిపిస్తుంది. ఇటాలియన్ పరిశోధకురాలు మర్జినా కసోలారీ దీనిని సాధికారికంగా నిరూపించారు. బీఎస్ మాన్‌జీ డైరీల నుంచి ఆమె ఈ సమాచారాన్ని సేకరించారు. మాన్‌జీ తన డైరీలో(మార్చి 19, 1931) ముస్సోలినీ ప్రత్యక్షంగా కలిసి మాట్లాడినట్టు, అక్కడ ఫాసిస్టు యువజన సంఘం కార్యకలాపాలు చూసినట్లు అలాంటి సంస్థలు ప్రతి దేశానికి అవసరమని ముస్సోలినీకి చెప్పినట్టు దానికి ఆయన అలాంటి కృషిలో విజయం సాధించాలని ఆకాంక్షించినట్లు రాసుకున్నారు. ఆయన ఇండియాకు తిరిగి వచ్చిన తర్వాత మార్చి 31న హెడ్గెవార్ తదితర మిత్రులతో అలాంటి "హిందువుల మిలటరీ ఆర్గనైజేషన్ ఏర్పాటు గురించి చర్చించినట్లు" రాసుకున్నారు.


ఆర్ఎస్ఎస్ సిద్ధాంతకర్త గురు గోల్వాల్కర్ జర్మన్ జాతి స్వచ్ఛత, సంస్కృతి కోసం సెమిటిక్ జాతికి చెందిన యూదులను ఏరివేయాలన్న సూత్రం మనకు దారి చూపిస్తుందని ప్రకటించాడు. 1938 జూన్ 14న సావర్కార్ ప్రసంగిస్తూ హిట్లర్ యూదు వ్యతిరేక కార్యక్రమం ఇండియాలో ముస్లిం సమస్యకు పరిష్కారంగా సూచించాడు. ఆర్ఎస్ఎస్ సంఘ పరివారం ముస్సోలినీ, హిట్లర్ ఫాసిజాలను అనుసరించిన తీరులో ఎన్నో సారూప్యటలు కనిపిస్తాయి. హిట్లర్ ఆర్య జాతి ఆధిపత్యాన్ని ప్రకటిస్తే సంఘ్ పరివారం హిందూ రాష్ట్ర పేరుతో హిందూ ఆధిపత్యాన్ని ప్రకటిస్తున్నది. హిట్లర్‌కు యూదు వ్యతిరేకత రాజకీయమైతే ఇక్కడ ముస్లిం వ్యతిరేకత రాజకీయం అయ్యింది. అక్కడ యూదులకు పౌరసత్వం తొలగించే చట్టాలను ముందుకుతెచ్చారు. ఇక్కడా అలాంటి పౌరసత్వ చట్టాలకు రూపు దిద్దారు. అక్కడ యూదులతో వివాహాలను నిషేధిస్తే ఇక్కడ అదే తరహా లవ్ జిహాద్‌ను ముందుకు తెచ్చారు. జర్మన్ జాతి గత వైభవాన్ని ప్రస్తావిస్తే ఇక్కడ గత హిందూ వైభవం గురించిన చర్చ చేస్తున్నారు.

ఇప్పుడు అధికారంలో వున్న హిందుత్వ రాజకీయవాదం "హిందూ రాష్ట్ర" సాధన కోసం పావులను కదుపుతున్నది. ఇటీవల జరిగిన కుంభ మేళాలో సంఘ్ పరివార బృందం తమ "హిందూ రాష్ట్ర రాజ్యాంగ ముసాయిదా"లోని అంశాలను ప్రకటించింది. ఈ "రాజ్యాంగాన్ని మనుస్మృతి, కౌటిల్యుని అర్థ శాస్త్రం ఆధారంగా రూపొందించినట్లు చెప్పారు. హిందువులకు మాత్రమే ఎన్నికల్లో ఓటు వేసే హక్కు, పోటీ చేసే హక్కు వుంటాయని స్పష్టం చేశారు. భారతీయ ఫాసిజం లక్ష్యం ప్రస్తుత రాజ్యాంగాన్ని తొలగించి మత రాజ్యాంగాన్ని తీసుకురావడం. దేశాన్ని ప్రజాస్వామ్యయుగం నుండి ఆటవికమైన మనువాద యుగాలకు నడిపించడం. ఈ తరహా భారతీయ ఫాసిజాన్ని ఓడించడం మన తక్షణ కర్తవ్యం అయ్యింది. ఈ సవాలును ఎదుర్కొనడానికి మే 9న "ఫాసిజంపై విజయం" 80వ వార్షికో త్సవం నేటి ఫాసిజంపై పోరాటానికి మనకు స్ఫూర్తిదాయకం కావాలి. ❑

# ద్రవ్య పెట్టుబడి - కృత్రిమ మేధస్సు - మార్క్స్



- ఎం.డి అబ్బాస్



**కార్ల్ మార్క్స్ 19వ శతాబ్దంనాటి పెట్టుబడిదారీ వ్యవస్థను విశ్లేషించి సిద్ధాంతాన్ని రూపొందించారు. కాబట్టి 21వ శతాబ్దంలో ప్రపంచ ద్రవ్య పెట్టుబడి, కృత్రిమ మేధస్సు (AI), డేటా ఆర్థిక వ్యవస్థ వంటి ఆధునిక సంక్లిష్టతలను అర్థం చేసుకోవడానికి ఈ సిద్ధాంతం పనికొస్తుందా అని కొందరు మార్క్సిజం యొక్క ఔచిత్యాన్ని ప్రశ్నిస్తుండగా, మరికొందరు ఇది సమాజ ప్రగతిశీలతను విశ్లేషించే శక్తివంతమైన చట్రమని వాదిస్తారు. మార్క్సిజం జ్యోతిష్యం కాదు. ఇది నిర్దిష్ట చారిత్రక, ఆర్థిక పరిస్థితులలో సమాజ చలనాన్ని అధ్యయనం చేసి, దోపిడీ నిర్మాణాలను బహిర్గతం చేస్తూ, సామాజిక మార్పుకు మార్గదర్శనం చేసే ఒక హేతుబద్ధమైన పద్ధతి.**

శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం, ముఖ్యంగా AI, శ్రమ విభజనను విస్తృతం చేస్తూ, ఉత్పత్తి ప్రక్రియలను సంక్లిష్టంగా మారుస్తుంది. ఉదాహరణకు, 2023లో ప్రపంచ AI మార్కెట్ విలువ 136 బిలియన్ డాలర్లుగా ఉందని, 2030 నాటికి 1.8 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని Statista అంచనా వేసింది, ఇది ఉత్పత్తి సంబంధాలలో గణనీయమైన మార్పులను సూచిస్తుంది. ఈ సంక్లిష్టత శ్రమదోపిడీని అర్థం చేసుకోవడాన్ని కష్టతరం చేస్తుంది. ఎందుకంటే ద్రవ్య పెట్టుబడి, AI దోపిడీని అల్గారిథమ్‌లు, డేటా సేకరణ, ఆటోమేషన్ వంటి తెరల వెనుక దాచిపెడతాయి. అయినప్పటికీ, మార్క్స్ యొక్క చారిత్రక భౌతిక వాదం ఈ ఆధునిక ఉత్పత్తి సంబంధాలను విశ్లేషించడానికి అత్యంత సముచితమైన సాధనంగా నిలుస్తుంది. సంపద కేంద్రీకరణ, పరాయీకరణ, వర్గ పోరాటాలను విడమరిచి వివరిస్తుంది. ఈ విశ్లేషణ ద్వారా, ప్రపంచ ద్రవ్య పెట్టుబడి, AI యొక్క సామాజిక, ఆర్థిక పరిణామాలను మార్క్సిస్ట్ దృక్కోణంలో పరిశీలించి, సమసమాజ నిర్మాణానికి ఆచరణాత్మక పరిష్కారాల ను సూచించవచ్చు.

### 1. ద్రవ్య పెట్టుబడి : శ్రమ దోపిడీ, సంపద సంచయం

పెట్టుబడిలాగే ద్రవ్య పెట్టుబడి కూడా లాభాలపై ఆధారపడి నడుస్తుంది. ఈ లాభాలు శ్రమదోపిడీ నుండి వస్తాయి. అయితే ద్రవ్య పెట్టుబడి ఉత్పత్తి ప్రక్రియలో ప్రత్యక్షంగా భాగం కాకుండా, స్పెక్యులేషన్ ద్వారా సంపదను సేకరిస్తుంది. ఈ ప్రక్రియ సంపదను కొద్ది మంది చేతుల్లో కేంద్రీకరిస్తూ ఆర్థిక అసమానతలను తీవ్రతరం చేస్తుంది.

### ద్రవ్య పెట్టుబడి స్వభావం

ద్రవ్యపెట్టుబడి బ్యాంకులు, హెడ్జ్ ఫండ్స్, బహుళజాతి సంస్థల ద్వారా సంపదను పోగు చేస్తుంది. ఉదాహరణకు, అమెరికాకు చెందిన బ్లాక్ రాక్ కంపెనీ 11 ట్రిలియన్ డాలర్ల సంపదను నియంత్రిస్తుంది. ఇది భారతదేశ జీడీపీకంటే మూడు రెట్లు ఎక్కువ. ఈ సంపద ఉత్పత్తి రంగంతో సంబంధం లేని స్టాక్ మార్కెట్లు, డెరివేటివ్స్, క్రిప్టోకరెన్సీలు, రియల్ ఎస్టేట్ వంటి స్పెక్యులేటివ్ రంగాల నుండి వస్తుంది.

### సంపద సంచయం, శ్రమ దోపిడీ

కార్ల్‌మార్క్స్ వివరించిన 'సంపద సంచయం' (Accumulation of Capital) సిద్ధాంతం ప్రకారం, ద్రవ్య పెట్టుబడి ఉత్పత్తి రంగంలో శ్రమ ద్వారా సృష్టించబడిన సంపదను షేర్లు, బాండ్లు, లేదా ఇతర ఆర్థిక సాధనాల ద్వారా

దోపిడీ చేస్తుంది. ఈ దోపిడీ ప్రత్యక్షంగా కనిపించదు.

### స్పెక్యులేటివ్ (ఊహాజనిత) లాభాలు, చంచల స్వభావం

ఈ ఊహాజనిత సంపద (స్టాక్‌లు, డెరివేటివ్స్, క్రిప్టోకరెన్సీలు) శ్రమ ద్వారా సృష్టించబడిన వాస్తవ సంపద ద్వారా కొనుగోలు చేయబడినప్పుడే నిజమైన విలువను పొందుతుంది. లేకపోతే, అవి కేవలం కాగితాలపై రాసిన అక్షరాలుగా మిగిలిపోతాయి. ద్రవ్య పెట్టుబడి శ్రమ ఆధారిత ఉత్పత్తి కాకుండా, సెంటిమెంట్ ఆధారిత స్పెక్యులేషన్‌పై దృష్టి పెడుతుంది. ఇది వేగంగా ఖండాంతరాలను దాటుతూ, ఆర్థిక వ్యవస్థలను అస్థిర పరుస్తుంది. ఉదాహరణకు, హిండెన్‌బర్గ్ రిపోర్ట్ లేదా ట్రంప్ టారిఫ్ ప్రకటనల వంటి సంఘటనలు స్టాక్ మార్కెట్లలో భారీ నష్టాలకు దారితీశాయి. లక్షల కోట్ల సంపద ఆవిరైపోయింది.

### సామాజిక పరిణామాలు

ద్రవ్య పెట్టుబడి సంపదను కొద్దిమంది పెట్టుబడిదారుల చేతుల్లో కేంద్రీకరిస్తూ, శ్రామిక వర్గాన్ని పేదరికం, దారిద్ర్యంలోకి నెట్టివేస్తుంది. ఇది ఆర్థిక అసమానతలను పెంచడమే కాక, ఫైనాన్షియల్ ఒలిగార్కీకి ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై నియంత్రణ ఇస్తుంది. ఈ ప్రక్రియ మార్క్స్ సూచించినట్లు, శ్రమదోపిడీ ద్వారా సంపద సంచయాన్ని వేగవంతం చేస్తుంది. ద్రవ్య పెట్టు బడి శ్రమదోపిడీపై ఆధారపడినప్పటికీ, స్పెక్యులేటివ్ లాభాల ద్వారా దాని దోపిడీని మరుగుపరుస్తుంది. శ్రమ ఆధారిత సంపద సృష్టి లేకుండా ద్రవ్య పెట్టుబడి లాభాలు సాధ్యం కావని గుర్తుంచుకోవాలి. ఇది సంపదను కొద్దిమంది చేతుల్లో కేంద్రీకరిస్తూ, ఆర్థిక అసమానతలను తీవ్రతరం చేస్తుంది. ఆర్థిక వ్యవస్థలను అస్థిరపరుస్తుంది.

## 2.కృత్రిమ మేధస్సు (AI) : శ్రమ, సంపద సృష్టి, అదనపు విలువ

కృత్రిమమేధస్సు(AI) శ్రమ ఉత్పాదకతను పెంచుతూ, తక్కువ శ్రమతో ఎక్కువ సంపద సృష్టించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. అయితే, లేబర్ మార్కెట్‌పై దాని ప్రభావం సంక్లిష్టమైనది. ఇది నిరుద్యోగం, అస్థిర ఉపాధి, గిగ్ ఎకానమీని పెంచుతుంది. AI ఆధారిత సంస్థలు సంపదను కేంద్రీకరిస్తూ, అదనపు విలువ సృష్టిలో కొత్త రూపాన్ని ప్రదర్శిస్తున్నాయా, లేక శ్రమ దోపిడీపైనే ఆధారపడి ఉన్నాయా అనేది పరిశీలిద్దాం.

### AI, శ్రమ ఉత్పాదకత :

AI తయారీ, లాజిస్టిక్స్, డేటా విశ్లేషణ వంటి రంగాలలో ఆటోమేషన్ ద్వారా ఉత్పాదకతను గణనీయంగా పెంచుతుంది. ఇది తక్కువ మానవ శ్రమతో ఎక్కువ ఉత్పత్తిని సాధ్యం చేస్తుంది. అయితే, ఇది కార్మికుల స్థానాన్ని ఆక్రమించడం ద్వారా నిరుద్యోగం, అస్థిర ఉపాధి (గిగ్ ఎకానమీ)ని పెంచుతుంది.

### AI సంస్థలు, సంపద కేంద్రీకరణ

గూగుల్, మైక్రోసాఫ్ట్, మెటా, X వంటి AI ఆధారిత సోషల్ మీడియా సంస్థలు ఏడు ట్రిలియన్ డాలర్ల సంపదను నియంత్రిస్తున్నాయి. ఇవి వినియోగదారుల డేటాను సేకరించి, అల్గారిథమ్‌ల ద్వారా లాభాలను ఆర్జిస్తాయి. కొంతమంది ఈ ప్రక్రియను మార్క్స్ యొక్క "అదనపు విలువ" (Surplus Value) భావనకు కొత్త రూపంగా చూస్తారు. డేటాను ఒక కొత్త శ్రమ రూపంగా పరిగణిస్తూ, మానవ శ్రమ లేకుండానే లాభాలు వస్తున్నాయని వాదిస్తారు. కానీ అది వాస్తవం కాదు.

### అదనపు విలువ, శ్రమ దోపిడీ :

వాస్తవానికి, AI ద్వారా సృష్టించబడే మిగులు విలువ శ్రమ ఆధారితమే. వినియోగదారులు తమ శ్రమ ద్వారా సంపాదించిన డబ్బుతో డేటా సేవలను కొనుగోలు చేస్తారు. దీని ద్వారా వారు తెలియకుండానే అదనపు విలువ సృష్టికి దోహదపడతారు. ఈ విలువను AI సంస్థలు దోపిడీ చేస్తాయి. మార్క్స్ "శ్రమ విలువ సిద్ధాంతం" ప్రకారం, విలువ సృష్టి శ్రమ ద్వారానే సాధ్యమవుతుంది. AI ఆటోమేషన్ మానవ శ్రమను భర్తీ చేసినప్పటికీ, అదనపు విలువను సృష్టించలేదు.

### AI పరిమితులు :

AI ఒక యంత్రం మాత్రమే. యంత్రాలు తమపై పెట్టుబడి ఖర్చు చేసినంత విలువను మాత్రమే ఉత్పత్తులకు బదిలీ చేస్తాయి. కానీ అవి స్వతంత్రంగా అదనపు విలువను సృష్టించలేవు. లాభాలకు AI కారణంగా కనిపించినప్పటికీ, వాస్తవంలో లాభాలు వినియోగదారుల శ్రమ ఆధారిత సంపాదన, డేటా వినియోగం నుండి వస్తాయి. అందువల్ల, AI సృష్టించే సంపద శ్రమదోపిడీపై ఆధారపడి ఉంటుంది. AI శ్రమ ఉత్పాదకతను పెంచుతుంది. కానీ అదనపు విలువ సృష్టిలో శ్రమదోపిడీని దాచిపెడుతుంది. డేటా ఒక కొత్త శ్రమ రూపంగా కనిపించినప్పటికీ, లాభాల మూలం వినియోగదారుల శ్రమ ఆధారిత సంపాదనే. మార్క్స్ సిద్ధాంతం ప్రకారం, AI స్వతంత్రంగా అదనపు విలువను సృష్టించలేదు. అది కేవలం శ్రమ ద్వారా సృష్టించబడిన విలువను దోపిడీ చేసే ప్రక్రియను సులభతరం చేస్తుంది. ఈ ప్రక్రియ సంపద కేంద్రీకరణను వేగవంతం చేస్తూ, లేబర్ మార్కెట్‌లో అసమానతలను మరింత తీవ్రతరం చేస్తుంది.

## 3.పరాయీకరణ, ద్రవ్య పెట్టుబడి, AI సామాజిక ప్రభావం

### AI మరియు పరాయీకరణ :

మార్క్స్ యొక్క "పరాయీకరణ" (Alienation) సిద్ధాంతం ప్రకారం, పెట్టుబడిదారీ వ్యవస్థ కార్మికుడిని తన శ్రమ ఫలితాల నుండి, ఉత్పత్తి ప్రక్రియ నుండి, తోటి కార్మికుల నుండి, మరియు తన మానవ స్వభావం నుండి వేరు చేస్తుంది. AI ఈ పరాయీకరణను మరింత తీవ్రతరం చేస్తుంది.

**శ్రమ నుండి వేరుచేయడం :**

AI ఆధారిత ఆటోమేషన్ తయారీ, సేవలు, డేటా విశ్లేషణ వంటి రంగాలలో ఉద్యోగాలను తొలగిస్తోంది. ఉదాహరణకు, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ నివేదిక (2013) ప్రకారం, అభివృద్ధి చెందిన దేశాలలో 47% ఉద్యోగాలు ఆటోమేషన్ వల్ల ప్రమాదం లో ఉన్నాయి. ఉద్యోగ నష్టం కార్మికులను వారి ఆర్థిక స్థిరత్వం, సామాజిక విలువ నుండి వేరు చేస్తుంది. వారిని గిగ్ ఎకానమీ లేదా అస్థిర ఉపాధి వైపు నెట్టివేస్తుంది.

**వ్యక్తిగత స్వయం నియంత్రణ నుండి వేరుచేయడం:**

AI ఆధారిత సర్వైలెన్స్ వ్యవస్థలు (ఉదా., గూగుల్, మెటా డేటా సేకరణ) వినియోగదారుల ప్రవర్తనను విశ్లేషిస్తాయి. వారి వ్యక్తిగత గోప్యతను హరిస్తాయి. 2021లో ఫేస్‌బుక్ (మెటా) వివాదం, 533 మిలియన్ యూజర్ల డేటా లీక్ అయిన సంఘటన, వ్యక్తులు తమ డేటాపై నియంత్రణ కోల్పోతున్నారని చూపిస్తుంది. ఈ సర్వైలెన్స్ వ్యక్తులను వారి స్వయం నియంత్రణ, స్వేచ్ఛ నుండి వేరు చేసి, కార్పొరేట్ సంస్థల గుప్పెట్లో పెడుతుంది.

**సామాజిక సంబంధాల నుండి వేరు చేయడం :**

AI ఆధారిత సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు (ఉదా. X, ఇన్‌స్టాగ్రామ్) అల్గారిథమ్‌ల ద్వారా వ్యక్తుల మధ్య సంబంధాల ను కృత్రిమంగా నిర్వహిస్తాయి. ఇది నిజమైన సామాజిక బంధాలను బలహీనపరుస్తుంది. ఇది మార్క్స్ వివరించిన సామాజిక పరాయీకరణను తీవ్రతరం చేస్తుంది.

## AI, పెట్టుబడిదారీ ఆధిపత్యం

AI, శ్రామిక వర్గంపై పెట్టుబడిదారీ వర్గం యొక్క ఆధిపత్యాన్ని బలోపేతం చేసే సాధనంగా పనిచేస్తుంది. AI సంస్థలు (ఉదా., గూగుల్, మైక్రోసాఫ్ట్) డేటా ద్వారా సంపదను సేకరిస్తాయి, ఇది మార్క్స్ యొక్క "సంపద సంచయం" భావనకు అనుగుణంగా ఉంటుంది. ఉదాహరణకు, 2023లో గూగుల్ యొక్క ఆదాయం 305 బిలియన్ డాలర్లు, ఇందులో ఎక్కువ భాగం డేటా ఆధారిత ప్రకటనల నుండి వచ్చింది. ఈ సంపద కేంద్రీకరణ శ్రామిక వర్గాన్ని మరింత నిస్సహాయ స్థితిలోకి నెట్టివేస్తుంది. ఎందుకంటే వారు తమ శ్రమ లేదా డేటా ద్వారా సృష్టించిన విలువపై నియంత్రణ కోల్పోతారు.

**ద్రవ్య పెట్టుబడి, AIల సమన్వయం :**

ద్రవ్య పెట్టుబడి, AI ఒకదానికొకటి పరస్పరం బలపరుస్తాయి. ద్రవ్య పెట్టుబడి AI అభివృద్ధికి నిధులను అందిస్తుంది. ఉదాహరణకు, CB Insights నివేదిక ప్రకారం 2022లో AI స్టార్టప్‌లపై ప్రపంచవ్యాప్తంగా 75 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టారు. దీనికి ప్రతిగా అల్గారిథమిక్ ట్రేడింగ్, ఫిన్‌టెక్, డేటా అనలిటిక్స్ ద్వారా ద్రవ్య పెట్టుబడి వ్యవస్థలను AI సమర్థవంతం చేసింది. 2020లో ఫ్లాష్ క్రాష్ (స్టాక్ మార్కెట్ అల్గారిథమిక్ ట్రేడింగ్ వల్ల సంభవించిన ఆకస్మిక పతనం) AI యొక్క సామర్థ్యం, అస్థిరతను చూపిస్తుంది.

**ఆర్థిక, సామాజిక వైరుధ్యాలు**

AI ఉత్పాదకతను పెంచినప్పటికీ, ఉద్యోగ నష్టం ద్వారా ప్రజల కొనుగోలు శక్తిని తగ్గిస్తుంది. ఇది ఆర్థిక డిమాండ్‌ను బలహీనపరుస్తుంది. ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ (ILO) 2023 నివేదిక ప్రకారం, AI ఆధారిత ఆటోమేషన్ వల్ల అభివృద్ధి చెందుతున్న దేశాలలో 20-30% ఉద్యోగాలు ప్రమా దంలో ఉన్నాయి. ఇది ఆర్థిక అస్థిరత (ఉదా. అల్గారిథమిక్ క్రాషెస్) మరియు సామాజిక అసమానతలను పెంచుతుంది.

**మార్క్స్ యొక్క వైరుధ్యాలు :**

ఈ ప్రక్రియ మార్క్స్ యొక్క "పెట్టుబడి అంతర్గత వైరుధ్యాలు" ను ప్రతిబింబిస్తుంది, ఇక్కడ శాస్త్ర సాంకేతిక పురోగతి (AI) ఉత్పాదకతను పెంచుతుంది. కానీ శ్రామికవర్గాన్ని దోపిడీ చేస్తూ, సంపదను కేంద్రీకరిస్తుంది. ఈ వైరుధ్యాలు దీర్ఘకాలంలో పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క సంక్షోభానికి దారితీస్తాయని మార్క్స్ వాదించాడు. ఉదాహరణకు, 2008 ఆర్థిక సంక్షోభంలో ఆటోమేటెడ్ ట్రేడింగ్ వ్యవస్థలు సంక్షోభ తీవ్రతను పెంచాయి, ఇది AI యొక్క సమకాలీన రూపాలకు ఒక ముందస్తు సూచన. AI, పెట్టుబడిదారీ వ్యవస్థలో పరాయీకరణను తీవ్రతరం చేస్తూ, శ్రామికవర్గాన్ని వారి శ్రమ, గోప్యత, మరియు సామాజిక సంబంధాల నుండి వేరు చేస్తుంది. ప్రపంచ ద్రవ్య పెట్టుబడితో సమన్వయం చేయడం ద్వారా, AI సంపద కేంద్రీకరణను వేగవంతం చేస్తుంది. కానీ, అదే సమయంలో ఆర్థిక అస్థిరతను సామాజిక అసమానతలను పెంచుతుంది. మార్క్స్ యొక్క పరాయీకరణ, పెట్టుబడి వైరుధ్యాల సిద్ధాంతాలు AI యొక్క సామాజిక ప్రభావాన్ని వివరించడానికి బలమైన చట్రాన్ని అందిస్తాయి. ఇవి పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క సంక్షోభ స్వభావాన్ని బహిర్గతం చేస్తాయి.

### 4. మార్క్సిస్ట్ దృక్కోణంలో AI, ద్రవ్య పెట్టుబడి సమస్యలకు పరిష్కార మార్గాలు:

మార్క్స్ సిద్ధాంతాలు AI ఆధారిత పెట్టుబడిదారీ వ్యవస్థలో అసమానతలు, పరాయీకరణ, శ్రమదోపిడీని అర్థం

చేసుకోవడానికి మాత్రమే కాక, వీటిని పరిష్కరించడానికి ఆచరణాత్మక మార్గాలను సూచిస్తుంది. ఈ పరిష్కారాలు మార్క్స్ యొక్క సామ్యవాద ఆలోచనలు, కార్మికవర్గ ఐక్యత, ఉత్పత్తి సాధనాల సామాజపరం చేయాలనే భావనలకు అనుగుణంగా ఉన్నాయి.

### సామాజిక రక్షణ వ్యవస్థల ద్వారా సంపద పునః పంపిణీ

AI ఆధారిత ఆటోమేషన్ వల్ల ఉద్యోగ నష్టాన్ని ఎదుర్కొంటున్న కార్మికుల కోసం యూనివర్సల్ బేసిక్ ఇన్కం (UBI) వంటి సామాజిక రక్షణ విధానాలు సంపద పంపిణీని సమతుల్యం చేయగలవు. ఇది మార్క్స్ సామ్యవాద ఆలోచనలకు అనుగుణంగా, సంపద కేంద్రీకరణను తగ్గించి శ్రామిక వర్గానికి ఆర్థిక భద్రతను అందిస్తుంది. Kela నివేదిక, 2019 ప్రకారం ఫిన్లాండ్‌లో 2017-2018లో నిర్వహించిన UBI పైలట్ ప్రాజెక్ట్, 2,000 మంది నిరుద్యోగులకు నెలకు 560 యూరోలు అందించి, ఆర్థిక ఒత్తిడిని తగ్గించి, జీవన నాణ్యతను మెరుగు పరిచిందని చూపించింది. అలాగే, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ (2013) అంచనా ప్రకారం, AI వల్ల 47% ఉద్యోగాలు ప్రమాదంలో ఉన్నందున, UBI వంటి విధానాలు అవసరమని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. UBI, AI ద్వారా సృష్టించ బడిన సంపదను సామాజికంగా పునర్‌పంపిణీ చేస్తూ, మార్క్స్ ఊహించినట్లు శ్రామిక వర్గం యొక్క దారిద్ర్యాన్ని తగ్గిస్తుంది.

### డేటాపై సామాజిక యాజమాన్యం

AI సంస్థలు వినియోగదారుల డేటాను దోపిడీ చేస్తూ సంపదను కేంద్రీకరిస్తున్నాయి. డేటాను సామూహిక ఆస్తిగా పరిగణించి, సమాజానికి దానిపై నియంత్రణ ఇవ్వడం. మార్క్స్ యొక్క "ఉత్పత్తి సాధనాల సామాజికీకరణ" భావనను ఆధునీకరిస్తుంది. యూరోపియన్ యూనియన్ యొక్క GDPR (General Data Protection Regulation, 2018) వినియోగదారులకు వారి డేటాపై నియంత్రణ ఇచ్చే ఒక ఆచరణాత్మక ఉదాహరణ. GDPR అమలు తర్వాత, 2021లో మెటాకు 746 మిలియన్ యూరోల జరిమానా విధించబడింది, European Data Protection Board డేటా దోపిడీపై నియంత్రణ సాధ్యమని చూపిస్తుంది. అలాగే, కాలిఫోర్నియా యొక్క CCPA(2020) వినియోగదారులకు డేటా గోప్యత హక్కులను కల్పించింది. డేటా, ఆధునిక ఉత్పత్తి సాధనంగా, పెట్టుబడిదారీ సంస్థల ఆధీనంలో ఉండకుండా సామాజికీకరిం చబడితే, శ్రమదోపిడీ తగ్గుతుంది. ఇది మార్క్స్ యొక్క సిద్ధాంతా నికి అనుగుణంగా, సంపద కేంద్రీకరణను సవాలు చేస్తుంది. ప్రజలకు వారి డేటా విలువపై వారికే నియంత్రణ ఇస్తుంది.

### కార్మిక వర్గ ఐక్యత ద్వారా హక్కుల రక్షణ

AI ఆధారిత ఆర్థిక వ్యవస్థలో కార్మికుల హక్కులను రక్షించడానికి గ్లోబల్ కార్మిక యూనియన్ల మధ్య సహకారం ఏర్పడాలి. ఇది మార్క్స్ యొక్క "కార్మిక వర్గ ఐక్యత" ఆలోచనకు అనుగుణంగా, కార్మికులను సామూహిక బేరసారాల ద్వారా బలోపేతం చేస్తుంది. అమెజాన్ కార్మికులు 2022లో న్యూయార్క్‌లో ఏర్పాటు చేసిన అమెజాన్ లేబర్ యూనియన్ (ALU) ఒక విజయవంతమైన ఉదాహరణ. ALU, కార్మికులకు మెరుగైన వేతనాలు పని పరిస్థితుల కోసం పోరాడింది, ఇది AI ఆధారిత గిగ్ ఎకానమీలో కూడా ఆచరణాత్మకమని చూపిస్తుంది (NLRB నివేదిక, 2022). అలాగే, ఉబెర్ డ్రైవర్లు యూరప్‌లో ఏర్పాటుచేసిన యూనియన్లు 2021లో మెరుగైన వేతన హక్కులను సాధించాయి (ETUC నివేదిక). కార్మికవర్గ ఐక్యత, AI ద్వారా ఉద్యోగ నష్టం, అస్థిర ఉపాధిని ఎదుర్కొంటున్న శ్రామిక వర్గానికి సామూహిక శక్తిని ఇస్తుంది. ఇది మార్క్స్ యొక్క వర్గ పోరాట సిద్ధాంతాన్ని ఆధునిక సందర్భంలో అమలు చేస్తుంది. పెట్టుబడిదారీ దోపిడీని సవాలు చేస్తుంది.

### ద్రవ్య పెట్టుబడిపై నియంత్రణలు, AIని నీతివంతంగా ఉపయోగించడం

ద్రవ్య పెట్టుబడిని కఠినంగా నియంత్రించే, AI నీతివంతంగా ఉపయోగించే చట్టాలు చేయడం ద్వారా అసమానతలు తగ్గుతాయి. శాస్త్ర సాంకేతికతను సామాజిక శ్రేయస్సు కోసం ఉపయోగించడాన్ని ప్రోత్సహిస్తుంది. European Commission రిపోర్ట్ ప్రకారం 2023లో EU యొక్క AI యాక్ట్ (డ్రాఫ్ట్) AI సర్వైలెన్స్ అల్గారిథమిక్ ట్రేడింగ్‌పై నియంత్రణలను ప్రతిపాదించింది. ఇది గోప్యత హక్కులను రక్షించడం, ఆర్థిక అస్థిరతను తగ్గించడం లక్ష్యంగా పనిచేస్తుంది. అలాగే, SEC నివేదిక ప్రకారం 2008 ఆర్థిక సంక్షోభం తర్వాత అమెరికాలో Dodd-Frank Act (2010) ఆర్థిక సంస్థలపై నియంత్రణలను విధించింది, ఇది ఆల్గారిథమిక్ ట్రేడింగ్ వల్ల కలిగే అస్థిరతను కొంతవరకు తగ్గించింది. ద్రవ్య పెట్టుబడి, AIలపై నియంత్రణ లేకుంటే సంపద కేంద్రీకరణ పెరిగి ఆర్థిక సంక్షోభాలకు దారితీస్తుంది, ఇది మార్క్స్ అంచనాలను బలపరుస్తుంది. మార్క్స్ యొక్క ఆలోచనలు ఆధునిక సందర్భానికి అనుగుణంగా ఆచరణాత్మకంగా ఉన్నాయి. సంపదను సమానంగా పంపిణీ చేయడానికి మార్గదర్శనం చేస్తాయి. మార్క్స్ దృక్కోణం, AI యొక్క సాంకేతిక సంక్లిష్టత, డేటా ఆర్థిక వ్యవస్థ, గ్లోబలైజేషన్, ఫైనాన్స్ కాపిటల్ వంటి సమకాలీన అంశాలను విశ్లేషించడంలో ఇప్పటికీ సమర్థవంతంగా ఉంది. పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క అంతర్గత వైరుధ్యాలను వెలుగులోకి తెస్తూ, సమ సమాజ నిర్మాణానికి ఒక స్పష్టమైన దిశను సూచిస్తుంది. ❑

# నూత్న ఆవిష్కరణలలో మనం ఎందుకు వెనుకబడి ఉన్నాము?

- కవితా కబీర్



ప్రస్తుతం మనం నూతన ఆవిష్కరణల నుంచి చాలా పెడగా ఉండిపోయాం. జనాన్ని ఎలా పక్కదారి పట్టించాలా అనే మార్గంలోనే మన పెట్టుబడి నడిచిపోతుంది. ఎప్పుడు కావాలంటే అప్పుడు జనాన్ని రెచ్చగొట్టే సరుకు మన దగ్గర ఉన్నంత కాలం ఇంకా నూతన ఆవిష్కరణల అవసరం మనకెందుకు చెప్పండి ?

> ప్రతిభావంతుడైన ఒక ఐఐటీ పట్టభద్రుడు 2020లో వినూత్నమైన ఆవిష్కరణ చేపట్టాడు. లేదు, లేదు మీరు ఊహిస్తున్నట్టుగా అది మరో 'ఫుడ్ డెలివరీ' యాప్‌నో లేదా గోవులకు సంబంధించిన 'ఊబర్' యాప్ వంటిదో కాదు. రైలు టికెట్ల రిజర్వేషన్‌లకు వాడే ఐఆర్సీటీసీ యాప్‌ను మరింత వేగంగా ప్రయాణికులు టికెట్ రిజర్వ్ చేసుకునేందుకు తోడ్పడేలా తీర్చిదిద్దాడు. ప్రయాణాల రద్దీ రోజుల్లో ఎవరన్నా 'తత్కాల్' టికెట్ బుక్ చేసుకునేందుకు ప్రయత్నించి ఉంటే అది ఎంత బ్రహ్మ ప్రళయంగా ఉంటుందో అనుభవంలోకి వచ్చే ఉంటుంది. ఈ కుర్రవాడి సాంకేతిక మెళకువ పరిజ్ఞానానికి మెచ్చుకోవాల్సింది పోయి భారతీయ రైల్వే విభాగం అతని మీద దావా వేసింది. మీరు చదువుతున్నది నిజం, ఐఆర్సీటీసీ ఆ కుర్రాడి మీద కేసు వేసి అరెస్టు చేయించింది. అప్పట్లో రైల్వే మంత్రిత్వ శాఖా మంత్రిగా పీయూష్ గోయల్ ఉన్నారు.

విచిత్రం చూశారా, ప్రస్తుతం పరిశ్రమల-సరఫరాల శాఖా మంత్రిగా ఉన్న అదే పీయూష్ గోయల్ మన యువ పారిశ్రామికవేత్తల దృష్టంతా 'ఫుడ్ డెలివరీ యాప్'లు తయారుచేసి నిరుద్యోగ యువతీ యువకులను "కారుచౌక శ్రామికులుగా" మార్చేస్తున్నారని తిట్టిపోస్తున్నారు. ఈ దృష్టి ఐఆర్సీటీసీ యాప్‌ని ప్రయాణీకుల ఆకాంక్షలు, అవసరాలకు తగినట్టుగా ఐఐటీ కుర్రాడు మెరుగు పరిచినప్పుడు ఎందుకు లేకుండా పోయిందో మరి?

'మన యువతీ, యువకులు కేవలం 'డెలివరీ' సిబ్బందిగా



మిగిలిపోవాలా' అని సదరు మంత్రి నిరుద్యోగం పట్ల ఎంతో ఆపేక్షతో ప్రశ్నిస్తున్నట్టు పైకి కనిపిస్తుంది. అక్కర్లేదు, మన దగ్గర శ్రామికులు కారు చౌకగా తమ శ్రమను అమ్ముకోవాల్సిన పనిలేదు. అది జరగాలంటే స్టార్టప్ కంపెనీలు, ప్లాట్‌ఫామ్ యాప్‌లు మొదలు ఏ కంపెనీ, ఏ పరిశ్రమ కూడా మన యువతీ యువకుల శ్రమను కారు చౌకగా దోచుకోకుండా పటిష్టమైన కార్మిక చట్టాలు రూపొందించాలి. కానీ ఈ ప్రభుత్వం ఆ పని మాత్రం చెయ్యదు. పైపెచ్చు అంతర్జాతీయ, బహుళజాతి కంపెనీలను మన దేశంలో పెట్టుబడులు పెట్టమని అడగడానికి ఈ కారు చౌకగా లభించే శ్రామికులనే ఎరగా చూపుతున్నారు. 'మా దేశంలో నైపుణ్యం గల శ్రామికులు ఉన్నారు. వ్యాపారం చేసుకోవడానికి అద్భుతమైన అనుకూల వాతావరణం ఉంది. కాబట్టి పెట్టుబడులు పెట్టండి అని ధీమాగా అడగడానికి బదులు మా దగ్గర లేబర్ చాలా చీప్‌గా దొరుకుతుంది, చట్టాల గురించి పెద్ద పట్టింపులు ఉండవు కాబట్టి వచ్చి పెట్టుబడులు పెట్టండి' అని దేబిరించుకుంటున్నారు.

మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన రెండేళ్ల తరువాత ఏర్పడ్డ పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా లేదా కమ్యూనిస్టు చైనాలో కూడా లేబర్ చాలా చీప్ అని అనేవాళ్లు. ఇప్పటికీ అనే వాళ్లు కూడా ఉన్నారు. కానీ అది ముప్పై ఏళ్ల క్రితం నాటి మాట. ఇవాళ చైనాలో అలాంటి పరిస్థితి లేదు. 1980 నాటికి భారతదేశంలో తలసరి ఆదాయం 266 అమెరికన్ డాలర్లు కాగా చైనాలో 194 డాలర్లుగా ఉండేది. 2020 నాటికి భారత్‌లో తలసరి ఆదాయం 1,357 డాలర్లు కాగా చైనాలో 4,450 డాలర్లుగాను 2022 నాటికి భారత్‌లో తలసరి ఆదాయం 2,388 డాలర్లు కాగా చైనాలో అది 12,720 డాలర్లకు పెరిగిందని ప్రపంచబ్యాంకు గణాంకాలు వివరిస్తున్నాయి.

మన స్టార్టప్ కంపెనీలు డీప్ టెక్నాలజీ, సెమీ– కండక్టర్లు, కృత్రిమ మేధ(ఏఐ)లో కృషి సాగించాలని సదరు మంత్రివర్యులు సెలవిస్తున్నారు. సెమీ కండక్టర్ స్టార్టప్ కంపెనీ పెట్టిన ఒక ఔత్సాహిక పారిశ్రామికవేత్త కంపెనీ పెట్టడానికి తాను పడ్డ కష్టాలన్నింటినీ 'రెడ్డిట్' సామాజిక మాధ్యమంలో ఏకరువు పెట్టాడు. పీయూష్ గోయల్‌కు ఒక బహిరంగ లేఖ రాస్తూ తన స్టార్టప్ కంపెనీ కొన్ని పన్ను రాయితీలకు అర్హత కలిగి ఉన్నా తన అప్లికేషన్‌ను సదరు మంత్రిత్వ విభాగం రెండేళ్ల పాటు పెండింగ్‌లో పెట్టుకుని చివరికి 'మరికొన్ని అదనపు పత్రాలు అవసరం' అని 'క్వెరీ' వేసి తప్పికొట్టిందని, ఇది జరిగిన కొద్ది గంటలలోపే ఒక ఏజెంట్ ఫోన్ చేసి 'మీ పని కచ్చితంగా జరిగి తీరాలంటే సదరు పత్రాలు సమకూర్చడంలో మా సాయం తీసుకోండి' అని అడిగారని, అంటే లంచం ఇస్తే పని జరిగిపోతుందని పరోక్షంగా సూచించాడని మీ విభాగంలో రూల్స్ ప్రకారం పని నడవదు అనడానికి నా అనుభవమే ఒక ఉదాహరణ' అని వాపోయాడు.

ఇదొక సమస్య అయితే, అసలు మన స్టార్టప్‌ల వ్యవస్థలోనే లొసుగులు ఉన్నాయి. ఉదాహరణకు డీప్ టెక్, ఆటో మొబైల్ రంగాలనే తీసుకుందాం. కొన్నేళ్లుగా కార్ల ధరలు పెరుగుతూ వస్తున్నాయి. కానీ, వాటి పనితీరులో ఏ మాత్రం మెరుగుదల లేదు. మన దేశంలో నడిచే 60 శాతం కార్లు ఇంకా 10వ జనరేషన్ ఇంజన్లతోనే నడుస్తున్నాయనే విషయం తెలిస్తే ఆశ్చర్యం కలుగకమానదు. కొత్త కొత్త కంపెనీలు వస్తున్నాయి. కొత్త మోడళ్ల కార్లు రోడ్ల మీదకు వస్తున్నాయి. కానీ, ఆ కార్ల ఇంజన్లు మాత్రం ఇంకా పాతకాలం నాటివే నడుస్తున్నాయి. మన నూతన ఆవిష్కరణలు, పరిశోధనలు ఎటు పోయినట్లూ?

ఈ కార్ల తయారు చేసేది చిన్నా చితకా కంపెనీలా, అంటే కాదు. నూతన పరిశోధనలకు ఆవిష్కరణలకు వెచ్చించేందుకు ఈ కంపెనీల దగ్గర సొమ్ము లేదా అంటే అదీ కారణం కాదు. ఇవాళ కార్ల కంపెనీలు పదేళ్ల క్రితం ఎలాంటి కార్లు తయారు చేసేవో పైపై మార్పులతో అవే కార్లను తయారు చేస్తున్నాయి. మధ్య తరగతి కొనగలిగే స్థోమతగల కార్లు పదేళ్లుగా అవే మారుతీ ఆల్టో, స్విఫ్ట్, టాటా కంపెనీలవే. మార్కెట్లోకి కొత్త కంపెనీ, కొత్త తరహా కారు రానే రాలేదు.

అదే చైనాలో 200 కార్ల తయారీ సంస్థలు ఉన్నాయి. అసంఖ్యాకమైన మోడళ్ల కార్లను తయారు చేస్తున్నాయి. 600 డాలర్లకు(సుమారు రూ.50,000) వచ్చే చౌక ఎలక్ట్రిక్ కార్లతో పాటు టెస్లా వంటి లగ్జరీ వాహన యజమానులు కూడా ఈర్ష్య పడేంత విలాసవంతమైన కార్లను చైనా తయారు చేస్తుంది. మన దేశంలో చౌకయిన ఎంజీ కంపెనీ కామెట్ ఎలక్ట్రిక్ కారు ధర ఏడు లక్షల రూపాయలు. అంటే మన దేశంలో కార్ల కంపెనీలకు లాభాలు పోగేసుకోవాలనే రంది తప్పితే కొత్త కొత్త మోడళ్ల ఆవిష్కరణలకు తగిన పరిశోధనలు చేపట్టాలనే దృష్టే లేదు. ఒకవేళ చైనా కార్ల దిగుమతిని అనుమతిస్తే మన దేశవాళీ కార్ల దిక్కు చూసేవాళ్లు ఎవరన్నా ఉంటారా ?

## నూతన ఆవిష్కరణలతో చైనా ఎందుకు దూసుకుపోతుంది?

గత పదేళ్ల కాలంలో మన ప్రభుత్వం చైనా 'యాప్'లను నిషేధిస్తూ, అదే చైనా నుంచి దీపావళి లైట్లు, పతంగుల నుంచి అనేక వస్తువులు దిగుమతి చేసుకుంటూ వచ్చింది. ప్రపంచ వస్తూత్పత్తికి చైనా కేంద్రంగా మారింది. అదే చైనా 2015లో మేడిన్ చైనా 2025 పేరిట రూపొందించుకున్న ప్రణాళికలో సెమీ కండక్టరు, కృత్రిమ మేధ(ఏఐ), ఎలక్ట్రిక్ కార్లు, డ్రోన్లు, సౌరవిద్యుత్ ఫలకాల వంటి రంగాలలో అగ్రగామిగా ఎదగాలని లక్ష్యంగా పెట్టుకుందంటే నూతన సాంకేతిక పరిజ్ఞానంలో బలమైన పోటీదారుగా ఎదగాలని నిర్ణయించుకుంది. 2025 గిర్రున తిరిగి రానే వచ్చింది. పైన పేర్కొన్న ప్రతి రంగంలో ఇవాళ చైనా ప్రపంచ అగ్రగామిగా నిలిచింది. ప్రపంచ సౌర విద్యుత్ ఫలకాల తయారీలో 80 శాతం వాటా, లిథియం–ఐయాన్ బ్యాటరీల ఉత్పత్తిలో 75 శాతం వాటా, డ్రోన్ల తయారీలో 75 శాతం వాటాతో చైనా అగ్రగామిగా ఉన్నది. స్వంతంగా వాణిజ్య విమానాల తయారీలో ముందంజవేసింది. చైనా సాధించిన ప్రగతిని గమనిస్తే మనమూ ఉన్నాం దేనికీ అనే పశ్చాత్తాపం కలగకమానదు. మార్కెట్‌లోకి వచ్చిన ఏ కొత్త సరుకునయినా సరే చైనా చౌకగా డూప్లికేట్ చేసి పారేస్తుంది. అనే పేరుని వదిలించుకుని, ఇవాళ ప్రపంచ అగ్రగామి సరుకులు అనేకం ఉత్పత్తి చేస్తున్నది.

పదేళ్ల క్రితం తీసుకున్న మేడిన్ చైనా 2025 అనే నినాదాన్ని వాళ్లు సాకారం చేసుకున్నారు. అదే పదేళ్ల క్రితం మన ప్రభుత్వం ఇచ్చిన 'మేకిన్ ఇండియా' పిలుపు ఇంకా నినాదంగానే మిగిలిపోయింది. నూతన ఆవిష్కరణలకు తగిన పరిస్థితులు వాటంతట అవే సృష్టించబడవు. ప్రభుత్వాలు చిత్తశుద్ధితో అందుకు పూనుకోవాలి. భారతదేశంలో స్టార్టప్ నిధులలో కేవలం ఐదు శాతం డీప్ టెక్ రంగంలో పెట్టుబడులుగా పెడుతుందంటే చైనా 35 శాతం పెట్టుబడులు పెట్టిందని అభిజిత్‌కుమార్ బిజినెస్ స్టాండర్ట్ పత్రికలో(2023)లో వివరించాడు. 2024లో హై–టెక్ కంపెనీలకు చైనా 361 బిలియన్ డాలర్ల పన్ను రాయితీలు ఇచ్చిందని, 80.7 బిలియన్ డాలర్ల శాస్త్ర పరిశోధనల అభివృద్ధి కేటాయింపులకూ మినహాయింపు ఇచ్చిందని, ఒక్క 2024లోనే శాస్త్ర పరిశోధనల అభివృద్ధి రంగానికి చైనా 496 బిలియన్ డాలర్లు కేటాయించిందని, అదే భారతదేశం 2025 బడ్జెట్‌లో కేవలం 23.45 బిలియన్ డాలర్లు కేటాయించిందని తెలియజేస్తోంది. భారతదేశంలోని స్టార్టప్

కంపెనీలకు నిధుల కొరత పెద్ద సమస్యగా ఉంటే నియంత్రణలు మరింత అలివిమాలిన భారంగా తయారయ్యాయి. చైనాలో ప్రభుత్వం స్టార్టప్ కంపెనీలకు వెన్నుదన్నుగా నిలబడడంతో పాటు, తనే అనేక కంపెనీలలో పెట్టుబడులు పెడుతుంది.

## ప్రభుత్వరంగం : స్టార్టప్ కంపెనీల శైశవదశ

వాణిజ్యానికి అనుకూలమైన వాతావరణం సృష్టించబడాలంటే మన దేశం నాణ్యమైన విద్య, వైద్యం, మౌలిక సౌకర్యాలను పెంపొందించడంతోపాటు కీలక రంగాలలో పెట్టుబడులు ఇబ్బడి మబ్బడిగా పెంచాలి. ఇక్కడే ప్రభుత్వరంగ పరిశ్రమల పాత్ర కీలకంగా మారుతుంది. 'నవరత్న' ప్రభుత్వ రంగ పరిశ్రమల గురించి మీరు ఇంతకుముందు వినే ఉంటారు. ఇనుము నుంచి మందుల తయారీ వరకు ఈ పరిశ్రమలు అద్భుతమైన ప్రగతి సాధించాయి. ఈ కంపెనీలు ఇప్పటికీ తమ ఉద్యోగుల కోసం పాఠశాలలు, ఆసుపత్రులు, పార్కులు, టౌన్ షిప్‌లు సబ్సిడీ రేట్లకు నిర్వహిస్తున్నాయి.

కానీ ఈ ప్రభుత్వ రంగ పరిశ్రమల మీద 'పనికి మాలినవి' అని ముద్ర వేసి ప్రభుత్వ పెద్దల సన్నిహిత మిత్రులకు కారు చౌకగా కట్టబెట్టేస్తున్నారు. వాస్తవానికి ఈ ప్రభుత్వ రంగ పరిశ్రమలే మన దేశ ఆర్థిక వ్యవస్థను సజీవంగా నిలబెడుతు న్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఈ పరిశ్రమలు కేంద్ర ప్రభుత్వానికి 74 వేల కోట్ల రూపాయలు డివిడెంట్‌లుగా చెల్లించాయి. కోల్(బొగ్గు) ఇండియా కంపెనీ ఒక్కటే రూ.10 వేల కోట్ల డివిడెండ్ చెల్లించింది. ప్రతి ప్రభుత్వ రంగ పరిశ్రమ పన్నులు చెల్లించగా మిగిలిన లాభాలలో 30 శాతం కానీ, ఆయా కంపెనీలు నికర విలువలో నాలుగు శాతానికి కానీ తగ్గకుండా కేంద్ర ప్రభుత్వానికి డివిడెంట్ చెల్లించాలి.

కేంద్ర ప్రభుత్వ ఆదాయానికి ప్రభుత్వ రంగ పరిశ్రమలు చెల్లించే డివిడెండ్‌లే పెద్ద ఆదాయ వనరు. కాబట్టి ఈ నవరత్న ప్రభుత్వరంగ పరిశ్రమలు మరింత అభివృద్ధి అయ్యేందుకు తోడ్పడడానికి బదులుగా, ఈ కంపెనీలను శతకోటీశ్వర స్నేహితులకు కట్టబెడుతున్నారు. మన దేశానికి పారిశ్రామిక పునాదిగా నిలబడింది ఈ ప్రభుత్వరంగ పరిశ్రమలే. రక్షణ రంగం, ఇంధన రంగం, విద్యుత్ రంగం, మౌలిక సౌకర్యాలు కల్పనలో ప్రభుత్వ రంగ పరిశ్రమల చుట్టూ పట్టణాలు, నగరాలు అభివృద్ధి చెందాయి. ఇవాళ ఐటీ పరిశ్రమకు కేంద్రంగా పేరొందిన బెంగళూరు మహా నగరంగా అభివృద్ధి చెందడానికి గతంలో అక్కడ నెలకొల్పిన ప్రభుత్వ రంగ పరిశ్రమలే కారణం. 1950వ దశకంలో హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్, ఇండియన్ టెలిఫోన్ ఇండస్ట్రీ, హిందుస్థాన్ మెషీన్ టూల్స్, భారత ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్, భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ పేరిట బెంగళూరులో ఐదు ప్రభుత్వ రంగ పరిశ్రమలను నెలకొల్పారు. ఈ పరిశ్రమల చుట్టూ క్రమంగా టౌన్‌షిప్‌లు, స్కూళ్లు నిర్మించారు. నగరం విస్తరించింది. ఈ పరిశ్రమలు లక్షలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించాయి. మన దేశంలో అనేక నగరాల విస్తరణ వెనుక ఉన్న కథ ఇదే. హాలీవుడ్ సినిమా 'గ్రావిటీ' తియ్యడానికి పెట్టిన ఖర్చుకున్నా తక్కువ ఖర్చుతో 'మార్స్ ఆర్బి టర్ మిషన్' నిర్వహిస్తున్న 'ఇస్రో' ప్రభుత్వరంగ పరిశ్రమకావ డం మనకు గర్వకారణం కాదా. ఈ రోజుకు చైనాలో ప్రభుత్వ రంగ పరిశ్రమలే కీలకపాత్ర పోషిస్తున్నాయి. అంతర్జాతీయంగా అగ్రగామిగా ఉన్న ఫార్చ్యూన్-500 కంపెనీలుగా నిలిచిన తొలి పది పరిశ్రమలలో 3 పరిశ్రమలు చైనా ప్రభుత్వ రంగ పరిశ్రమలే ఉన్నాయి. 2023 ఫార్చ్యూన్- 500 జాబితాలో 135 చైనా పరిశ్రమలు నిలిస్తే అందులో 85 కంపెనీలు ఆదేశ ప్రభుత్వరంగ పరిశ్రమలే.

## స్టార్టప్ కంపెనీలుగా పేపర్ లీక్‌లు, విద్వేషాలు

పేపర్ లీక్‌లు, విద్వేషాలు రెచ్చగొట్టడమే మన దేశ స్టార్టప్ కంపెనీలుగా నిలిచాయి. సెమీ-కండక్టర్ల తయారీలో ప్రపంచం దూసుకుపోతుంటే మన దేశం పరీక్ష పత్రాల లీకేజీకి పేరు మోసింది. ఈ పనికి దేశంలోని రాజస్థాన్‌లో ఏకంగా ఒక కంపెనీయే వెలసిందని 'సైనిక్ భాస్కర్' కథనం వెలువరించింది. ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించిన అనేక రిక్రూట్‌మెంట్ పరీక్షల ప్రశ్న పత్రాలను లీక్ చేసి అక్రమ మార్గం ద్వారా వందల మంది ఉద్యోగాలు చేజిక్కించుకున్నారని, అందులో 86 మంది ఇప్పటికే సస్పెండ్ అయ్యారని ఆ పత్రిక బయటపెట్టింది. గత పదేళ్లుగా పేపర్ లీకేజీ ఒక పరిశ్రమగా వర్థిల్లింది. నీట్, యూజీసీ నెట్ మొదలు ఎస్‌ఎస్‌సీ, హెచ్‌ఎస్‌సీ పేపర్ల వరకు 'లీక్' కాని పరీక్ష ప్రశ్న పత్రమే లేదంటే ఆశ్చర్యపోవాల్సిన పని లేదు. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఇది కూడా వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న పరిశ్రమగా ప్రభుత్వం భావిస్తున్నట్టు ఉన్నది.

(మత) విద్వేషాలను రెచ్చగొట్టడం కూడా భారీ స్టార్టప్ కంపెనీగా తయారయ్యింది. విద్వేష పూరితమైన పాటలు రికార్డు చేసి సీడీలు, క్యాసెట్లుగా అమ్మడం పెద్ద పరిశ్రమగా తయారయ్యింది. ఈ పాటల క్యాసెట్లు వేసి మసీదుల ముందు వికృత నృత్యాలు చెయ్యడం కూడా పదేళ్లుగా నడుస్తున్న స్టార్టప్ కంపెనీగా చెప్పుకోవచ్చు. నవరాత్రి, శ్రీరామ నవమి, హోలీ, దీపావళి పండుగల సందర్భంగా ఈ విద్వేష వ్యాపారం మరింత జోరుగా సాగుతుంది. మన సామాజిక మాధ్యమాలలో ఈ సరుకుకు గిరాకీ పెరిగింది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవార్డులు ఇచ్చినట్టే ప్రస్తుత ప్రభుత్వం సోషల్‌మీడియా ప్రభావశీలురు (ఇన్‌ఫ్లుయన్సర్స్) పేరిట అవార్డులు ఇచ్చి ప్రోత్స హిస్తుంది. మిగిలిన దేశాలు డీప్-టెక్ రంగంలో

**(మిగతా 28వ పేజీలో)**


పుస్తక సమీక్ష

# చారిత్రక దృక్పథం లోపించిన 'విప్లవాగ్ని అల్లూరి' !



- దివికుమార్

గోపరాజు నారాయణరావు రచించిన 'విప్లవాగ్ని అల్లూరి' ప్రచురణకర్తలు శ్రీ సీతారామరాజు శతజయంతి ఉత్సవ సమితి, విశాఖపట్నం వారు. రచయిత ఒక జర్నలిస్టు. స్వయంకృషితో చాలా వివరాలు సేకరించి, విలువైన సమాచారాన్ని పాఠకులకు అందించాడు. ఆసక్తికరమైన వర్ణనలతో, వాస్తవిక చిత్రణతో కొన్ని సంఘటనలు (ఉదా దామనపల్లి ఘాట్ సంఘటన–ఇందులోనే కవర్ట్, హైటర్ అనే బ్రిటీషు మిలటరీ అధికారులు ఇద్దరు కాల్చివేయబడ్డారు.) కళ్ల ముందు కదలాడే దృశ్యాల్లా చిత్రించాడు. వీరుల చుట్టూ కల్పితమయే అనేక కథలను ఖండించాడు. ముఖ్యంగా రామరాజు పేరుకు ముందు 'సీత' చేరటం, 'ఆమె' రామరాజు ప్రియురాలు లాగా విస్తృత ప్రచారం గావటాన్ని విస్పష్టంగా నిరసించాడు. ఈ శతాబ్దపు తొలి బూటకపు ఎన్‌కౌంటర్‌గా కూడా చరిత్రలో నిలిచిన అల్లూరి హత్య (7.5.1924) జరిగిన మరుసటి సంవత్సరమే భమిడిపాటి సత్యనారాయణ అనే రాజమండ్రి నివాసి సంపాదకత్వాన 'అల్లూరి సీతారామరాజు ప్రశంస' అనే పుస్తకం వెలువడింది. రామరాజుకు ముందు 'సీత'ను చేర్చి ప్రచురించిన తొలి గ్రంథం బహుశా ఇదేనేమో! 'సీత'నే ఒక ప్రత్యేకాంశంగా తీసుకుని పరిశోధన జరిపితే కూడా మంచిదే. వాస్తవానికి "కాల్పనికత" జోడయితే పాఠకులకు, ప్రేక్షకులకు రసవత్తరంగా వుంటుంది. అవాస్తవానికి కల్పన జతచేస్తే చివరికి వాస్తవాన్నే తల్లకిందులు చేయగలుగుతుందనటానికి 'సీత' చేర్పు ఒక మంచి ఉదాహరణగా నిలుస్తుంది.




**విప్లవాగ్ని అల్లూరి**

**రచయిత : గోపరాజు నారాయణరావు**

**పేజీలు : 136, వెల: రూ.20**

**ప్రతులకు : సాహిత్య నికేతన్- ఏలూరు రోడ్డు - విజయవాడ-2, బర్కత్‌పురా - హైదరాబాదు-27**

ఈ పుస్తకాన్ని రచించటానికి ఆలోచననందించిన వారు భాగయ్య గారు. వీరు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘానికి తూర్పు కోస్తా ప్రచారకులు. వీరి ప్రభావమే కారణమా, లేక రచయితకు స్వయంగా అటువంటి దృక్పథమే ఉన్నదో తెలియదు గాని, రచన ముఖ్యముగా ముగింపు తీవ్ర అభ్యంతరకరంగా రూపొందింది.

సీతారామరాజు యొక్క స్ఫూర్తిని ఆనాటికీ, ఈనాటికీ అమలు జరపటానికి ప్రయత్నిస్తుదెవరో, రామరాజులాగా ప్రభుత్వ ఆగ్రహానికి గురవుతున్నదెవరో కూడా పరిశీలించాలి.

సీతారామరాజు దైవభక్తిపరుడు : అంతమాత్రాన ఆయన హిందూమతవాది లేక అన్య మతద్వేషి కాదు. హిందూ ఆధ్యాత్మిక భావజాలానికి అనేక పార్శ్వాలున్నాయి. అందులో "నిష్క్రియాభావం" ఒక ముఖ్యమైన భాగం. 'శివుని ఆజ్ఞలేనిదే చీమైనా కుట్టదు' అనే తత్వం మంచీ, చెడూ – అంతా – భగవంతుని లీలా విశేషముగానే భావించేట్టు చేసి, అందులో వ్యక్తుల సమూహాల పాత్రను మినహాయిస్తుంది. మనుషుల్ని కేవలం ప్రేక్షకులుగా, నిష్క్రియాపరులుగా మిగిల్చేస్తుంది.

మరొకటి వ్యక్తివాదం. మోక్షం వ్యక్తి గత సాధన ద్వారానే సాధ్యం. అది ఎవరికి వారుగా పొందవలసిందే తప్ప మరొక విధంగా సాధ్యం కాదు అని బోధిస్తుంది. ఇది ఆచరణలో వ్యక్తి స్వార్థానికి, పక్క వారిని కూడా పట్టించుకోకుండా తన ప్రయోజనమే సర్వస్వమనే తత్వానికీ దారి తీస్తుంది. భక్తి, జ్ఞాన, కర్మ, యోగ మార్గాలన్నీ ఈ రకమైన మోక్షానికేనట!

సీతారామరాజువి ఈ రెండు తత్వాలూ కావు. సాటి జనుల ఆకలినీ, కన్నీళ్లనూ, వేదననూ, పీడనను తొలగించటానికి, అందుకు మూలమైన సామ్రాజ్యవాదాన్ని ఓడించటానికీ జీవితాన్ని అర్పించటమే పరమార్థంగా ఎంచుకున్నవాడు. ఇదొక సాంఘిక దృష్టి ప్రతి జాతి, మతమూ, సంస్కృతులలో ఈ దృష్టి ఒక అంశంగా అంతర్వాహినియై ప్రవహిస్తూనే వుంటుంది. "పరోపకారార్థ మిదం శరీరం" లాంటి భావశకలాలు భౌతిక రూపం ధరిస్తే సమాజ సేవాతత్పరులుగా రూపొందవచ్చు. కనుక

సీతారామరాజును విలక్షణమైన 'హిందూసన్యాసి'గా భావించవలసి వుంటుంది. ఆయన ఆచరణ సారాన్నీ, దాని తత్వాన్నీ సిద్ధాంతీకరిస్తే దోపిడీ పీడనలను నిర్మూలించటానికి, దానికి కారకులైన శక్తులతో, అందుకు గురయ్యే వారిని పోరాడేట్టు చేయటం, అది సాయుధంగానైనా వెరవకుండా కృషి చేయటం, జీవితాన్ని అందుకు అంకితం చేయటం "మంచి హిందువు యొక్క లక్షణంగా" నిర్ధారించవచ్చు.

సరిగ్గా ఈ విలక్షణతే ఆంధ్రదేశంలో కమ్యూనిస్టులను సీతారామరాజుని తమ పోరాట స్ఫూర్తిగా స్వీకరించేట్టు చేసింది. ఆయన చరిత్రను వెలికి తీయటంలో మొదటిసారిగా మన్య ప్రాంతాన్ని పర్యటించి సమాచారాన్ని సేకరించి గ్రంథస్తం చేసినది పొన్నలూరి రాధాకృష్ణమూర్తిగారు. దానికి సహకారం సుంకర సత్యనారాయణగారిది. ఈయన సీతారామరాజు బుర్రకథను రాసి ఎన్నో ప్రదర్శనలిచ్చారు. నాజర్ తదితర అనేక బృందాలు ఈ బుర్రకథను విస్తారంగా ప్రదర్శించాయి. అల్లూరి సీతారామరాజు నాటకాన్ని ప్రజానాట్యమండలి బృందాలు వందలాది ప్రదర్శనలిచ్చాయి.

1937లో జరిగిన ఎన్నికలలో ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో కాంగ్రెసువారు చక్రవర్తుల రాజగోపాలాచారి నాయకత్వాన అధికారాన్ని పొంది, పొన్నలూరి వారి "సీతారామరాజు" పుస్తకాన్ని నిషేధించారు. నిజాం రాష్ట్రంలో బుర్రకథ అనే కళారూపాన్నే మొత్తంగా నిషేధిస్తే, మద్రాసు రాష్ట్రంలో సుంకర సత్యనారాయణగారు రాసిన "సీతారామరాజు" బుర్రకథను, టంగుటూరి ప్రకాశంపంతులు మంత్రివర్గం నిషేధించింది.

'సీతారామరాజు పోరాటం సాగిస్తున్న కాలంలో అతనికి సహకారం అందించవద్దనీ, రాజుది పోరాటం కాదు బందిపోటు చర్యలనీ అభివర్ణించిన కాంగ్రెసు పెద్దలే ఆయన స్ఫూర్తిని తరువాత తరాలు అందుకోకుండా చేయటానికి పుస్తకాలమీద, సాంస్కృతిక ప్రదర్శనల మీద నిషేధాలు విధించారు. అయినా సీతారామరాజు స్ఫూర్తిని నిరోధించలేకపోయారు.

> **కమ్యూనిస్టు ఉద్యమం ఒకప్పుడు ఆంధ్రదేశంలో దోపిడీ వ్యతిరేక ప్రబలశక్తిగా నిలవటానికి సీతారామరాజు యొక్క పోరాట, త్యాగ సాంప్రదాయాన్ని పుణికి పుచ్చుకుంది. సీతారామరాజులోని ఈ మౌలిక తత్వాన్ని విసర్జించినవారు ప్రభుత్వాలకూ దోపిడీ పరిపాలకులకు 'మిత్రు'లయ్యారు. రామరాజు అందించిన పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తున్నవారు ఆగ్రహ పాత్రులవుతున్నారు.**

సీతారామరాజుని హిందూ యోగిగా, ముముక్షువుగా భావించే ఆర్.ఎస్.ఎస్. తరహా హిందూవాదులు ఈనాటికీ గిరిజన ప్రజానీకంపై సాగుతున్న భయంకర దోపిడీ పీడనలనుగాని, దేశంపై బిగుసుకుంటున్న సామ్రాజ్యవాద విషకౌగిలి పట్టును గానీ వ్యతిరేకించే ఆచరణాత్మక కృషి ఏమున్నది?

హిందూమత స్రవంతికి వెలుపల, వర్ణ, కులవ్యవస్థ పరిధుల్లోకి రాకుండా ఆదిమ తెగల సంస్కృతిలోనే ఉండిపోయిన గిరిజనులను హిందువులుగా మార్చే కృషి సాగిస్తున్నారు. "స్వదేశీ" ఉద్యమం పేరుతో ప్రజల్ని విదేశీ కంపెనీల ఉత్పత్తుల్ని కొనుగోలు చేయవద్దని ఆచరణ సాధ్యంకాని పిలుపునిస్తున్నారు. సామ్రాజ్యవాదులకు గేట్లు బార్లా తెరుస్తున్న ప్రభుత్వాల విధానాలకు వాటి దుష్ఫలితాలకు వ్యతిరేకంగా పోరాడకుండా, స్వదేశీ పరిశ్రమలను ధ్వంసం చేస్తున్న, వాటిని అభివృద్ధి కానివ్వకుండా చేస్తున్న లిసామ్రాజ్యవాద కంపెనీలను స్వాధీనం చేసుకోవాలనే పిలుపునివ్వకుండా దొంగదేశభక్తిని ప్రదర్శిస్తున్నారు. బాగా ప్రాచుర్యంలో కొచ్చిన విప్లవవీరుల పోరాట సారాన్ని గాలికొదిలి, వారి పేరుని మాత్రమే వాడుకునే (అది కూడా చాలా ఆలస్యంగానే) తత్వం వీరికుంది.

భగత్‌సింగ్ విషయంలోనే కాకుండా, సీతారామరాజు సందర్భంగా కూడా వీరి పరిస్థితి అంతే. వారి గాలిసోకిన మేరకు ఈ పుస్తక రచయిత (గోపరాజు నారాయణరావు) చారిత్రక దృక్పథం లోపభూయిష్టంగా తయారయింది.

ఈ పుస్తకానికి "ముందుమాట (మున్నుడి)"లో 1768 నుండి సాగుతున్న అనేక గిరిజన పోరాటాలను ప్రస్తావిస్తూ "ఈ క్రమంలోని కడపటి పోరే అల్లూరి సీతారామరాజు సాగించిన మన్య ప్రజల పోరు, 1922 ఆగస్టు 22న మొదలై 1924 జూన్‌లో ముగిసింది" అని రాశారు. (పేజీ 5) ఇది ఎంత అచారిత్రకం!!

అల్లూరి పోరాటాన్ని బ్రిటీషు సామ్రాజ్యవాదులు రక్తపుటేరుల్లో ముంచెత్తిన వైనాన్ని పుస్తకంలో రచయిత విస్పష్టంగానే రాశారు. ఆ అణచివేత ఫలితంగా గిరిజనులు మళ్లీ ఎదురు తిరగకుండా పోరాడకుండా ఉండిపోయారని రచయిత భావమా? లేక గిరిజనులు పోరాడాల్సినంతటి సమస్యలు లేకుండా ప్రశాంత జీవనం సాధించుకున్నారని తాత్పర్యమా?

ఆదిలాబాద్ జిల్లాలో కొమరం భీం పోరాటం ఎందుకు తలెత్తింది? అల్లూరి సాగించినదే ఆఖరి గిరిజన పోరాటమైతే, తదనంతరం సాగినవి గిరిజన పోరాటాలే కావని మరొక రూపంలో చెప్పటమే అవుతుంది. మహారాష్ట్రలోని వర్లీ, బెంగాల్లోని తెభాగా, ఈశాన్య రాష్ట్రాలలో 1947కు ముందే ఉద్యమాలు, పోరాటాలు చెలరేగినాయి. గత 150 సం॥ల

చరిత్రలో గిరిజనులు సాగించినన్ని పోరాటాలు, తెల్ల-నల్లదొరల సాయుధ పోలీసు మూకల దుష్కృత్యాలకు వారు గురైనంతగా మరే సాంఘిక వర్గమూ బలికాలేదు.

ఫ్యూడల్, నిజాం వ్యతిరేక పోరాటంగా మొదలైన తెలంగాణ సాయుధ పోరాటం 1950 ప్రాంతాల్లో ఖమ్మం, వరంగల్లు, నల్లగొండ, మహబూబ్ నగర్, కర్నూలు, కరీంనగర్ అటవీ ప్రాంతాల్లోకి పాకి, నిలదొక్కుకుంటున్న సమయంలో (1951లో) పోరాట విరమణ జరిగింది.

**1967లో నక్సల్బరీ సంఘటన గిరిజన పోరాటపు ఉన్నత రూపమే. శ్రీకాకుళ గిరిజనోద్యమం 1959 నుండీ సాగుతూనే వుంది. మధ్యలో (1969-70) తీవ్ర అణచివేతకు, నష్టాలకు గురయి ఉండవచ్చు. 1981 ఏప్రిల్‌లో ఇంద్రవెల్లిలో 60 మందికి పైగా గిరిజనుల్ని ఒక్కసారి కాల్చి చంపెయ్యాల్సినంత పరిస్థితి పాలకులకెందుకు కలిగింది? 1/70వ చట్టాన్ని ఏ గిరిజనోద్యమం, పోరాటం లేకుండానే దయతలిచి చేశారా? గోదావరి లోయలో, కొండమొదలులో, ఈనాడు పశ్చిమగోదావరి జిల్లా పోలవరం ప్రాంతంలో గిరిజనులు సాగిస్తున్న పోరాటాల్ని రచయిత గుర్తించదలుచుకోలేదా? లేక ప్రచురణకర్తలకు యిబ్బంది కలుగనివ్వకూడదనుకున్నారా?**

“మనది ఏడొందల సంవత్సరాల బానిస చరిత్ర. చివరి రెండొందల సంవత్సరాల కాలమయితే మరీ విషాదం” (పేజీ 4). ఇది కూడా ఆరెస్సెస్ వారి అశాస్త్రీయ దృక్పథ శకలమే. సామ్రాజ్యవాదపు ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక దోపిడీ అణచివేతలను అర్థం చేసుకోనివ్వకుండా హిందూయేతర మతస్తులను (వీరి దృష్టిలో ముస్లిములను) సామ్రాజ్యవాదంతో సమానంగా భావించే మతవిద్వేష దృక్పథమిది. పరోక్షంగా సామ్రాజ్యవాదులకు సహాయపడే దృక్పథం కూడా !.

బ్రిటీషు వ్యతిరేకత తప్ప ముస్లిం ద్వేషాన్ని అల్లూరి ఎక్కడా వ్యక్తం చేయలేదు. “భారతీయతని, దేశాభిమానాన్ని, జాతీయతని.. ఏడు వందల సంవత్సరాల బానిసత్వంతో నివురుగప్పిన జాతీయతని హైందవ ప్రవచనాలతో రంగరించి, హిందూ దేవతల రూపాలతో అలరించి దేశ ప్రజ పునరుత్తేజం పొందుతున్న కొంగ్రొత్త ఉషోదయంలో ఉత్తర భారతం మేలుకొంటున్న సమయమది” అని 1915 నాటి పరిస్థితుల ప్రభావం రామరాజుపై పడ్డ వైనం వర్ణించాడు రచయిత.

ఈ శతాబ్దపు తొలి విప్లవకారులలో ఎక్కువ మందిపై హిందూ మతాభిమానపు ఉద్వేగం వున్నది. కానీ సావర్కార్ సోదరులు తప్ప ముస్లిం ద్వేషాన్ని (అదీ వారి తొలిరోజులలో లేదు.) ఇతరులెవరూ వ్యక్తం చేయలేదు. సావర్కార్, జర్మన్ నాజీల స్ఫూర్తితో ఆవిర్భవించిన ఆరెస్సెస్, ముస్లిం ద్వేషాన్ని తమ హిందూత్వానికి ప్రాతిపదిక చేసుకుంది. అదే దృక్పథంతో చరిత్రనూ, సంస్కృతినీ, భావజాలాన్నీ వ్యాపింపచేస్తూ వుంది. రచయిత యొక్కపై వాక్యాలు ఈ ప్రభావాన్ని సూచిస్తున్నాయి. కానీ సీతారామరాజు జీవితంలోని ఒకటి రెండు ఘట్టాలు ఆరెస్సెస్ భావజాలానికి ఆయన దగ్గరగా లేడనే స్పష్టం చేస్తున్నాయి.

రామరాజు 1922 ప్రారంభంలో బాస్టియన్ దగ్గర వాంగ్మూలం ఇస్తూ తనకు తెలుగు, ఇంగ్లీషులతోపాటు సంస్కృతం, ఉర్దూ కూడా వచ్చునని చెప్పాడు. ఆనాటి పోలవరం డిప్యూటీ తహసీల్దారు ఫజలుల్లా ఖాన్ రామరాజు పినతండ్రికి స్నేహితుడు. “చిన్నవయసులోనే రాజు పెంచుకున్న వేదాంత పరిజ్ఞానాన్ని చూసి ఫజలుల్లాఖాన్ ఆనందించాడు”. పై స్నేహం కారణంగా “రాజును పోలీసులు జాగ్రత్తగా చూడటం మొదలు పెట్టారు. తాను నేపాలు యాత్రకు వెడతాననీ పోలీసు నిర్బంధం నుంచి విముక్తి చేయవలసిందనీ రాజు దరఖాస్తు చేశాడు. ఫజలుల్లాఖాన్ రాజును నమ్మి అనుమతి ఇచ్చాడు” (పేజీ.24-26) గోపరాజే ‘ప్రజాసాహితి’లో రాసిన “విప్లవజ్యోతి అల్లూరి సీతారామరాజు” వ్యాసంలో “షేక్ మదీనా అనే కానిస్టేబుల్‌ను మంచి చేసుకుని, అతని వద్ద తుపాకీ కాల్చటం నేర్చుకున్నాడు.” (మన్యం వీరుని పోరుదారి-పేజీ 3) అనీ, “ఎలాంటి వాడయినా కావచ్చు. ఏ మతం వాడయినా కావచ్చు, వాడు భారతీయుడే అయితే ప్రాణహాని తలపెట్టవద్దని తన అనుచరులను రామరాజు కట్టడి చేశాడు(పేజీ 3).

మరొక అంశం.. సీతారామరాజు దొరికి పోవటానికి ముందు అంతర్మథనం చెందినట్టుగా రచయిత ఆనాటి క్రూర అణచివేతల విషాదాన్ని అభివర్ణించాడు. వాస్తవానికి రామరాజు పోరాటం మొత్తం స్వాతంత్రోద్యమంలోనే ఒక విశిష్టతను సంతరించుకుని ఉన్నా. దానికున్న అనేక పరిమితులు అనివార్యంగా నిర్బంధపు అణచివేతకు గురవకతప్పదు. కానీ దోపిడీ పీడనా ఉన్నంత కాలం మళ్లీ మళ్లీ తిరుగుబాట్లు చెలరేగుతూనే వుంటాయి. అవి గతంలోనూ జరిగాయి. తదనంతరమూ జరిగాయి. ఈ అనివార్యతను, అవసరాన్ని రచయిత పాఠకులకు ఆశాజనకంగా, ఉత్తేజకరంగా అందించాలే తప్ప విషాదంలో ముంచెత్తకూడదు.

ఉద్యమాలూ, పోరాటాలంటేనే బీభత్సాన్నీ, భయోత్పాతాన్ని కలిగించకూడదు. అది పోలీసులు, పాలకవర్గాలూ చేసేపని. నరరూప రాక్షసుల్లా ప్రవర్తించేదీ వాళ్లే. దాన్ని చూపి భయపెట్టి

ఉద్యమాలవైపు కన్నెత్తి చూడొద్దని బోధించేదీ వాళ్లే. రచయితకు సీతారామరాజు పోరాటం తర్వాత గిరిజన పోరాటాలే జరగలేదని (ఈ పుస్తకంలో) కాగితం మీద రాశాడు కానీ భావంలో సమకాలీన విప్లవ పోరాటాల్ని దృష్టిలో పెట్టుకుని

"ఇక మిగిలేది లక్ష్యాలు కాదు - కక్షలు. ఇక జరిగేది పునర్నిర్మాణంకాదు - విధ్వంసం. దీనికి అవతలి నుంచి జవాబు మళ్లీ విధ్వంసం. విధ్వంసాన్ని కొనసాగించటానికి ఇందరు అమాయకులను బాధించాలా?" (పేజీ 86) దోపిడీ వ్యవస్థనూ, దాన్ని కాపాడటానికి ఎంతటి క్రూర నిర్బంధానికైనా ఒడిగడుతున్న వారిని బలపరుస్తున్న రాజకీయాలను వ్యతిరేకించకుండా, ఉద్యమపు ఫలితాలను భయానకంగా చిత్రించటం సరైన దృక్పథం కాదు.

అది ఉద్యమపు పొరపాట్లను సరిదిద్దటానికి తోడ్పడదు. ఉద్యమంపైనే వ్యతిరేక భావాన్ని సృష్టిస్తుంది. సీతారామరాజు పుస్తకాలు రాసిన చాలా మంది తమ రచన చివరలో "నాయకుల జోహార్లు" అని ఒక చిట్టా యివ్వటం పరిపాటి. గొంతు ఎండి, నాలుక పిడచకట్టుకు పోతున్నా గుక్కెడు నీళ్లను అందివ్వనివారు, చనిపోయిన తర్వాత పెద్ద పెద్ద సంతాప ప్రకటనలిచ్చి ప్రయోజనమేమిటి?

1923 డిసెంబరులో అఖిల భారత జాతీయ కాంగ్రెసు మహా సభలు రామరాజు పోరాట ప్రాంతమైన మన్యానికి అత్యంత సమీపంలో కాకినాడలో జరిగాయి. మహా మహా నాయకులందరూ విచ్చేశారు. మన్యంపై పెరుగుతున్న పోలీసు నిర్బంధాన్ని ఖండించాలని ఎవరూ తలచలేదు. ఒంటరిదై అణచివేతకు గురికాబోతున్న పోరాటానికి సహకారం అందించాలన్న అభిప్రాయమే ఎవరికీ కలగలేదు. గిరిజన వ్యతిరేకమైన అటవీ చట్టాలని రద్దు చెయ్యాలన్న డిమాండు ఎవరి నుండీ రాలేదు. కానీ రామరాజు మన్యం పోరాటం క్రూరంగా అణచివేయబడి, ఆయన హత్య చేయబడిన తర్వాత జోహార్లు అంటూ ప్రకటనలు మాత్రం జోరుగానే యిచ్చారు. నాయకుల జోహార్ల ప్రకటన లిస్టు యివ్వటం వెనుక, వాటి కారణంగా రామరాజు గొప్పవాడై పోతాడనుకునే మధ్యతరగతి భావజాలం యిమిడి వుంది.

**మన్యం పోరాటానికి కాంగ్రెసు నాయకత్వం ఏ మాత్రం సహకరించకుండా ఏకాకిగా మార్చిన దాని వెనుక గల దోపిడీ రాజకీయ స్వభావాన్ని ఎండగట్టడం చాలా ముఖ్యం. ఎంతో కష్టపడి వివరాలనూ, వాస్తవాలనూ ఏర్చికూర్చినప్పటికీ సరైన దృక్పథం కొరవడితే జరిగే నష్టమెలా వుంటుందో అన్నదానికి ఈ పుస్తకం ఒక ఉదాహరణగా నిలుస్తుంది. దాన్ని మెరుగు పరుచుకుంటే మంచి రచనలు అందించగల శక్తి సామర్థ్యాలు రచయితలో యిమిడి వున్నాయి.** ❑

# నూత్న ఆవిష్కరణలలో మనం ఎందుకు వెనుకబడి ఉన్నాము?

**(23వ పేజీ తరువాయి)**

దూసుకుపోతుంటే మనం డీప్-ఫేక్(భారీ కట్టు కథనాలు) రంగంలో అగ్రగామిగా నిలిచాం. ఇవాళ జనం పెట్రోల్ ధరలు, గ్యాస్ ధరలు పెరిగాయని ఆందోళన చెందడం లేదు. శాఖాహారం మంచిదా మాంసాహారం మంచిదా అనే చర్చల్లో మనిగిపోయారు. 2025 కేంద్ర బడ్జెట్లో విద్యా పద్దును 1.28 ట్రిలియన్ డాలర్లుగా పెంచామని ప్రభుత్వం గొప్పలు చెబుతున్నది. కానీ ప్రభుత్వబడులు వేల సంఖ్యలో మూతబడుతున్నాయి. మధ్యాహ్న భోజనంలో మాంసకృత్తుల పోషకాహారం అయిన కోడిగుడ్లు ఇవ్వడం మానేశారు. దళిత విద్యార్థుల పట్ల వివక్ష కొనసాగుతూనే ఉంది. కృత్రిమ మేధ(ఏఐ)ను పాఠ్యాంశంగా చేర్చారు. కానీ న్యూరల్ నెట్‌వర్క్ గురించి బట్టీ పట్టమని చెబుతున్నారే తప్ప అవి ఎలా నిర్మించాలో అభ్యాసన చేయించడం లేదు. ఇంజనీరింగ్ కాలేజీలు ఏటా 15 లక్షల మంది పట్టభద్రులను తయారు చేస్తున్నాయి. కానీ వీరిలో 10 శాతం మందికి కూడా ఉద్యోగాలు దక్కడం లేదు. కంటెంట్ తయారీదార్లకు, కోచింగ్ సెంటర్లలో పాఠాలు చెప్పే వారికి గిరాకీ పెరిగింది. మసీదుల ముందు డాన్సులు చెయ్యడం, ఇన్‌స్టాలో రీల్స్ అప్లోడ్ చెయ్యడం 'ట్రెండింగ్'గా నడుస్తుంది. స్టార్టప్‌ల అభివృద్ధి పట్ల మనకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే ప్రభు త్వం జనం మీద పెట్టుబడులు పెట్టాలి. నాణ్యమైన విద్యా, వైద్య సౌకర్యాలు కల్పించాలి. మెరుగైన ఉద్యోగాలు కల్పించాలి. సామాజిక న్యాయంతో కూడిన సమాన అవకాశాలను పెంపొందించాలి. కానీ మనం ప్రస్తుతానికి నూతన ఆవిష్కరణల అన్వేషణకు చాలా పెడగా ఉన్నాం. జనాన్ని ఏ మార్చడం మీదే మన దృష్టంతా ఉంది. ధరల పెరుగుదలవంటి సున్నితమైన అంశాల మీద కూడా ప్రజలు స్పందించలేనంతగా ప్రభుత్వం చిల్లర విషయాల మీద చిటికెలో విద్వేషాన్ని పెంపొందించగలిగే సత్తా కలిగి ఉన్నాక మనకు ఇంకా నూతన ఆవిష్కరణలతో పనేంటి అంటారా? అస్తు, శుభమస్తు. ❑

**(అనువాదం : కె.సత్యరంజన్) - ది వైర్ సౌజన్యంతో..**

# విశ్లేషణ, విమర్శలతో సాగే 'కొత్తచూపు'


-కె.శరచ్చంద్ర జ్యోతిశ్రీ

**చూపు ప్రాథమికంగా రెండు రకాలు. ఒకటి చర్మచక్షువు అంటే కంటితో చూసే చూపు. రెండు జ్ఞానచక్షువు అంటే మేధతో చూసే చూపు. మొదటిది సాధారణమయినది. ఇది బాహ్య ప్రకృతిలోని దృశ్యాలను, ఆకృతుల్ని, తదితర సమస్తాలనూ చూపుతుంది. రెండవది మేధస్సుకు సంబంధించినది. ఆలోచనా పరంపరలోంచి వాటి మథనం లోంచి వచ్చే సారాంశాన్ని ఆవిష్కృతం చేస్తుంది. డి.వి.వి.ఎస్. వర్మగారి ఈ చూపు సమకాలీన, రాజకీయ చారిత్రక పరిణామాల మేధోమథనానికి సంబంధించిన సారాంశాన్ని ఆవిష్కృతం చేసేది.**

మరి కొత్త చూపు అంటే... సంప్రదాయ మేధోమథనానికి భిన్నమయి నది. ఏమిటా భిన్నత్వం ? మార్క్సిస్టు సిద్ధాంత ప్రాతిపదికతో చేసిన విశ్లేషణ. అంతేకాదు, మార్క్సిజం అంటే సైన్స్, అంటే సహేతుకమైన సూత్రాల ప్రాతిపదికన నిరంతరం అభివృద్ధి చెందే శాస్త్రం. మార్క్స్, ఎంగెల్స్ తరువాత లెనిన్ నుండి ఆంటోనియో గ్రాంసీ వరకు కొందరు మార్క్సిజం అభివృద్ధికి దోహదం చేశారు. వారు తమ కాలపు ఆచరణ, అనుభవాల ప్రాతిపదికన మార్క్సిజంను అభివృద్ధి పరిచారు. వర్మగారి విశ్లేషణ, విమర్శకు ప్రాతిపదిక అదే.

### వీటిమీదే ఆ చూపు

వర్మ గారి "కొత్త చూపు" వేటి మీదకు ప్రసరించింది? సినీనటుడు ఎన్.టి.రామా రావు రాజకీయ అవతారం మీదకు ప్రసరించింది. ఆ వ్యాసం 'ఎన్టీఆర్: ఒక మార్క్సిస్టు పరిశీలన'. మరో అంశం 1950వ దశకం నుండి 2020వ సంవత్సరం వరకు ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన రాజకీయ ప్రయోగాల విశ్లేషణ. అది 'ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ ప్రయోగాలు 1952-2020, వ్యవస్థను మార్చే క్రమంలో సాగే ఉద్యమాల తీరుతెన్నుల గురించి రాసింది. ఇంకో అంశం 'వ్యవస్థను మార్చే ప్రజా ఉద్యమాలు : కొత్త చూపు-కొత్త దారి'. ఈ మూడూ విడివిడిగా పుస్తకాలుగా గతంలోనే ప్రచురణ పొందాయి, వాటితోపాటు వర్మగారి సంపాదకత్వంలో వెలువడిన జాతీయస్ఫూర్తి, దారి దీపం పత్రికల కొన్ని సందర్భాలలో తీసుకొచ్చిన ప్రత్యేక సంచికలలో ప్రచురితమైన 19 సంపాదకీయాలు.




**కొత్త చూపు-రచనలు, సంపాదకీయాలు**

**డి.వి.వి.యస్.వర్మ**

**304 పేజీలు, వెల : 100/-**

**సోల్ డిస్ట్రిబ్యూషన్ :**

**విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్**

ఇందులో కార్ల్ మార్క్స్ గురించి, మార్క్స్ విమర్శనా, విశ్లేషణ పద్ధతుల గురించి, జర్మనీలో రైతు యుద్ధం గురించి ఎంగెల్స్ విశ్లేషణ, మార్క్సిజాన్ని ఎంగెల్స్ సుసంపన్నం చేసిన తీరు, ఆంటోనీయో గ్రాంసీ గురించిన పరిచయం, విప్లవ పథంలో ఆయన ప్రత్యేకతలు, అలాగే తెలుగునాట మార్క్సిస్టు మేధావులు, ఉత్తమ కమ్యూనిస్టులు అయిన ప్రముఖ సంపాదకులు చక్రవర్తుల రాఘవాచారి, బడి చదువులేని బహుముఖ ప్రజ్ఞాశాలి రాంభట్ల కృష్ణమూర్తి, సాహిత్యానికి దారిదీపం అంటూ ఆర్వీయార్ (రాళ్ళభండి వెంకటేశ్వరరావు), ఆదర్శ కమ్యూనిస్టు అరుదైన కార్మికనేత అంటూ ఎం.వి.ఎన్. కపర్ది (మందలపర్తి వెంకట నారాయణ కపర్ది), సూదంటురాయి కపర్దీ అని ప్రముఖ కమ్యూనిస్టు సిద్ధాంతకర్తలు, నాయకులు, సాహితీవేత్తల మీదా, మోడీ జైత్రయాత్రకు అడ్డుకట్ట పడుతుందా?, ఉద్యమాల నుండి ప్రభవించిన మహిళా దినోత్సవం, 2021 రిపబ్లిక్ డే ప్రత్యేకతలు, విద్యాభారతంలో వెనుక చూపు అనే సంపాదకీయాలు ఇందులో ఉన్నాయి. ఇక వివిధ దినపత్రికలలో పలు రాజకీయ అంశాలపై ప్రచురితమైన 16 వ్యాసాలు, ఈ మొత్తం రచనలను ఒక సంపుటంగా స్వీయ ప్రచురణగా వర్మగారు తీసుకొచ్చారు.

## ఆకర్షించే అంశం

'ఎన్టీఆర్ : ఒక మార్క్సిస్టు పరిశీలన' రెండు తెలుగు రాష్ట్రాల లో సహజంగా ఎవరినైనా ఆకర్షించే అంశం. ఇది గతమే కావచ్చు, కానీ కమ్యూనిస్టులు ఒక చారిత్రక ఘట్టాన్ని అర్థం చేసుకోవడానికి అనుసరించాల్సిన శాస్త్రీయ పద్ధతికి ఈ పుస్తకం ఒక చక్కని ఉదాహరణగా ఎప్పటికీ నిలుస్తుంది. ఎలాగంటే '1848-51 మధ్యకాలంలో ఫ్రాన్స్‌లో జరిగిన రాజకీయ పరిణామాలను విశ్లేషిస్తూ కార్ల్ మార్క్స్ రాసిన లూయీ బోనపార్ట్ యొక్క బ్రూమేయర్ 18వ తేదీ' పుస్తకం లాగా. ఎందుకంటే ఈ రెండు పుస్తకాలకూ ఉన్న సారూప్యత అలాంటిది. ఏమిటి ఆ సారూప్యత? తెలుసుకోవాలంటే ఈ పుస్తకం చదవాల్సిందే.

## రుజువైన శాస్త్రీయత!

సినీ నటుడయిన ఎన్.టి.రామారావు రాజకీయ నాయకుడిగా రూపుదాల్చి తెలుగుదేశం పార్టీని స్థాపించి పది మాసాల్లోనే అధికారాన్ని కైవశం చేసుకున్న తీరుతెన్నులు ఈ రచనకు సమకాలీనం. ఆ సమకాలీనతను విశ్లేషిస్తూ దాని రూపు 'శక్తి' స్వభావాలను, ఆ శక్తి ఆవహించి 'రాజకీయ గాంధర్వుడైన' రామారావులోని వర్గ స్వభావం, ఆ వర్గంలో అతని స్థానం, ఈ ప్రభావాలతో నడిచే అతని పరిపాలనను పరిశీలిస్తూ దాని అంతిమ ఘట్టాన్ని, తుది ఫలితాన్ని అంచనా వేశారు రచయిత. ఎన్.టి.రామారావు ప్రభుత్వం పతనం వెనుక పనిచేసిన శక్తులు, అతని వర్గ, వ్యక్తిగత ఆకాంక్షలు, వాటిమధ్య తలెత్తిన వైరుధ్యాలు, చివరిగా పతనం అయిన తీరు వర్మగారి అంచనాకు ఉన్న శాస్త్రీయతను రుజువు చేశాయి.

ఇది ఏడు అధ్యాయాల పుస్తకం. మొదటి అధ్యాయంలో 'విస్మరించిన విశ్లేషణా పద్ధతి' అంటూ పుస్తకంలోని విశ్లేషణా విధానం మొత్తానికీ ఆధారమైన మార్క్సిజం, లెనినిజంకు సంబంధించిన సైద్ధాంతిక అంశాలను ప్రస్తావించారు. మిగతా ఐదు అధ్యాయాలలో తెలుగుదేశం పార్టీ పుట్టుకకు ఉన్న రాజకీయ నేపథ్యం, ఎన్.టి. రామారావు తెలుగుదేశం స్థాపన, దాని వెనుకనున్న 'కాంగ్రెస్ వ్యతిరేక సమ్మోహన శక్తి,' రాష్ట్రంలోని భూస్వామిక పెట్టుబడిదారీ వర్గపు తీరుతెన్నులు, దాని లక్ష్యం, ఆ వర్గానికి ప్రాతినిధ్యం వహించిన రామారావు స్వభావం, ఆ వర్గంలో అతని స్థానం, అధికార సాధనకు అతడు ప్రదర్శించిన సకల కళలు, అందులో వాగాడంబరత ప్రాధాన్యత, అతడు ప్రదర్శించిన అనేక అవతారాల వెనుక దాగిన రహస్యం, రామారావు నిజ స్వరూపం తదితర అనేకానేక అంశాలను విస్తృతంగా, లోతుగా, వలు ఆధారాలతో శాస్త్రీయంగా విశ్లేషించారు. ఉదాహరణలతో వివరించారు. సందర్భానుసారం సైద్ధాంతిక అంశాలను ప్రస్తావించారు. చారిత్రక అంశాలను పేర్కొన్నారు.

అంతిమంగా 'రామారావు పెట్టుబడిదారీ సమాజంలోని సర్వసాధారణమైన అభివృద్ధి నిరోధకత్వానికి ప్రతినిధి కాదు. స్పష్టంగా రామారావు బూర్జువా సమాజపు శిఖరాగ్రంలో తలెత్తిన క్షీణ వర్గానికి ప్రతినిధి. ఇది పెట్టుబడిదారీ అభివృద్ధి నిరోధకత్వానికి ఒక వికృత రూపం'. 'వెయ్యి హిట్లర్లను గుండెల్లో దాచుకోగల శక్తి కలిగిన వికృత రూపం. ధనం, కుళ్లు, రక్తం కలగలిసిన వికృత రూపం. తమకు తాము లాభాలు చేకూర్చుకోవడానికి ఎలాంటి దుస్సాహసికాలకైనా తలపడే క్షుద్రమైన వికృతరూపం. ఇలాంటి అభివృద్ధి నిరోధక వికృత రూపానికి ప్రతినిధి రామారావు' అని నిర్ధారించారు.

ఇక చివరి ఏడవ అధ్యాయంలో "రామారావు రాజకీయ భవిష్యత్తు"ను అంచనాగట్టారు. చివరకు "రామారావును 'అవతార పురుషుణ్ణి' చేసి 'రాజకీయ హీరో'గా అందలం ఎక్కించిన ఈ 'మాంత్రిక శక్తులు' బలహీనపడటంతో విచ్ఛిన్నమవడంతో, మంచుగడ్డ కరిగిపోవడంతో, రామారావు లోని 'దైవాంశ కూడా అదృశ్యమవుతుంది. అతనిలోని అదృశ్య శక్తులు అంతరిస్తాయి. అప్పుడే 'మంత్రదండం కోల్పోయిన మాంత్రికునిలా రామారావు తన నిజ స్వరూపంతో బయట పడతాడు. అప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయ రంగమే అతణ్ణి మట్టికరిపిస్తుంది. ఈ రాజకీయ విశ్వామిత్రుణ్ణి తాను సృష్టించుకున్న త్రిశంకు స్వర్గానికి సాగనంపుతుంది. "(పుట87) అనే అంచనాకు వస్తారు. ఈ పుస్తకం 1988 జులైలో ప్రచురితం అయింది. ఆ తరువాత 1989 డిసెంబరు ఎన్నికల్లో ఎన్.టి.రామారావు ఓటమి చవిచూశారు. తిరిగి అయిదేళ్ళకు 1994 డిసెంబరులో అధికార పగ్గాలు చేపట్టినప్పటికీ 1995 సెప్టెంబరులో పదవీచ్యుతుడు అయ్యారు. ఈ పరిణామాలు వర్మగారి అంచనాకు ఉన్న శాస్త్రీయతను రుజువు చేశారు. 'అవతార పురుషుడు', 'దైవాంశ', 'మాంత్రిక శక్తులు', 'మంత్ర దండం కోల్పోయిన మాంత్రికుడు' ఈ పద ప్రయోగాల నేపథ్యాన్ని తెలుసుకోవాలంటే పుస్తకం ఆసాంతం చదవాల్సిందే.

## హెజమనీ

ఇక "ఆంధ్రప్రదేశ్ రాజకీయ ప్రయోగాలు 1952-2020" రెండవ పుస్తకం. ఇది 2020 ఆగస్టులో ప్రచురితం అయింది. ఇందులో కమ్యూనిస్టులు : ప్రజా హెజమనీ, సినీ హీరో : సీజర్ తరహా హెజమనీ, దళిత, బహుజనులు: ఆలోచనగా హెజమనీ, ప్రాంతీయ పార్టీలు: బాస్టర్డ్ హెజమనీ, ప్రత్యామ్నాయ రాజకీయం: ప్రజా హెజమనీ అయిదు భాగాలు ఉన్నాయి. వీటికి ముందు 'ఒక సృజనాత్మక విశ్లేషణ'ను కొప్పర్తి వెంకట రమణమూర్తి రాశారు. ముందుమాటను వర్మ రాశారు. ఆంధ్ర ప్రదేశ్ చరిత్ర అనేకులు రాసిందే, కానీ వాటికీ వర్మగారి ఈ విశ్లేషణాత్మక చరిత్రకూ తేడా ఉంది. ఏమిటా తేడా ? ఈ

విశ్లేషణలో ఇతరులు వినియోగించుకోని ఒక నూతనత్వం ఉంది. అది మార్క్సిజంలో నుంచి అభివృద్ధి చెందిన నూతనత్వం. ఇటలీ మార్క్సిస్టు మేధావి ఆంటోనియో గ్రాంసీ 'హెజమనీ' సిద్ధాంతం, సంఘర్షణాత్మక సందర్భంలో కొనసాగాలంటే 'ఆమోదం' కూడా అవసరమే. ఎవరి ఆమోదం ఎవరికి అవసరం ? ఆధిపత్య వర్గానికి తన పాలనను కొనసాగించేందుకు ఇతర సామాజిక, సాంస్కృతిక వర్గాల ఆమోదం కావాలి. తన పరిపాలనను సాగించేందుకు గతంలో పరిపాలనా యంత్రాంగంపైన మాత్రమే ఆధారపడే పాలక వర్గం ఇప్పుడు దానితోపాటు ఈ వర్గాల ఆమోదం యొక్క అవసరాన్ని గుర్తించింది.

ఆంధ్రదేశంలోని వర్తమాన రాజకీయ పరిణామాలను గ్రాంసీ సిద్ధాంత సాయంతో పరిశీలిస్తే ఈ వాస్తవం మన కళ్లకు కడుతుంది. వర్మ గారి కృషి ఈ మార్గంలోనే సాగింది. ఈ రచనద్వారా 1952 కమ్యూనిస్టుల హెజమనీ నుండి నేటి వరకు ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన రాజకీయ సామాజిక, ఉద్యమాల చారిత్రకగతికి సంబంధించిన సత్యాలు మనకు తెలుస్తాయి. ఫలితంగా మంచి భవిష్యత్తుకు అనుసరించాల్సిన మార్గం ఏదో అర్థం అవుతుంది. ఆ మార్గం 'కౌంటర్ హెజమనీ'. ఉద్యమాల గురించి ఆలోచించేవారు,ఉద్యమాలలో పనిచేసేవారు, ప్రగతిశీల శక్తులు తప్పక తెలుసుకోవాల్సిన చరిత్ర ఇది.

మరి మూడో పుస్తకం "వ్యస్థను మార్చే ప్రజా ఉద్యమాలు కొత్త చూపు–కొత్తదారి", ఇది 2018లో ప్రచురణ పొందింది. వ్యవస్థను మార్చే ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలి, మార్క్స్ రచనల నేపథ్యంలో, ప్రజల ఆకాంక్షలు భౌతిక శక్తిగా మారే క్రమం, పెట్టుబడిదారీ వ్యవస్థను మార్చే ఉద్యమాలకు కొత్త చూపు, కొన్ని వాదాలు కొన్ని వివాదాలు, ప్రజా ఉద్యమాలు కొన్ని పరిశీలనాంశాలు అనే ఆరు వ్యాసాలు ఉన్నాయి.

పరిష్కారాలు లభించని వరుస ఆర్థిక సంక్షోభాలలో కొట్టుమిట్టాడుతున్న ప్రపంచంలో ప్రజలు ఉద్యమించాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పడమే ఈ వ్యాసాల లక్ష్యంగా కనిపిస్తోంది. పతనావస్థలో ఉన్న పెట్టుబడిదారీ ప్రపంచంలో "మొత్తం మీద వ్యవస్థ మీద దాడిచేసే పారాటాలు మాత్రం జరగడం లేదు. ప్రపంచ నేపథ్యం వ్యవస్థను మార్చే ఉద్యమాలకు గొప్ప అవకాశాలను కల్పిస్తున్నది. వ్యవస్థను మార్చాలనుకునే వారంతా దీనిని అందిపుచ్చుకోవాలి. వ్యవస్థను మార్చే ప్రత్యేక ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలి" అని పిలుపునిచ్చారు. ఆ ఉద్యమాలకు "కొత్త చూపుని, కొత్త దారిని ఆవిష్కరించడం" ఈ వ్యాసాల ఉద్దేశం అని తొలి వ్యాసంలోనే వర్మగారు స్పష్టం చేశారు. నిరుత్సాహానికి గురవుతున్న ఉద్యమకారులను పునరుత్తేజపరిచే వ్యాసాలు ఇవి.

ఈ దోపిడీ వ్యవస్థపై జరిగే పోరాటాలు ఆశించిన రీతిలో పురోగ మించడంలేదని అందుకు కారణం ప్రజల మనస్సులను ప్రభావితం చేయలేక పోవడమేనని అంటూ 'ఒక సిద్ధాంతం లేదా భావజాలం ప్రజల మనసులను ఆకట్టుకోగలిగినప్పుడు లేదా గెలుచుకోగలిగినప్పుడు అది భౌతికశక్తిగా మారుతుంది.' అని మార్క్స్ విశ్లేషణను గుర్తు చేస్తారు. మార్క్స్ రచనల నేపథ్యంలో అనే మరో వ్యాసంలో. "ప్రజలు తమ దైనందిన సమస్యల మీద, జీవితాలలో మార్పు తెచ్చే అంశాల మీద ఆకాంక్షలు కలిగి ఉంటారు. ఈ ఉమ్మడి ఆకాంక్షలకు వ్యవస్థను మార్చే కొత్త నినాద రూపాలు ఇవ్వగలగాలి. దానికి సిద్ధాంత పునాది, భావజాల బలం అవసరం" అని ప్రజా జీవితానికి అవసరమైన వ్యవస్థను మార్చేందుకు దోహదపడే అంశాన్ని ఎంచుకొని వాటిని జనంలోకి తీసుకెళ్ళేందుకు, వారిని సమీకరించగలిగిన శక్తివంతమైన నినాదాలు ఎంతో అవసరం అంటారు. ప్రజల ఆకాంక్షలు భౌతిక శక్తిగా మారే క్రమాన్ని మరో వ్యాసంలో వివరిస్తారు.

"పెట్టుబడిదారీ వ్యవస్థపై పోరాటం ముందుగా కార్పోరేట్ వ్యవస్థను బద్దలు కొట్టడంతో ప్రారంభం కావాలి" అంటారు. ఉద్యమాలకు ప్రజా కళలకు ఉండాల్సిన అవినాభావ సంబంధాలను మరో వ్యాసంలో వివరించారు. వ్యవస్థను మార్చేందుకు అవసరమైన ఉద్యమాలు, వాటిలోకి ప్రజా సమీకరణ, అందుకు అవసరమైన శక్తివంతమైన నినాదాలు, ప్రజాకళారూపాల రూపకల్పన, వాటిని జన బాహుళ్యంలోనికి తీసుకెళ్ళి ఉత్సాహపరచి, చైతన్యవంతుల్ని చేయడంలో అవసరమైన ప్రణాళిక తదితర అనేక అంశాలను వర్మ తమ వ్యాసాలలో పేర్కొన్నారు. ఇవి కొత్తతరం ఉద్యమకారులకు, ఉద్యమశ్రేణులకు ఎంతో ప్రయోజనకరం.

జాతీయస్ఫూర్తి, దారిదీపం పత్రికలు ప్రగతిశీల శక్తులకు వామపక్ష మిత్రులకు సుపరిచితమైనవే. వర్మగారి ఆధ్వర్యంలో వెలువడినవే. వాటి సంపాదకులు వారే. ఆయా సందర్భాలలో తెచ్చిన ప్రత్యేక సంచికలలోంచి అత్యంత విలువైనవి అనుకున్న 19 సంపాదకీయాలను ఈ పుస్తకంలో చేర్చారు. వీటిలో మార్క్స్, ఏంగెల్స్, గ్రాంసీ రచనల విశిష్టతను విశ్లేషించేవి ఉన్నాయి. సి.రాఘవాచారి, రాంభట్ల, కపర్ది తదితర ప్రసిద్ధ కమ్యూనిస్టు మేధావులు, ఉద్యమకారుల గురించిన సంపాదకీయాలు ఇందులో ఉన్నాయి. "సృజనశీల మేధావికి గతం మీద, వర్తమానం మీద, మార్క్సిస్టు దృక్కోణం మీద గట్టి పట్టు వుండాలి. ఈ మూడు స్రవంతుల త్రివేణి సంగమం సి.రాఘవాచారి" అంటారు. రాంభట్ల గురించి రాస్తూ "ఆయన గతంలోకి దూరిపోతారు. మార్పుకు దోహదం చేసే కొత్త మెరుపులను పట్టుకుంటారు" అంటారు. ఆర్వీయార్ గురించి రాస్తూ "ఆర్వీయార్ గొప్ప సంభాషణా చతురుడు. ఆయన రచనలకంటే, ప్రసంగాలకంటే ఆయనతో సంభాషణ ఎంతో

**(మిగతా 33వ పేజీలో)**

# జాతి పురోభివృద్ధికి సోపానాలు గ్రంథాలయాలు



- చెన్నాప్రగడ శర్మ

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, వీటి ద్వారానే సమాజప్రగతి సాధ్యమని అనేకమంది సాహితీవేత్తలు, రచయితలు, మేధావులు ఏప్రిల్ 27 ఆదివారం విజయవాడ ఎంబీ విజ్ఞాన కేంద్రంలో గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక ఆధ్వర్యాన జరిగిన రాష్ట్రస్థాయి సదస్సులో అభిప్రాయపడ్డారు. నాలుగు సదస్సుల ప్రణాళికతో ఏప్రిల్ 27 ఆదివారం ఉదయం 9.30 గంటలకు ప్రధానసభ ప్రారంభమైంది. ఉద్యమ వేదిక రాష్ట్ర కన్వీనర్ వల్లూరు శివప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం ప్రారంభోపన్యాసం చేశారు. గ్రంథాలయ ఉద్యమం అంటే ఒక పెద్ద వారసత్వమని పేర్కొన్నారు. గ్రంథాలయాల ఏర్పాటుకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్య అతిథి, అవనిగడ్డ శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ... వందేళ్ల కిందట గ్రంథాలయోద్యమం జాతీయ ఉద్యమంగా రూపుదిద్దుకుందని, మళ్లీ అలాంటి ఉద్యమమే రావాల్సిన అవసరం ఉందని చెప్పారు. గ్రంథాలయాల పునర్వికాసంతోపాటు తెలుగు భాషోద్యమానికి నాంది పలకాలని ఆకాంక్షించారు. రాబోయే రోజుల్లో అమరావతిలో అత్యాధునిక గ్రంథాలయాన్ని నిర్మించబోతున్నామని తెలియజేశారు. ఉద్యమ సారథి శివప్రసాద్ మాట్లాడుతూ కేరళ, కర్ణాటకలో మాదిరిగా రాష్ట్రంలోనూ గ్రంథాలయాలను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. అన్ని సంఘాలు, సంస్థలు, ప్రజలు, మేధావులు అందరినీ కలుపుకొని పునర్వికాస ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళతామన్న ఆశాభావాన్ని వ్యక్తీకరించారు. గ్రంథాలయ శాస్త్ర నిపుణురాలు రావి శారద మాట్లాడుతూ గ్రంథాలయాలకు పునర్వైభవం దక్కితే సమాజానికి మేలు చేకూరుతుందని అభిప్రాయపడ్డారు. మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ స్థానిక సంస్థలు వసూలు చేస్తున్న పన్నులో ఎనిమిది శాతం సెస్ నేరుగా గ్రంథాలయ సంస్థకు చేరేలా చూడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సభలో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీతలు డాక్టర్ పాపినేని శివశంకర్, డాక్టర్ మధురాంతకం నరేంద్ర, పెనుగొండ లక్ష్మీనారాయణ, డాక్టర్ వెన్నా వల్లభరావు, పి.సత్యవతి, అలపర్తి వెంకట సుబ్బారావు, దాసరి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'గ్రంథాలయ విజ్ఞానం' వ్యాస సంకలనాన్ని ప్రముఖ విద్యావేత్త డాక్టర్ పరిమి ఆవిష్కరించారు. తొలుత కశ్మీర్ ఉగ్రదాడుల్లో మృతి చెందిన వారికి నివాళులర్పించారు.

**బడి నుంచే పఠనాసక్తి పెంచాలి**

భాషా వికాసానికి పాఠశాల స్థాయి నుంచి గ్రంథాలయ వ్యవస్థ అభివృద్ధి చెందాలని డాక్టర్ మధురాంతకం నరేంద్ర చెప్పారు. 'విద్యా వ్యవస్థలు-గ్రంథాలయాలు' అంశంపై జరిగిన తొలి సదస్సుకు ఆయన అధ్యక్షత వహించారు. ప్రసంగాన్ని కొనసాగిస్తూ... పాఠశాలలు, కళాశాలలు, విశ్వ విద్యాలయాల్లో గ్రంథాలయాలను తప్పనిసరి చేయాలని పేర్కొన్నారు. గ్రంథాలయ ఉద్యమకారుడు మంచికంటి మాట్లాడుతూ...



మాతృభాషలో ప్రాథమిక విద్యాబోధన జరగకపోవడం వల్లే విద్యార్థులు ఆలోచనా పటిమ కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సభలో సి.ఎ.ప్రసాద్, జి.ఎస్.చలం, కెంగార మోహన్, దివికుమార్, చలపాక ప్రకాశ్, డాక్టర్ గుమ్మా సాంబశివరావు, జి.లక్ష్మి, టి.మనోహర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

### సాంకేతికతతో బలోపేతం

ఆధునిక సాంకేతికతతో గ్రంథాలయాలను మరింత బలోపేతం చేయవచ్చని రచయిత పవన్‌సంతోష్ చెప్పారు. రచయిత్రి కె.ఎన్. మల్లీశ్వరి అధ్యక్షతన 'సాంకేతిక యుగం–పుస్తక పఠనావశ్యకత' అంశంపై నిర్వహించిన రెండో సదస్సులో సంతోష్ మాట్లాడుతూ సామాజిక మాధ్యమాన్ని ఉపయోగించుకుని రచయితలుగా ఎదిగిన వారు ప్రస్తుతం చాలా మంది ఉన్నారన్నారు. ప్రొఫెసర్ శ్రీపత్రాయ్ మాట్లాడుతూ ప్రస్తుతం వస్తున్న సాంకేతిక విప్లవంతో ప్రపంచ సమాచారాన్ని ప్రజలు జేబుల్లోనే పెట్టుకోవచ్చని తెలి పారు. షేక్ రహ్మనుద్దీన్ మాట్లాడుతూ డిజిటల్ గ్రంథాలయాల ఆవశ్యకతను నొక్కి చెప్పారు.

### అభివృద్ధికి నడుం బిగించాలి

గ్రంథాలయాల అభివృద్ధికి చర్యలు చేపట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ చెప్పారు. 'పౌర గ్రంథాలయాలు–సమస్యలు–పునర్నిర్మాణం' అంశంపై జరిగిన మూడో సదస్సులో ఆయన మాట్లాడారు. గ్రంథాలయాలు సమస్యలకు నిలయాలుగా మారాయని, వాటిని అభివృద్ధి చేయాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ మాట్లాడుతూ ఈ రోజుల్లో పుస్తకాలు చదివే ఓపిక ఎవరికీ లేదని, తిరిగి చదవడాన్ని ప్రజలకు అలవాటు చేయాలని సూచించారు. సభలో పౌర గ్రంథాలయ సేవా సమితి అధ్యక్షుడు బి.ఎల్.నారాయణ, గ్రంథాలయ శాస్త్ర నిపుణుడు ఎల్.వెంకటేశ్వరరావు తదితరులు మాట్లాడారు.

### జీర్ణ గ్రంథాలను ఉద్ధరించాలి

జీర్ణావస్థకు చేరిన పురాతన గ్రంథాలను తిరిగి ముద్రించే దిశగా చర్యలు తీసుకోవాలని ప్రొఫెసర్ సీహెచ్. సుశీలమ్మ సూచించారు. 'పౌర గ్రంథాలయాలు–సాహిత్యం ప్రాధాన్యత' అంశంపై జరిగిన ముగింపు సదస్సులో ఆమె మాట్లాడారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ అధ్యక్షత వహించిన సభలో జర్నలిస్టులు రెంటాల జయదేవ, సత్యాజీ, వడ్లమూడి పద్మ పౌర గ్రంథాలయా లతో తమకున్న అనుబంధాన్ని వివరించారు. కవి ఖాదర్ మొహియుద్దీన్, శిఖామణి, మందరపు హైమవతి, ముంజులూరి కృష్ణకుమారి, కె.ఉషారాణి సాహిత్యానికున్న ప్రాధాన్యతను వివరించారు. సదస్సుకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు తెలంగాణ నుంచి దాదాపు 400 మంది ప్రతినిధులు హాజరయ్యారు. వీరందరికీ ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందించారు. కె.లక్ష్మయ్య, ఎస్. వెంకటనారాయణ, టి.మనోహర్ నాయుడు కార్యక్రమాలను సమన్వయపరిచారు.

గ్రంథాలయ ఉద్యమానికి సంబంధించి అనేకమంది కళాకారు లు పాటలు, పద్యాలు పాడారు. బుడబుక్కల కథతోపాటు బాబూజీ కళాబృందం 'గ్రంథాలయ ఘనత'పై చెప్పిన బుర్రకథ అందరినీ అలరించింది. కుంచనపల్లి అరవింద హైస్కూల్ విద్యార్థులు లఘు గేయ రూపకాన్ని ప్రదర్శించారు. ❑

## విశ్లేషణ, విమర్శలతో సాగే 'కొత్తచూపు'

**(30వ పేజీ తరువాయి)**

ఆకర్షణీయంగా ఉంటుంది. ఆయన మేధో సంపత్తి విశ్వరూపం కనిపిస్తుంది" అంటారు. కపర్దీ గారి గురించి రాస్తూ "కార్మికుల మనసులను గెలుచుకున్న కార్మికనేత", "కమ్యూనిస్టు నాయకులలో పరిపూర్ణ ప్రజాస్వామ్య వాది కపర్దీగారు" అంటారు. ఇవన్నీ ఆ మహనీయులతో తనకున్న అత్యంత సన్నిహిత ఉద్యమ సంబంధాల నేపథ్యంలోంచి చేసిన విశ్లేషణలే.

### ఉద్యమాలకు కొత్త దారి

'వ్యవస్థను మార్చే ప్రజా ఉద్యమాలకు కొత్త దారి చూపిస్తున్నారు వర్మగారు. ఒక సిద్ధాంతంగానీ, భావజాలంగానీ ప్రజల మనసుల్ని ఆకర్షించగలిగినపుడు అది భౌతిక శక్తిగా మారుతుందన్న మార్క్స్ భావనని శాస్త్రీయంగా వివరించారు. ప్రజల ఉమ్మడి ఆకాంక్షకు ఇట్లా భౌతికశక్తిగా మారే శక్తి ఉందని, అది ఒక పరిచారిక అవుతుందని, అంటూ వ్యవస్థని మార్చాలను కునే వాళ్ళకు మార్చేదిగా, ప్రలోభపెట్టి ఆధిపత్యపోరుకు వినియోగించుకునే వారికి అదేవిధంగా ఉపయోగపడుతుందని విశ్లేషిస్తున్నారు. ఒక ఆకాంక్ష ప్రజల నిత్య జీవనానికి సంబంధిం చినదై ఉండాలని, ఆచరణలో సాధ్యమేనన్న నమ్మకం కలిగించేదై ఉండాలని, అది తమ జీవితాల్ని ఎలా మార్చివేస్తుందో స్పష్టపరిచే మరొక చర్య జతపడాలని అప్పుడే అది భౌతిక శక్తిగా మారుతుందని కూడా అంటున్నారు. సమాజం పట్ల, ప్రజల బాగోగుల పట్ల ఎంత నిబద్ధత, తపన ఉంటే ఒక వ్యక్తి ఇట్లా ఆలోచించ గలుగుతారు, ప్రతిపాదనలు చెయ్యగలుగుతారు అనిపిస్తుంది' అంటారు సుప్రసిద్ధ చరిత్రకారులు, ప్రొఫెసర్ వకుళాభరణం రామకృష్ణ గారి "కొత్త ఆలోచనల దారులు పరచిన పథికుడు" అనే ముందుమాటలో. వర్మగారి ఈ మొత్తం కృషిని, వారి వ్యక్తిత్వాన్ని ప్రతిఫలించే మాటలివి. ❑

# తెలుగులో మార్క్సిస్టు సాహిత్య విమర్శ - పునరాలోచనలు

- ఎన్.వేణుగోపాల్



**2025 మే తాజా కలం**

ఈ వ్యాసం ఇప్పటికీ పందొమ్మిది సంవత్సరాల కింద రాసినది. అరుణతార 2006 డిసెంబర్ సంచికలో అచ్చయింది. ఇది మళ్ళీ ఒకసారి సామాజిక మాధ్యమాలలో బైటికి వచ్చినప్పుడు ఇందులో చర్చించవలసిన అంశాలున్నాయనీ, పునర్ముద్రిస్తే బాగుంటుందనీ కొందరుమిత్రులు చేసిన సూచనతో 'దారిదీపం' పునర్ముద్రిస్తున్నది. ఈ పునర్ముద్రణ సందర్భంగా పాత వ్యాసానికి కొన్ని చిన్న చేర్పులూ మార్పులూ చేశాను. పాత వ్యాసంలో నా దృష్టికి వచ్చిన భాషా దోషాలు సరిదిద్దాను. ఈ ఇరవై సంవత్సరాలలో కొత్తగా వచ్చిన సాహిత్య విమర్శ రచనలనూ, విమర్శకులనూ చేర్చాను. అభ్యుదయ, విప్లవ సాహిత్యోద్యమాల ప్రాబల్యం వల్ల తెలుగు సాహిత్య విమర్శలో మార్క్సిస్టు దృక్పథం, కనీసం కొన్ని మార్క్సిస్టు విశ్లేషణా పరికరాలు మిగిలిన సాహిత్య ఉద్యమాలకు కూడా అనుసరణీయమైనవిగా మారాయి. అందువల్ల దళితవాద, స్త్రీవాద, బహుజనవాద, మైనారిటీవాద, ప్రాంతీయవాద సాహిత్య విమర్శకులు కూడా ఎక్కడో ఒకచోట మార్క్సిస్టు పరికరాలను వాడిన ఉదాహరణలు ఉన్నాయి. కాని ఈ వ్యాసపు కేంద్రీకరణ మార్క్సిస్టు సాహిత్య విమర్శ గనుక, ఇతర సాహిత్య విమర్శ ధోరణులను, ఆయా సాహిత్య విమర్శకులను ఇక్కడ పరిగణనలోకి తీసుకోలేదు. మిత్రులు కోరుకున్నట్టుగా ఇప్పటికైనా ఈ వ్యాసం మీద చర్చ జరగాలని ఆశిస్తున్నాను.

## తెలుగులో మార్క్సిస్టు సాహిత్య విమర్శ చర్చా పత్రం

తెలుగులో మార్క్సిస్టు సాహిత్య విమర్శపై వీక్షణం సంపాదకులు ఎన్.వేణుగోపాల్ గారు ఈ వ్యాసంలో కొన్ని కీలకమైన ప్రశ్నలు లేవనెత్తారు. "ఎనిమిది దశాబ్దాలకు మించని చరిత్రగల ఒక సాహిత్య విమర్శ రంగంలో కనీసం యాభై మంది పనిచేసి ఉండడం, వందకు పైగా పుస్తకాలు వెలువడడం గణనీయమైన విషయమే. ఇంత ఘనమైన చరిత్ర, సంప్రదాయం ఉన్నప్పటికీ, తెలుగులో అసలు మార్క్సిస్టు సాహిత్య విమర్శ అంటే ఏమిటి, మార్క్సిస్టు సాహిత్య విమర్శగా దేన్ని గుర్తించాలి, మార్క్సిస్టు సాహిత్య విమర్శగా గుర్తించడానికి మౌలిక ప్రాతిపదికలేమిటి అనే ప్రాథమిక విషయాలలోనే విస్పష్టమైన, సర్వాంగీకారమైన అభిప్రాయం ఏర్పడినట్టు లేదు.

ఒక్క మాటలో చెప్పాలంటే "మార్క్సిస్టు సాహిత్య విమర్శ" అంటే ఏమిటి అనే ప్రశ్నకు సూటి సమాధానాన్ని తెలుగు సాహిత్యలోకం ఇంకా తయారు చేయలేదు. ఆ దిశగా చెప్పుకోదగిన, గౌరవించదగిన ప్రయత్నాలు కొన్ని జరిగినప్పటికీ, ఆ ప్రయత్నాలన్నిటినీ సమన్వయపరచిన సమగ్ర కృషి జరగలేదు. ఇందుకు కారణమేమిటో గుర్తించాలంటే, అసలు మార్క్సిస్టు సాహిత్య విమర్శకు ప్రాతిపదికలు ఏమిటో, అవి తెలుగు మార్క్సిస్టు సాహిత్య విమర్శలో వ్యక్తమయ్యాయో లేదో పరిశీలించాలి" ఇది జరిగి తీరాల్సిన పరిశీలన.

వేణుగోపాల్ గారి వ్యాసాన్ని చర్చాపత్రంగా మీ ముందు పెడుతున్నాం. తెలుగులో మార్క్సిస్టు సాహిత్య విమర్శకు నిర్దిష్టమైన ప్రాతిపదికలను రూపొందించ, ఇంతవరకు సాగిన మార్క్సిస్టు సాహిత్య విమర్శను విధంగా చర్చను సాగించాలని సాహితీ మిత్రులకు విజ్ఞప్తి చేస్తున్నాము

**సంపాదకవర్గం**

**మీ వ్యాసాలను- 8500 678977కు WhatsApp చెయ్యండి.**

Email : dvvsvarma1946@gmail.comకు **మెయిల్ చెయ్యండి**

తెలుగులో మార్క్సిస్టు సాహిత్య విమర్శ ఎనిమిది దశాబ్దాలకు పైగా ఉనికిలో ఉంది. 1930ల మధ్య నుంచీ తెలుగు సాహిత్యం లోకి మార్క్సిస్టుభావాల ప్రవేశం ఉన్నప్పటికీ, 1930లలోనే కొడవటిగంటి కుటుంబరావు రాసిన వ్యాసాలు, జి.వి.కృష్ణారావు రాసిన వ్యాసాలు, 'కావ్యజగత్తు' పుస్తకం ఉన్నప్పటికీ, మద్దుకూరి చంద్రశేఖరరావు రాసిన, 1944లో అచ్చయిన రెండు వ్యాసాలను తెలుగులో మెరుగయిన మార్క్సిస్టు సాహిత్య విమర్శకు ప్రారంభంగా గుర్తించవచ్చు. వీటిలో ఒకటి కురుగంటి సీతారామయ్య రాసిన 'నవ్యాంధ్ర సాహిత్యవీథులు' పై మద్దుకూరి చంద్రశేఖరరావు రాసిన, 1944 మార్చిలో వెలువడిన 'అభ్యుదయ రచనల సంపుటి'లో అచ్చయిన సమీక్షావ్యాసం. రెండవది, 'సాహిత్యం – రాయిస్టులు' పేరుతో మద్దుకూరి చంద్రశేఖరరావు 'తెలుగుతల్లి' పత్రికలో 1944 డిసెంబర్ సంచికలో రాసిన వ్యాసం. వీటికి కొనసాగింపుగా మద్దుకూరి చంద్రశేఖరరావు రాసిన 'ఆంధ్ర సాహిత్యంలో కొత్తపోకడలు', శ్రీశ్రీ రాసిన 'ఏది విప్లవ పంథా?' వ్యాసాలను కూడ చెప్పుకోవాలి. ఇవి రెండూ కూడా 1946 అక్టోబర్‌లో ప్రచురితమైన అభ్యుదయ మొదటిసంచికలో అచ్చయ్యాయి.(1)

వీటిలో 'ఆంధ్రసాహిత్యంలో కొత్తపోకడలు' వ్యాసంలో మార్క్సిస్టు దృక్పథం సరిగా వ్యక్తం కాలేదని, యాంత్రికంగా ఉందని, తేల్చివేశారని పుచ్చలపల్లి సుందరయ్య 1947లోనే విమర్శించారు. ఆ విమర్శతో ప్రత్యేకంగా కమ్యూనిస్టుపార్టీ ఒక సర్క్యులర్‌ను సభ్యులకు పంపింది. అంటే, తెలుగులోకి మార్క్సిస్టు సాహిత్య విమర్శ ప్రవేశమే దృక్పథం గురించిన వివాదంతో మొదలయింది.

ఈ ఆరు దశాబ్దాలలో మార్క్సిస్టు సాహిత్యవిమర్శగా గుర్తింపు పొందిన పుస్తకాలు దాదాపు వంద వెలువడి ఉంటాయి. విడిగా పత్రికలలో ఐదారువేల పేజీల విమర్శ రచనలు మార్క్సిస్టు సాహిత్యవిమర్శగా పేరుతెచ్చుకుని ఉంటాయి. మద్దుకూరి చంద్రశేఖరరావు, పుచ్చలపల్లి సుందరయ్య, జి.వి.కృష్ణారావు, కంభంపాటి సత్యనారాయణ, తాపీ ధర్మారావు, పాములపర్తి సదాశివరావు, కొడవటిగంటి కుటుంబరావు, శ్రీశ్రీ, కె.వి.రమణారెడ్డి, తుమ్మల వెంకటరామయ్య, ఆవంత్స సోమసుందర్, రాచమల్లు రామచంద్రారెడ్డి, ఆరుద్ర, చేకూరి రామారావు, త్రిపురనేని మధుసూదనరావు, వల్లంపాటి వెంకటసుబ్బయ్య, వరవరరావు, వెల్చేరు నారాయణరావు, కేతు విశ్వనాథరెడ్డి, కె.కె. రంగనాథాచార్యులు, రంగనాయకమ్మ, అద్దేపల్లి రామమోహనరావు, సొదుం రామ్మోహన్, వై.విజయకుమార్, రాంభట్ల కృష్ణమూర్తి, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, సి.వి.సుబ్బారావు, ఓల్గా, కె.బాలగోపాల్, రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, జె.సి, వి.చెంచయ్య, జయధీర్ తిరుమలరావు, చేకూరి శ్రీనివాసరావు, ఆర్వియార్, బి.సూర్యసాగర్, కె రవిబాబు, దివికుమార్, సంజీవమ్మ, టి.ఎల్.కాంతారావు, ఎస్వీ సత్యనారాయణ, కాత్యాయనీ విద్మహే, పాపినేని శివశంకర్, కె.రాంమోహన్‌రాయ్, తక్కోలు మాచిరెడ్డి, తెలకపల్లి రవి, ఎ.కె.ప్రభాకర్, పాణి, వరలక్ష్మి, సి.కాశీం, ఎన్.వేణుగోపాల్ వంటి తెలుగు సాహిత్య విమర్శకులెందరో మార్క్సిస్టు సాహిత్య విమర్శకులుగానో, కనీసం కొన్ని మార్క్సిస్టు సాహిత్య విమర్శా పరికరాలు ఉపయోగించిన విమర్శకులుగానో గుర్తింపు పొందారు, పొందుతున్నారు.

మార్క్సిస్టు సాహిత్య విమర్శ పరికరాలను వినియోగించడంలో, దృక్పథ స్పష్టతలో వీరి మధ్య తరతమ భేదాలు, భిన్నాభిప్రాయాలు ఉండవచ్చు గాని వీరందరినీ ఏదో ఒక రూపంలో తెలుగు సాహిత్య విమర్శ రంగంలో మార్క్సిస్టు వైఖరికి ప్రతినిధులుగా చూసే సంప్రదాయం ఉంది. ఎనిమిది దశాబ్దాలకు మించని చరిత్రగల ఒక సాహిత్య విమర్శ రంగంలో కనీసం యాభైమంది పనిచేసి ఉండడం, వందకు పైగా పుస్తకాలు వెలువడడం గణనీయమైన విషయమే.

ఇంత ఘనమైన చరిత్ర, సంప్రదాయం ఉన్నప్పటికీ, తెలుగులో అసలు మార్క్సిస్టు సాహిత్య విమర్శ అంటే ఏమిటి, మార్క్సిస్టు సాహిత్య విమర్శగా దేన్ని గుర్తించాలి, మార్క్సిస్టు సాహిత్య విమర్శగా గుర్తించడానికి మౌలిక ప్రాతిపదికలేమిటి అనే ప్రాథమిక విషయాలలోనే విస్పష్టమైన, సర్వాంగీకారమైన అభిప్రాయం ఏర్పడినట్టు లేదు. సాహిత్య విమర్శకులు మార్క్సిస్టుగా గుర్తింపు పొంది ఉన్నట్టయితే వారు రాసిందల్లా మార్క్సిస్టు సాహిత్య విమర్శగా చలామణీ అయిపోయిన సందర్భాలు ఉన్నాయి. మార్క్సిస్టు సాహిత్యధార నుంచి, మార్క్సిస్టు సాహిత్యకారుల సంఘాల నుంచి వెలువడిన సాహిత్య విమర్శ అంతా "మార్క్సిస్టు సాహిత్య విమర్శ"గా పరిగణించబడింది. అలాగే, మార్క్సిస్టు సాహిత్యధారలో వచ్చిన పుస్తకాలపై విమర్శ మార్క్సిస్టు సాహిత్యవిమర్శగా గుర్తింపు పొందింది. మార్క్సిస్టు రచయితలైనా సాంప్రదాయక అంశాల పైన, సాంప్రదాయక రచయితల పైన, పుస్తకాల పైన రాసినప్పుడు అది మార్క్సిస్టు సాహిత్య విమర్శగా గుర్తింపు పొందడం ఇబ్బంది అయింది. కొన్ని సందర్భాలలో కేవలం మార్క్సిస్టు సాహిత్య విమర్శలోని పారిభాషిక పదాలను వాడడమే మార్క్సిస్టు సాహిత్య విమర్శగా గుర్తింపు పొందింది. మార్క్సిస్టు సాహిత్య విమర్శ చెప్పే విషయాలనే చెప్పినప్పటికీ, ప్రత్యేక పదజాలంలో చెప్పకపోతే అది మార్క్సిస్టు సాహిత్య విమర్శగా గుర్తింపు పొందలేదు. తాము రాస్తున్నది మార్క్సిస్టు సాహిత్య విమర్శ అనుకున్నవాళ్లు కూడ తమ రచనలలో మార్క్సిస్టేతర, అమార్క్సియ సాహిత్య విమర్శా పరికరాల, భావనల సాయం తీసుకున్నారు. మార్క్సిస్టు సాహిత్య విమర్శకులమని తమను తాము గుర్తించుకున్నవాళ్లలో కూడ అన్ని సందర్భాలలోనూ

దృక్పథ స్పష్టత లేదు. ఒక్క మాటలో చెప్పాలంటే "మార్క్సిస్టు సాహిత్య విమర్శ" అంటే ఏమిటి అనే ప్రశ్నకు సూటి సమాధానాన్ని తెలుగు సాహిత్యలోకం ఇంకా తయారు చేయలేదు. ఆ దిశగా చెప్పుకోదగిన, గౌరవించదగిన ప్రయత్నాలు కొన్ని జరిగినప్పటికీ, ఆ ప్రయత్నాలన్నిటినీ సమన్వయపరచిన సమగ్ర కృషి జరగలేదు.

ఇందుకు కారణమేమిటో గుర్తించాలంటే, అసలు మార్క్సిస్టు సాహిత్య విమర్శకు ప్రాతిపదికలు ఏమిటో, అవి తెలుగు మార్క్సిస్టు సాహిత్య విమర్శలో వ్యక్తమయ్యాయో లేదో పరిశీలించాలి. ఒక సాహిత్యవిమర్శ రచనను మార్క్సిస్టు సాహిత్యవిమర్శగా గుర్తించడానికి కనీసం ఐదు ప్రధాన ప్రాతిపదికలు ఉండాలి. అవి 1. మార్క్సిస్టు సాహిత్యవిమర్శా సిద్ధాంతం, 2. మార్క్సిస్టు సాహిత్యవిమర్శా పద్ధతి, 3. సమాజ సాహిత్యసంబంధాల అవగాహన, అది విమర్శలో వ్యక్తమయే తీరు, 4. వస్తుశిల్పాల చర్చ, విశ్లేషణ, 5. సాహిత్యానికి గల తక్షణ – దీర్ఘకాలిక ప్రయోజనాల స్పృహ. ఈ ఐదు ప్రాతిపదికలలోనూ తెలుగు మార్క్సిస్టు సాహిత్యవిమర్శలో కొంత కృషి జరిగినప్పటికీ, జరగవలసిన కృషి ఎంతో ఉంది.

## మార్క్సిస్టు సాహిత్య విమర్శా సిద్ధాంతం

తెలుగులో మార్క్సిస్టు సాహిత్య విమర్శ ఎక్కువగా పుస్తక సమీక్షల రూపంలో, అనువర్తిత, అన్వయ విమర్శగానే సాగింది గాని సాహిత్య విమర్శా సిద్ధాంతం వైపు నుంచి ఎక్కువ కృషి జరగలేదు. అసలు సైద్ధాంతిక స్థాయిలో మార్క్సిస్టు సాహిత్య విమర్శా పద్ధతి ఏమిటనే చర్చ ఎక్కువగా జరగలేదు.

నిజానికి మార్క్సిస్టు సాహిత్య విమర్శను ఇతర సాహిత్య విమర్శల నుంచి వేరుచేసేది దాని సిద్ధాంతం, దాని పద్ధతి. సాహిత్య సృజన గురించీ, సమాజ సాహిత్య సంబంధాల గురించీ, సాహిత్య ప్రభావం గురించీ, సాహిత్య ప్రయోజనం గురించీ మార్క్సిస్టు దృక్పథంలో ప్రత్యేకమైన సైద్ధాంతిక అవగాహన ఉంది. ఆ అవగాహన మార్క్స్, ఎంగెల్స్‌ల రచనలలోనే ప్రారంభమై, గత నూట అరవై సంవత్సరాలలో ఎంతగానో విస్తరించింది. సోవియట్ యూనియన్, చైనా వంటి దేశాలలో ఆచరణలోకి వచ్చి, ఆ ఆచరణ క్రమంలో మార్పులు చేర్పులకు గురయిన సాహిత్య సైద్ధాంతిక అవగాహన ఒకవైపు ఉండగా, జర్మనీ, ఫ్రాన్స్, హంగరీ, బ్రిటన్, చెకొస్లవేకియా, అమెరికాలలో విశ్వవిద్యాలయాల లోనూ, కమ్యూనిస్టు పార్టీలలోనూ మేధావుల విశ్లేషణా కృషిలో అనేక కొత్త అంశాలు, ఆలోచనలు వెలికివచ్చాయి. ఇరవయో శతాబ్ది పొడవునా అద్భుతంగా వికసించిన ఈ మార్క్సిస్టు సాహిత్య సిద్ధాంతాన్నంతా మదింపు వేసి, మన సామాజిక, సాంస్కృతిక ప్రత్యేకతలతో జతచేసి మనకై మనం ఒక విస్పష్టమైన మార్క్సిస్టు సాహిత్య సిద్ధాంతాన్ని రూపొందించుకోవలసి ఉంది. అందులో మార్క్సిస్టు దృక్పథంలోని సార్వజనీన, సార్వకాలీన అంశాలూ ఉంటాయి, వాటిలో అదనంగా వచ్చిచేరిన అంశాలూ ఉంటాయి, మన సమాజ, సాహిత్య ప్రత్యేకతలను వివరించగల ప్రత్యేక అంశాలూ ఉంటాయి. తెలుగులో అటువంటి మార్క్సిస్టు సాహిత్య సిద్ధాంతం అభివృద్ధి చేయడానికి అవసరమయిన కృషి చాలా తక్కువ జరిగింది. అటువంటి స్వతంత్ర సాహిత్య సిద్ధాంతం రూపొందించడానికి కృషి తగినంతగా జరగకపోవడం మాత్రమే కాదు, ఇతర భాషలలో జరిగిన అటువంటి కృషిని తెలుగులోకి అనువదించే ప్రయత్నం కూడా తగినంత జరగలేదు. సాహిత్యం గురించి లెనిన్ ఒక ప్రత్యేక సందర్భంలో ప్రకటించిన అభిప్రాయాలు, విముక్త ప్రాంతంలో ఎర్రసైనికులను, రచయితలను ఉద్దేశించి మావో చేసిన ప్రసంగం మినహా, మొత్తంగా సాహిత్యం గురించి మార్క్సిస్టు సైద్ధాంతిక అవగాహనలు తెలుగులోకి ఇంతవరకూ రానేలేదు. మార్క్స్, ఎంగెల్స్ లు సాహిత్యం గురించి వెలిబుచ్చిన అద్భుతమైన విశ్లేషణలు గానీ, స్థూలంగా మార్క్సిస్టు అవగాహనా చట్రంలోనే అయినప్పటికీ, విభిన్నమైన పద్ధతిలో ప్లెహనోవ్, మయకోవ్ స్కీ, లూనషార్ స్కీ, క్రిస్టఫర్ కాడ్వెల్, ఎర్నెస్ట్ ఫిషర్, అల్థుజర్, జార్జి లూకాచ్, బెర్టోల్ట్ బ్రెఖ్ట్, జీన్ పాల్ సార్త్రే, అలెక్ వెస్ట్, హొవార్డ్ ఫాస్ట్, రేమండ్ విలియమ్స్, వాల్టర్ బెంజమిన్, టెర్రీ ఈగిల్ టన్, ఫ్రెడరిక్ జేమ్ సన్ వంటి ఎందరో మేధావులు చేసిన అపారమైన సాహిత్య విమర్శ చర్చ గాని, కొత్త భావాలు గాని, కనీసం వాటి పరిచయాలు గాని తెలుగులోకి రానే లేదు. (మాగ్జిం గోర్కీ, రాల్ఫ్ ఫాక్స్ , ఇల్యా ఎహ్రెన్ బర్గ్, జార్జి థామ్సన్‌ల రచనలలోంచి కొన్ని మాత్రం తెలుగులోకి రావడం మినహాయింపు).(2) ఆయా సైద్ధాంతిక చర్చల మౌలికాంశాలు, భావనలు పరిచయం కాలేదు గాని, ఆ చర్చల లోని వివాదాలు, అనవసర అంశాలు మాత్రం పరోక్షంగా చిలవలు పలువలతో తెలుగు చర్చా సంప్రదాయంలోకి వచ్చిచేరాయి. సిద్ధాంతం మీదకన్న ఎక్కువ పూనిక వివాదం మీద ఉండిందనేది ఒక చేదు వాస్తవం. ఈ విధంగా తెలుగులో మార్క్సిస్టు సాహిత్యవిమర్శగా పేరుతెచ్చుకున్న రచనలకు అవసరమైన తాత్విక పునాది, సైద్ధాంతిక భూమిక కొంత సమస్యాత్మకంగా ఉంది. అందువల్ల దాదాపుగా మినహాయింపులు లేకుండా అందరు "మార్క్సిస్టు సాహిత్యవిమర్శకుల"లోనూ ఎక్కడో ఒకచోట సైద్ధాంతిక పటుత్వం లేకపోవడం కనబడుతుంది. మన సమాజంలో మార్క్సిస్టులుగా మారదలచుకున్న వారిమీద ఏదో ఒక రూపంలో హైందవ బ్రాహ్మణ్య ఆలోచనల ప్రభావం కొనసాగినట్టుగానే, మార్క్సిస్టు సాహిత్యవిమర్శకులు కాదలచుకున్న వారిమీద కూడ ఆలంకారిక సాహిత్య విమర్శా పరికరాల గతకాలపు భారం కొనసాగడం కనబడుతుంది. మరొకవైపు వారే పాశ్చాత్య

సాహిత్య విమర్శ ముందుకు తీసుకొచ్చిన కొన్ని మిరుమిట్లు గొలిపే పరికరాల మోజులో పడి మార్క్సిస్టు దృక్పథపు మౌలిక పునాదులను విస్మరించడం కూడ కనబడుతుంది. అందువల్ల మార్క్సిస్టు సాహిత్య సిద్ధాంత అవగాహన పటిష్టంగా ఉండవలసినచోట, కొన్ని మార్క్సిస్టు భావాలు, కొన్ని ఆలంకారిక సాహిత్య సిద్ధాంత భావనలు, కొన్ని పాశ్చాత్య సాహిత్య సిద్ధాంత భావనలు, కొన్ని సాదాసీదా సాహిత్య ఆలోచనలు శాంతియుత సహజీవనం చేయడం కనబడుతుంది. మార్క్సిస్టు సాహిత్య విమర్శా పద్ధతిమార్క్సిస్టు సాహిత్యవిమర్శ కూడ ఇతర సాహిత్య విమర్శలలాగనే ఒక సాహిత్య రచనలోని వస్తువును, శిల్పాన్ని, దృక్పథాన్ని, ఉద్దేశ్యాన్ని, ప్రయోజనాన్ని, ప్రభావాన్ని పరిశీలిస్తుంది. రచనను వివరించడానికి, విశ్లేషించడానికి ప్రయత్నిస్తుంది. రచనను ఒక నేపథ్యంలో పెట్టి పాఠకులు ఆ రచనను గ్రహించే భూమికను విశాలం చేస్తుంది. అంటే స్థూలంగా చూసినప్పుడు మార్క్సిస్టు సాహిత్య విమర్శ కూడ ఇతర సాహిత్య విమర్శలలాగనే పనిచేస్తుందని అనిపిస్తుంది. కాని, మార్క్సిస్టు సాహిత్య విమర్శ స్పష్టంగా విభిన్నంగా, విశిష్టంగా ఉండేది దాని సంవిధానంలోనే.

ఆ సంవిధానాన్ని నిర్ణయించేవి చారిత్రక, రాజకీయార్థిక, సామాజిక, సాంస్కృతిక కోణాలు. ఇతర సాహిత్య విమర్శా రూపాలలో వీటిలోని ఒకటో రెండో కోణాలు ఉండవచ్చుగాని అవి కూడ సమగ్రంగా ఉండే అవకాశంలేదు. ఉదాహరణకు, ప్రాచీన, ఆలంకారిక సాహిత్య విమర్శలో చారిత్రక, రాజకీయార్థిక, సామాజిక కోణాలు లేవు గాని, సాంస్కృతిక కోణం ఎక్కువగానే ఉంటుంది. అయితే, ఆ సాహిత్య విమర్శలో సంస్కృతి అంటే ఏమిటని నిర్వచించే విషయంలో, సాంస్కృతిక కోణాన్ని ఆధ్యాత్మిక అర్థంలో నిర్వచించే విషయంలో సమస్యలు ఉన్నాయి. అట్లాగే సామాజికశాస్త్రాల స్పర్శతో సాగే ఆధునిక సాహిత్య విమర్శలో సామాజిక, చారిత్రక, రాజకీయార్థిక కోణాలు ఎంతో కొంత కనబడవచ్చు గాని అవి సమగ్రంగానూ, ఒక మొత్తంగానూ ఉండే అవకాశం లేదు. మౌలిక ప్రశ్నల దగ్గరికి వెళ్లే అవకాశం లేదు.

మార్క్సిజమంటే సంవిధానమే అనే అతివాద సూత్రీకరణ చేసిన విశ్లేషకులు కూడ ఉన్నారు గాని, దానిలోని అతివాదాన్ని పక్కనపెట్టి, మార్క్సిస్టు పరిశీలనా, విశ్లేషణా, పరివర్తనా క్రమంలో సంవిధానానికి చాల ప్రాధాన్యత ఉందని గుర్తించవలసి ఉంది. ఒక వస్తువును పరిశీలించడంలో, విశ్లేషించడంలో, దానిలో మార్పుకు పునాది అయిన అంశాలను గుర్తించి ఎత్తిపట్టడంలో, ఆ పరివర్తనా అంశాలను సమర్థించి వాటి భవిష్యత్తును సూచించడంలో ఇతర అన్ని దృక్పథాలనుంచి మార్క్సిస్టు దృక్పథాన్ని ఆ సంవిధానమే వేరుచేసి చూపుతుంది.

మార్క్సిస్టు సంవిధానం ఏమిటి అనే అంశం మీద గత నూటయాభై ఏళ్లుగా చాల చర్చ జరిగింది, జరుగుతోంది. ప్రధానంగా రాజకీయార్థిక శాస్త్రానికి అన్వయించి జరిగిన ఈ చర్చనుంచి ఇతర శాస్త్రాలకు ఉపయోగపడే సంవిధానాన్ని రూపొందించడానికి కూడ ప్రయత్నం జరిగింది. ఆ చర్చ గురించి ఇక్కడ వివరంగా ప్రస్తావించనక్కరలేదు గాని, రూపం – సారం, నిర్దిష్టత – సాధారణీకరణ, చారిత్రక దృష్టి, వైరుధ్యాలు అనే నాలుగయిదు ప్రమేయాలు మార్క్సిస్టు సంవిధానంలో ప్రధానమయినవి. ఈ ప్రమేయాలన్నీ కూడ సాహిత్యవిమర్శకు అన్వయించగలిగినవే. అయితే, ఎనిమిది దశాబ్దాల తెలుగు మార్క్సిస్టు సాహిత్య విమర్శలో ఈ మార్క్సిస్టు సంవిధానాన్ని సంపూర్ణంగా వినియోగించడం జరగలేదనే చెప్పాలి. నిజానికి సాహిత్య విమర్శ చేసే పని, సాహిత్యాన్ని పరిశీలించడం, వివరించడం, విమర్శించడం, విశ్లేషించడం, భవిష్యత్ రచనకు మార్గదర్శక ప్రాతిపదికలు సూచించడం అని అనుకుంటే, ఆ అన్ని పనులూ చేయడానికి ఉపయోగపడే మార్క్సిస్టు సంవిధానాన్ని వాడుకోకుండా, మార్క్సిస్టు సాహిత్య విమర్శ సాగిందంటే అది ఉండవలసినంత సమగ్రంగా లేదనే అనుకోవాలి. తెలుగు మార్క్సిస్టు సాహిత్య విమర్శ చాలవరకు మార్క్సిస్టు సంవిధానం జోలికి వెళ్లకుండానే, అంటే, సాహిత్య విమర్శ చేయవలసిన పనులన్నీ చేయకుండానే ముగిసిపోయింది. ఎక్కువలో ఎక్కువ పరిశీలనను, వివరణను మాత్రం చేపట్టింది గాని విమర్శ, విశ్లేషణ, భవిష్యత్ సూచనలు జరగవలసినంతగా జరగలేదు.

రూపానికీ సారానికీ మధ్య అంతరం లేకపోతే ఒక వస్తువును విశ్లేషించడానికి శాస్త్రం అవసరమే లేదని మార్క్స్ చేసిన మౌలిక ఆలోచనా స్ఫోరక సూత్రీకరణను తెలుగు సాహిత్య విమర్శకులలో చాలా మంది గుర్తించినట్టు కనబడదు. రూపం గురించీ, సారం గురించీ తగినంత లోతులకు వెళ్లకుండానే, ఉపరిశోధనలతోనే విమర్శ రాసి, అదే మార్క్సిస్టు సాహిత్య విమర్శ అనుకున్నవాళ్లు చాలమంది ఉన్నారు. సారం జోలికే పోకుండా రూపాన్ని తిరగరాసే సంప్రదాయం, రూపం గురించి ఎంతమాత్రం పట్టించుకోకుండా సారాన్ని వివరించే సంప్రదాయం తెలుగులో విస్తృతంగానే ఉన్నాయి. మార్క్సిస్టు సాహిత్య విమర్శకులుగా పేరు తెచ్చుకున్నవాళ్లలో కూడ చాలమంది ఈ పనే చేశారు.

నిర్దిష్టత – సాధారణీకరణ గురించి, వాటి అంతస్సంబంధాన్ని గురించి మార్క్సిస్టు సంవిధానం చేసిన అద్భుత సూత్రీకరణలెన్నో ఉన్నాయి. స్వయంగా మార్క్స్ ఈ ప్రమేయాన్ని పరిశోధనా పరికరం గానూ, వివరణ పరికరం గానూ ఎట్లా వాడుకోవచ్చునో చెప్పాడు. తెలుగు మార్క్సిస్టు సాహిత్య విమర్శలో ఈ అంశం పొందవలసినంత గుర్తింపు పొందలేదు. ఒక రచన అనే నిర్దిష్ట వస్తువును తీసుకుని సాధారణీకరణ ఎట్లా

చేయవచ్చును, ఆ సాధారణీకరణను మళ్లీ ఎట్లా నిర్దిష్ట వస్తువులకు అన్వయించవచ్చును, అసలు సామాజిక నిర్దిష్టత సాహిత్య సాధారణీకరణగా ఎట్లా మారుతుంది. సాహిత్యం లోనూ, సమాజం లోనూ నిర్దిష్టతలకూ సాధారణీకరణలకూ ఉన్న గతితార్కిక సంబంధం ఎట్లా వ్యక్తమవుతుంది అనే వైపు నుంచి సాహిత్య విమర్శ సాగిస్తే అద్భుతమైన నిర్ధారణలకు రావచ్చు.

అట్లాగే చారిత్రక దృక్పథం అనేది మార్క్సిస్టు సంవిధానంలో చాల ప్రధానమైనది. అది ఏ పరిశీలనా వస్తువునైనా ఒక పూర్వరంగంలో ఉంచడానికి, దాని పుట్టుక, పెరుగుదలలను సవ్యంగా అర్థం చేసుకోవడానికి ఉపయోగపడుతుంది. అదే సమయంలో సాహిత్య విమర్శకు అత్యవసరమైన, సాహిత్యానికి వనరుగా నిలిచే సామాజిక, రాజకీయార్థిక, సాంస్కృతిక నేపథ్యాన్ని గుర్తించడం చారిత్రక దృక్పథం సహాయంతోనే సాధ్యమవుతుంది. తెలుగు సాహిత్య విమర్శలో ఈ సంవిధాన పరికరాన్ని తగినంతగా వాడుకోలేదని అనిపిస్తుంది.

ఇక వైరుధ్యాలు, ఒకే వస్తువులో విరుద్ధాంశాల ఐక్యత, ఘర్షణ ప్రధానంగా తాత్విక ప్రమేయాలుగా కనిపించినప్పటికీ, ప్రకృతిలోనూ, సమాజంలోనూ, మానవమేధలోనూ జరిగే పరిణామాలన్నిటినీ అర్థం చేసుకోవడానికి ఉపయోగపడే ప్రమేయాలు అవి. ఆ ప్రమేయాల్ని సృజనాత్మకంగా ఉపయోగిస్తే, ఒక సాహిత్య రచనను ఇంకా ఎక్కువగా అర్థం చేసుకోవడమూ, చేయించడమూ సాధ్యమవుతుంది. కాని తెలుగు సాహిత్య విమర్శలో ఈ ప్రమేయాన్ని వాడుకున్నప్పుడు యాంత్రికంగా వాడుకోవడమూ, లేకపోతే అసలే వాడుకోకపోవడమూ జరిగింది.

## సమాజ సాహిత్య సంబంధాలు

మార్క్సిస్టు సాహిత్య విమర్శలో ప్రధానశక్తి సమాజ సాహిత్య సంబంధాలను అర్థం చేసుకోవడంలోనే, వివరించడంలోనే ఉంది. మిగిలిన అన్ని సాహిత్య విమర్శ పద్ధతులూ సమాజానికి ఇవ్వవలసినంత ప్రాధాన్యం ఇవ్వవు. సాహిత్యానికి ఇవ్వవలసిన స్థానం కన్న ఎక్కువ స్థానం ఇస్తాయి. మార్క్సిజం మాత్రమే సమాజంలోని విభిన్న పార్శ్వాల మధ్య అంతస్సంబంధాలు ఏ పద్ధతిలో రూపొందుతాయో, వాటి మధ్య ఏయే రంగాలకు ఎంత స్థానం ఉంటుందో సరిగా వివరిస్తుంది. ఎ కాంట్రిబ్యూషన్ టు ది క్రిటిక్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ ముందుమాటలో సుప్రసిద్ధమైన సూత్రీకరణలో పునాది - ఉపరితలం అనే ప్రతీకలద్వారా మార్క్స్ ఈ అంతస్సంబంధాన్ని వివరించాడు. తర్వాత కాలంలో ఈ సూత్రీకరణకు తప్పుడు వ్యాఖ్యానాలు వచ్చినప్పుడు, స్వయంగా మార్క్స్ ఎంగెల్స్ లు, ఆ తర్వాత ఎందరో మార్క్సిస్టు సిద్ధాంతవేత్తలు, సాహిత్య విమర్శకులు దాన్ని వివరించడానికి ప్రయత్నించారు.

ఆ చర్చ వివరాలలోకి ఇక్కడ పోనక్కరలేదు గాని, ఆ సూత్రీకరణను తెలుగు సమాజ ప్రత్యేకతకు అన్వయించి ఇక్కడ పునాది ఏమిటో, చారిత్రక క్రమంలో ఆ పునాది ఎట్లా మారుతూ వచ్చిందో, ఆ మార్పులు వివిధ ఉపరితల రంగాలలో ఎట్లా ప్రతిఫలించాయో, అవి సాహిత్యంలో ఎట్లా వ్యక్తమయ్యాయో వివరించడానికి ఎంతో అవకాశం ఉంది. ఆ దిశగా చాల తక్కువ ప్రయత్నం జరిగింది. తెలుగు సమాజ ప్రత్యేకతలు అన్నప్పుడు, ఇక్కడి సమాజంలోని కుల, మత, స్త్రీ-పురుష, ప్రాంతీయ, భాషా అస్తిత్వాల మధ్య అంతరాలు, అద్భుతమైన మౌఖిక సాహిత్య వారసత్వం, వెయ్యేళ్లపాటు సాగిన రాజాస్థాన, మార్గ, అగ్రవర్ణ సాహిత్యం, రాజాశ్రయ సంప్రదాయానికి భిన్నంగా, సమాంతరంగా సాగిన దేశి, ధిక్కార, ప్రజా సంప్రదాయం, ఆధునికతా భావాలవల్ల 200 ఏళ్ల కింద ప్రారంభమై వేర్వేరు పాయలుగా సాగుతున్న ఉద్యమ సాహిత్యం వంటి అనేక అంశాలున్నాయి. వీటిలో ఏ ఒక్కటయినా మార్క్సిస్టు సాహిత్య విమర్శకు గొప్ప ముడిసరుకు కాగలదు. ఆరు దశాబ్దాల మార్క్సిస్టు సాహిత్య విమర్శా కృషి తర్వాత కూడ ఆ దృక్పథం నుంచి తెలుగు సాహిత్య చరిత్ర రచన జరగలేదంటే, సమాజ సాహిత్య సంబంధాల అధ్యయనంలో తెలుగు సాహిత్య విమర్శకుల అనాసక్తి కనబడుతుంది.(3)

సమాజ సాహిత్య సంబంధాల గురించి మాట్లాడేటప్పుడు తప్పనిసరిగా వస్తుశిల్పాల చర్చ అవసరమవుతుంది. సాహిత్యానికి వస్తువును సమాజమే సమకూరుస్తుంది. శిల్పం ఒక చారిత్రక క్రమంలో, సామాజిక పరిణామ ఉత్పత్తిగా రూపొందుతుంది. అది ప్రయోగాల ద్వారా కొత్త అభివ్యక్తిని సంతరించుకుంటుంది. అందువల్ల సమాజ సాహిత్య సంబంధాల చర్చ, వస్తుశిల్పాల చర్చ ఒకదానితో ఒకటి అవినాభావంగా సాగవలసినవే. తెలుగు మార్క్సిస్టు సాహిత్య విమర్శలో ఎక్కువభాగం వస్తుశిల్పాల చర్చ తగినంత లోతుగా, విస్తృతంగా జరగలేదు గనుక, అది సమాజ సాహిత్య సంబంధాల చర్చ దాకా విస్తరించ లేదు. మార్క్సిస్టు సాహిత్య విమర్శ వస్తువును మాత్రమే పట్టించుకుంటుందనే అపోహ వచ్చేంతగా, వస్తువు మీద శ్రద్ధాసక్తులు, చర్చ, విశ్లేషణ జరిగాయి. మార్క్సిజం రూపవాదాన్ని వ్యతిరేకిస్తుంది గాని రూపాన్ని కాదు అని మార్క్సిస్టు సాహిత్య సిద్ధాంతకారులందరూ పదేపదే చెప్పిన విషయాన్ని పక్కనపెట్టి, రూపాన్ని వ్యతిరేకిస్తున్నారేమోనని అనుకునే స్థాయిలో రూపం పట్ల వ్యతిరేకత, వస్తువు మీద పూనిక కొనసాగాయి. నిజానికి, వస్తువు మీద పూనిక కూడ శిల్పం మీద పూనికతో కలిసి సాగకపోతే, అది వస్తువుకు కూడ ఏమీ మేలుచేయదు. అటు సమాజ సాహిత్య సంబంధాల మీద తక్కువ శ్రద్ధ, ఇటు వస్తుశిల్పాల ఐక్యత మీద చిన్నచూపు కలిసి సాహిత్యానికి సంబంధించిన మరొక రెండు అంశాలపట్ల తెలుగు మార్క్సిస్టు సాహిత్య విమర్శకు చిన్నచూపు కలిగించాయి. అవి

సాహిత్యకత, తాత్వికత. ఒక సాహిత్య రచనను ఇతర రచనలతో వేరు చేసేది ఏమిటి? కరపత్రానికీ, కవితకూ తేడా ఏమిటి? ఒకటి గొప్ప ఒకటి తక్కువ అనుకోకుండానే, సాహిత్య రచనల ప్రత్యేకతను గుర్తించవలసి ఉంటుంది. ఈ చర్చలో భాగంగా సాహిత్య విమర్శలో సాహిత్యకత అనే ఒక కొత్త భావన అభివృద్ధి అయింది. ఆ సాహిత్యకత సమాజాన్ని విడిచి సాము చేయగూడదనడం వరకూ ఫరవాలేదు గాని, అసలు సాహిత్యకత లేని రచనను సాహిత్యంగా అంగీకరించడం కష్టం. అట్లాగే, జీవితాన్ని ఉన్నతీకరించే ఒక సాధనంగా సాహిత్యం తప్పనిసరిగా తాత్వికతను తనలో భాగం చేసుకుంటుంది. సాహిత్యంలో ప్రాపంచిక దృక్పథం, తాత్వికత ఉంటాయి. మార్క్సిస్టు సాహిత్య విమర్శ కర్తవ్యాలలో ఈ సాహిత్యకతను, తాత్వికతను వెలికితీసి ప్రదర్శించడం, విశ్లేషించడం కూడ భాగమే. తెలుగు మార్క్సిస్టు సాహిత్యవిమర్శ ఈ పనిని చేయవలసినంత సమగ్రంగా చేసిందా అనేది అనుమానమే.

## తక్షణ - దీర్ఘకాలిక ప్రయోజనాలు

బహుశా తెలుగు మార్క్సిస్టు సాహిత్య విమర్శ లోపాల గురించి మాట్లాడుకునేటప్పుడు, తక్షణ – దీర్ఘకాలిక ప్రయోజనాల మధ్య తేడాను విస్మరించడం ఒక ప్రధానాంశంగా గుర్తించవలసి ఉంటుంది. సాహిత్యానికీ, సాహిత్య విమర్శకూ, ఆ మాటకు వస్తే ఏ ఆలోచనకైనా, ఏ ఆచరణకైనా తక్షణ, దీర్ఘకాలిక ప్రయోజనాలు ఉంటాయి. ఆ ఆలోచనాపరులకూ, ఆ కార్యకర్తలకూ ఈ అవగాహన ఉండడం తప్పనిసరి. తమ ఊహ, తమ పని ఇవాళ్టికివాళ సాధించగలిగినదీ ఉంటుంది, ఎప్పుడో భవిష్యత్తులో సాధించగలిగినదీ ఉంటుంది. ఈ వర్తమాన భవిష్యత్తుల మధ్య దూరం సమీపమైనదీ కావచ్చు, సుదూరమైనదీ కావచ్చు. కళలకూ, సాహిత్యానికీ ఐతే ఈ తక్షణ, దీర్ఘకాలాలమధ్య దూరం వేల సంవత్సరాలు కూడ ఉండవచ్చు. గుహలమీద వేటచిత్రాలు గీసుకున్న ఆదిమమానవులు తమ తక్షణ వేట అవసరం కోసమే వాటిని గీసుకుని ఉండవచ్చు. ఆ చిత్రాలు ఇవాళ్టికీ ఆదిమ చిత్రకళగా మన అనుభవంలోకి రావచ్చు. సాహిత్యకారులు కూడ తమ నిర్దిష్ట వర్తమానాన్ని అక్షరీకరించి ఉండవచ్చు, ఆ రచనలు వందల, వేల ఏళ్ల తర్వాత సమాజానికి ఉపయోగపడుతుండవచ్చు, సామాజిక అనుభవాన్ని ఉన్నతీకరిస్తుండవచ్చు. సాహిత్యానికీ, సాహిత్య విమర్శకూ ఈ చారిత్రక విహంగావలోకనా దృష్టి ఉండడం చాల అవసరం. తెలుగు సాహిత్యం లోనూ, తెలుగు సాహిత్య విమర్శలోనూ ఈ దృష్టి కొంత తక్కువే. సద్యోరచన, సద్యోవిమర్శ ఎక్కువ. మార్క్సిస్టు సాహిత్య విమర్శలోకి కూడ ఈ తాత్కాలికత ప్రవేశించింది. తెలుగులో ఉద్యమ సాహిత్య సంప్రదాయం చాల ఎక్కువ గనుక, ఆయా ఉద్యమాలకు తక్షణ అవసరాలు ఉంటాయి గనుక, సాహిత్యంలో కొంతభాగం ఈ తాత్కాలిక అవసరాలు తీర్చడానికి వినియోగపడితే అర్థంచేసుకోవచ్చు. కొంతభాగం సాహిత్య విమర్శ కూడా ఆ తాత్కాలికత అవసరాలు తీర్చడాన్ని అర్థం చేసుకోవచ్చు. కాని మొత్తంగా సాహిత్య సంప్రదాయం, సాహిత్య విమర్శా సంప్రదాయం తాత్కాలికతకు గురికావడం సమస్యలకు దారితీస్తుంది.

**ముగింపు :** ఈ లోపాలు గుర్తించడం తెలుగు మార్క్సిస్టు సాహిత్య విమర్శ లోపభరితంగా ఉన్నదని చెప్పడానికి కాదు. అద్భుత ప్రజాపోరాటాలతో గొప్ప సామాజికానుభవం, ఆ అనుభవాన్ని కళలో, సాహిత్యంలో అనితరసాధ్యంగా గ్రహించిన కళా సాహిత్య సంప్రదాయం ఉన్నచోట, ఆ అనుభవానికీ, ఆ సంప్రదాయానికీ తగినంతగా సాహిత్య విమర్శ సంప్రదాయం అభివృద్ధి చెందలేదని గుర్తించడానికి మాత్రమే. ఇప్పటికైనా తెలుగు సాహిత్య విమర్శకులందరూ, ప్రత్యేకించి మార్క్సిస్టు సాహిత్య విమర్శ రంగంలో పనిచేస్తున్న వారు ఈ అంశాల మీద దృష్టి పెట్టి పనిచేయాలని గుర్తు చేయడానికి మాత్రమే.

## వివరణ

(1). 'ఆంధ్ర సాహిత్యంలో కొత్త పోకడలు' తెలుగులో తొలి మార్క్సిస్టు విమర్శ వ్యాసమని రాచపాళెం చంద్రశేఖరరెడ్డి రాశారు. (చర్చ, పే. 171). ఈ వ్యాసం మొదట 1946 మే – జూన్‌లలో జరిగిన పెదపూడి సాహిత్యపాఠశాలలో ప్రసంగంగా సాగి, 1946 అక్టోబర్‌లో అచ్చయింది. అయితే, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌజ్ 'చంద్రం వ్యాసావళి' (1974)లో ఈ వ్యాసం అచ్చు వివరాలలో పొరపాటున 1948 అక్టోబర్ అని వచ్చింది.

(2). తెలుగులో మొత్తంగా మార్క్సిస్టు భావాల విషయంలోనే ఈ సమస్య ఉంది. తెలుగులోకి మార్క్స్ కాపిటల్ రావడానికి ఐదు దశాబ్దాలు పట్టింది. ఏడు దశాబ్దాల తర్వాతకూడ పావర్టీ ఆఫ్ ఫిలాసఫీ, ది జర్మన్ ఐడియాలజీ, డయలెక్టిక్స్ ఆఫ్ నేచర్, ఆంటీ డూరింగ్, ఎ కాంట్రిబ్యూషన్ టు ది క్రిటిక్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ వంటి మౌలిక సైద్ధాంతిక గ్రంథాలు తెలుగులోకి రాలేదు. ఒకటి ఆరా వస్తే సులభంగా, అర్థమయ్యే విధంగా రాలేదు. అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలోనూ, ఆయాదేశాల ఉద్యమాలలోనూ జరిగిన వివాదాలకు, చర్చోప చర్చలకు సంబంధించిన పుస్తకాలు మాత్రం తెలుగులోకి వెంటనే వచ్చాయి!

3 ఆరుద్ర 'సమగ్రాంధ్ర సాహిత్యం' ను మార్క్సిస్టు సాహిత్యవిమర్శగా గుర్తించడం చాలా కష్టం. కాని, ఆ దిశగా జరిగిన ప్రయత్నాలకు వెల్చేరు నారాయణరావు తెలుగులో కవితా విప్లవాల స్వరూపం, త్రిపురనేని మధుసూదనరావు మధ్యయుగ సాహిత్యం మీద చేసిన కృషి వంటి వాటిని ఉదాహరణలుగా చెప్పవచ్చు. ❑

# కులం పునాదులపై జాతిని నిర్మించలేమన్న అంబేద్కర్



- టి.స్కైలాబ్‌బాబు

అంబేద్కర్ పుట్టిన గడ్డ ఒకనాటి సెంట్రల్ ప్రావిన్సెస్‌లో సైనిక స్థావరమైన (ఇప్పటి మధ్యప్రదేశ్ రాష్ట్రం) మౌ పట్టణానికి ప్రధాని మోదీ వెళ్ళారు. అంబేద్కర్ సమాధి వద్ద మోకరిల్లి 'ఓ అంబేద్కర్ దేవుడా మీరు లేకుంటే నేను దేశానికి ప్రధాని అయ్యేవాడిని కాదని' అన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల ఫలితాల తర్వాత భారత రాజ్యాంగాన్ని గుండెకు హత్తుకుని 'మేము రాజ్యాంగాన్ని రద్దు చేస్తామని ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేశాయి. కానీ మేమే అసలైన రాజ్యాంగ రక్షకులమని' సెలవి చ్చారు. రాజ్యాంగ రక్షకులు అయితే దాని మౌలిక లక్ష్యాలైన ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, సమాఖ్య స్ఫూర్తి, సామాజిక న్యాయం వంటి వాటి మూలాలను ఎందుకు దెబ్బ తీస్తున్నారు ? పార్లమెంట్ సాక్షిగా కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తన ఆరెస్సెస్ గొంతు ద్వారా అంబేద్కర్‌ను కించపరిచాడు. అంబేద్కర్ బతికున్న కాలంలో నేనుంటే ఆయన్ను తుపాకీతో కాల్చి చంపేవాడినని ఆరెస్సెస్ కార్యకర్త హమారాప్రసాద్ అన్నారు. కర్నాటక మంత్రి అనంతరావు హెగ్డే మాకు 400 సీట్లు ఇస్తే భారత రాజ్యాంగాన్ని రద్దు చేస్తామన్నాడు. నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ రాజ్యాంగాన్ని మార్చే హక్కు మాకుంది. భాజపాతో మార్చేస్తాం. అందులో ఉన్న సెక్యులర్, సోషలిస్టు వంటి పదాలను తొలగిస్తాం' అన్నాడు. అంబేద్కర్ రాజ్యాంగ నిర్మాత కాదు, ఆయనొక్కడే రాయలేదని పలుమార్లు అవమానిస్తూ ఆరెస్సెస్, బీజేపీ నేతలు మాట్లాడారు. ఈ వ్యాఖ్యలన్నీ వాళ్లు వ్యక్తులుగా చేసినవి కావు వారి ఆరెస్సెస్-బీజేపీ మూల సిద్ధాంతం మనుస్మృతి గొంతు నుండి వచ్చినవే.

1925లో ఏర్పడిన ఆరెస్సెస్ అంబేద్కర్ పట్ల భారత రాజ్యాంగం పట్ల స్పష్టమైన వైఖరి కలిగి ఉన్నది. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ఇది ఒక అతుకులబొంత లాంటిది. ఇది బ్రిటన్ అమెరికా ఇంగ్లాండ్ నుండి అరువు తెచ్చుకున్నది. వేల ఏండ్ల కిందటే మన హైందవ ధర్మము, దేశాన్ని నడిపించే చాతుర్వర్ణ మనుస్మృతి ధర్మమే మన ప్రాచీన భారత రాజ్యాంగం అని ప్రకటించింది. అంబేద్కర్ కీర్తి ప్రతిష్టలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. అమెరికా కొలంబియా విశ్వ విద్యాలయం ప్రధాన ద్వారం ఎదుట 300 అడుగుల స్థలంలో అంబేద్కర్ విగ్రహాన్ని నెలకొల్పారు. ఐక్యరాజ్యసమితి అంబేద్కర్ 125వ జయంతిని అంతర్జాతీయ విజ్ఞాన దినోత్సవంగా ప్రకటించింది. రష్యా అధ్యక్షులు పుతిన్ తన ఛాంబర్ వెనక అంబేద్కర్ చిత్ర పటం పెట్టుకున్నాడు. ప్రపంచమంతటా ఆయన ప్రతిష్ట పెరుగుతుంటే మన దేశంలో మాత్రం అంబేద్కర్ విగ్రహాలకు నిప్పుపెట్టే నీచత్వాలు, కాళ్లు చేతులు తీసేసే దుర్మార్గాల్ని పాలకులు పెంచి పోషిస్తున్నారు ! అంబేద్కర్ మనదేశంలో అంట రానికులంలో పుట్టడమే నేరమా ? ఆయనకు దేశ పాలకులు ఇచ్చే గౌరవం ఇదేనా ? ఈ సందర్భంగానైనా ఆలోచించాల్సిన అవసరం ఉంది.

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అంటే రాజ్యాంగం రాశాడు, రిజర్వేషన్లు ఇచ్చాడు అనే పరిమిత అవగాహనతో మాత్రమే ఆయన్ను చూస్తు న్నారు. కానీ, అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం, రాష్ట్రాలు-మైనార్టీలు, కుల నిర్మూలన వంటి గ్రంథాలు అధ్యయనం చేస్తే భారత భవిష్యత్తు కోసం ఆయన కన్న కలలు ఏమిటో అవగతమవుతుంది. ఓ వైపు సంఘ్ పరివార్ అంబేద్కర్‌ను అవమానిస్తుంటే ఆయన లక్ష్యాలను తుంగలో తొక్కుతుంటే, మరోవైపు అంబేద్కర్ ఆశయాలు సాధిస్తామనే వాళ్లు అంతకన్నా ఎక్కువే ఉద్భవిస్తున్నారు. ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి దండేసి దండాలు పెట్టి 'జై భీం' అని గట్టిగా నినదించి ఆ తర్వాత ఆయనను విస్మరిస్తున్నారు. అంబేద్కర్ ఆశయ వ్యతిరేకులు ఆ ఒక్క రోజు ఆయనను కొనియాడుతున్నారు. ఓ వైపు మనువాద ఆధిపత్య శక్తులు అంబేద్కర్‌ను అంటరానివానిగా చూస్తే మరోవైపు దళితుల్లోని మెజార్టీగా ఉన్నవాళ్లు అంబేద్కర్ తమ కులం వాడిగా, ఇంకా దిగజార్చబడి ఉపకులం వాడిగా మార్చేస్తున్నారు. అంబేద్కర్ ఈ దేశం కోసం కన్న కలలు, చేసిన కృషిని పట్టించుకోవట్లేదు. ఆయనను అందరివాడిగా చూడటానికి అంగీకరించట్లేదు. కులం ఆధారంగానే చూస్తూ అవమానిస్తున్నారు.

ఆరెస్సెస్ డీఎన్ఏతో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కుల మత విద్వేషాలు పతాక స్థాయికి చేరాయి. నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో లెక్కల ప్రకారం మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2015లో 2,326 మంది, 2016లో 2,541 మంది, 2017లో 2,714 మంది, 2018లో 2,936 మంది దళిత మహిళలు లైంగికదాడులకు గురయ్యారు. ఒక్క 2024లోనే 50,893 ఘటనలు జరిగాయి. ఏడాదికి వెయ్యి చొప్పున హత్యలు జరుగుతున్నాయి. వీటిని అరికట్టడానికి తీసుకొచ్చిన ఎసీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం నీరుగార్చబడుతున్నది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భూమి జాతీయకరణ జరగాలని, పరిశ్రమల్లో కార్మికులకు యాజమాన్య వాటా ఉండాలని,

కార్మికులకు కనీస వేతన చట్టం అమలు కావాలని 1948లోనే చెప్పారు. మహిళ స్త్రీ పురుష సమానత్వం కోరుతూ హిందూ కోడ్ బిల్లు తెచ్చారు. ఆ బిల్లు పార్లమెంటులో ఆనాటి కాంగ్రెస్ అంగీకరించకపోతే కేంద్ర కేబినెట్ మంత్రి పదవికి రాజీనామా చేస బయటకొచ్చారు. 'కులం పునాదుల మీద ఒక జాతిని, ఒక నీతిని నిర్మించలేం. ముందు కులం పునాదులను కూకటి వేళ్లతో పెకిలించాలి' అన్నారు అంబేద్కర్. కులం పునాదులు హిందూ మతంలో, భూస్వామ్య వ్యవస్థలో ఉన్నాయని ఆనాడే చెప్పారు. భారతదేశ ప్రజలకు బ్రాహ్మణిజం, క్యాపిటలిజం శత్రువులుగా ఉంటాయని అప్పుడే ఉపదేశించారు. ఆయన రాసిన భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 14 నుండి 19 వరకు కుల, మత, భాష, లింగ భేదం లేకుండా పౌరులందరికి సమాన హక్కులుం డాలని కోరారు. ఆర్టికల్ 19 భావ ప్రకటన స్వేచ్ఛను, ఆర్టికల్ 21 తలెత్తుకొని ఆత్మగౌరవంతో బతకాలని, ఆర్టికల్ 25 నుండి 28 వరకు వ్యక్తిగత మత స్వేచ్ఛను రూపొందించారు. మతాన్ని, దేవుడిని రాజకీయాల్లోకి, పరిపాలనలోకి తేవడం దేశ సమైక్యతను దెబ్బ తీస్తుందని నాడే హెచ్చరించారు. కానీ దేశాన్ని ఏలుతున్న బీజేపీ సరిగ్గా మతోన్మాద రాజకీయాలతో దేశభవిష్యత్తును నాశనం చేస్తున్నది.


అంబేద్కర్ ఆశయవిరోధిగా ఉన్న ఆరెస్సెస్-బీజేపీ భావ ప్రకటన స్వేచ్ఛను హత్య చేస్తున్నది. నరేంద్ర ధబోల్కర్, గోవింద్ ఫన్సారే, కల్బుర్గి, గౌరీ లంకేష్ వంటి మేధావులను పొట్టన పెట్టుకుంది. కార్మికుల కనీస వేతన చట్టాన్ని అమలు చేయకపోగా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎనిమిది గంటల పనిని పన్నెండు గంటలకు పెంచింది. మహిళా సమానత్వం కోసం అంబేద్కర్ కృషి చేస్తే, నేటి బీజేపీ పాలన మహిళలపై క్రూరమైన హింసను పెంచి పోషిస్తున్నది. లైంగికదాడులు, హత్యలు, గ్యాంగ్ రేపులు, లైంగిక హింస ఈ కాలంలో 250 రేట్లు పెరిగినట్టు అనేక సర్వేలు వెల్లడించాయి. మైనార్టీలను టార్గెట్ చేసుకొని దౌర్జన్యాలు చేస్తూ వారిలో అభద్రతాభావాన్ని సృష్టిస్తున్నది. అందులో భాగమే వక్ఫ్ బిల్లు సవరణను తీసుకొచ్చి ఆమోదించింది. ఇది రాజ్యాంగ విరుద్ధ చర్య. వ్యక్తిగత మత స్వేచ్ఛను వ్యవస్థపై రుద్ది విద్వేషాలు, దాడులు పెంచి పోషిస్తున్నది. 77 ఏళ్ల స్వాతంత్రం తర్వాత కూడా కులవివక్ష అంటరానితనం కొనసాగడం దేశ మూఢత్వచాందస భావాల పుణ్యమే. ఆ భావాల్ని ప్రజలు తిప్పికొట్టాలి. అంబేద్కర్ ఆశయాలు సాధించాలనుకునే అభ్యుదయ ప్రగతిశీల అంబేద్కర్, పూలే భావజాలం కలిగినవారు, కమ్యూనిస్టులు ఐక్యంగా నేటి సరళీకరణ విధానాల దుష్ఫలితాలపై పోరాడాలి. పొంచి ఉన్న మతోన్మాద విధానాలపై ప్రజల్ని చైతన్య పరచాలి. భారత రాజ్యాంగాన్ని ప్రభుత్వ రంగ సంస్థలను, రిజర్వేషన్లను, కార్మిక చట్టాలను రక్షించుకోవడానికి ఐక్యమవ్వాలి. అంబేద్కర్ ఆశించిన కుల రహిత సమాజాన్ని నేటితరం సాధించడానికి సమరశంఖం పూరించాలి. అదే అంబేద్కర్ మనమిచ్చే నిజమైన నివాళి. ❑

## పుస్తకాల స్వీకారం









# ప్రయత్నం



- కార్ల్ మార్క్స్

సునాయాసంగా సఫలీకృతం అయ్యే ప్రయత్నం కాదు నాది
శాంతియుతంగా జరిగేదీ కాదు..
ఈ అవిశ్రాంత కృషికి అదే కారణం
కర్మ సిద్ధాంతాన్ని పూల బుట్టలా మోయలేను నేను
ఉచిత ఫలాన్నాశించనూ లేను
కర్మఫలం కోసం నిరీక్షిస్తూ..
అలౌకికానందంలో మునిగితేల్తూ..
తమను తామే అభినందించుకునే అమాయకులు వాళ్లు

నా మస్తిష్కం–
అసంఖ్యాక వైరుధ్యాల మయం
కోటాను కోట్ల కలల వలయం
వాళ్లతో నాకు రాజీ కుదరదు
ఏ కడలి కెరటాలు నన్ను చెదర్చలేవు
సమస్త విశ్వాన్ని నేను నా విశ్వాసంలోకి ఆహ్వానిస్తున్నాను

నా విశ్వాసం...
సమస్త మానవజాతి కళ్లలో వెలిగే కాగడా కావాలి
శతాధిక కళల్నుండి నేను విజ్ఞానాన్ని గ్రహించాల్సి వుంది
నేను ఇంద్రజాలికుణ్ణి కాను
నా కేకలు వాళ్లు వినిపించుకోరు
ఇక్కడ నేను అధి ప్రపంచాన్ని సృష్టించబోవడం లేదు
ధ్వంసం ప్రపంచపు సహజ క్షణం
ధ్వంసం కానిదేముంది గన్క ఈ లోకంలో
ఇక్కడ బుద్ధి జీవులు..
మంచుగడ్డల్లో చచ్చిన శవాల్కె తిరుగుతున్నారు
ఇప్పట్లో వాళ్లకు నేనర్థం కాను
ఏ వరదలూ నన్ను ముంచెత్తలేవు
ఈ వ్యవస్థ విలాసాలు, మానసిక వ్యధలు
నన్ను ప్రభావితం గావించలేవు

నా దారికి వాళ్లు రారు
నేను వాళ్లతో రాజీ పడను
వాళ్ల రాజ్యాలు కూలే విషయం నాకు తెలిసిందే
శూన్య సముద్రం మధ్య
మబ్బుల నావలు తప్ప ఏం నడుస్తాయి?
ఈ కోటలు కూలిపోవటాన్ని మనం చూస్తాం
దేశాలు నైరాశ్యపు పురుగు రూపాల్నొదలి
ఆశల సీతాకోక లౌతాయి
ఒక నవ్య సృష్టి జరుగుతుంది
ఒక కొత్త వ్యవస్థకు ద్వారాలు తెరుచుకుంటాయి
అడ్డాల నుంచి అంత్య క్రియల వరకు...
ఈ వ్యవస్థ మనల్ని నడిపిస్తుంది
తుది మొదలు దీని అవతారాలే

ఆట ముగిసే వరకూ
వ్యవస్థ తన మైదానంలో తాను పరిగెడుతుంది
వాళ్ల ఈ విలాసయాత్ర సాగుతూనే ఉంటుంది
మనం ధైర్యం భుజం మీద చెయ్యేసి నడుస్తాం
శవ నిశ్శబ్దాన్ని తగలేసి
గొంతెమ్మ కోర్కెల్ని ఖననం చేసి
శ్రమ తోడుగా మనం బాధ్యతల్ని గుర్తు చేసుకుంటాం
సిగ్గు పడాల్సిన పనిలేదు
విజయం వరించదనే భయం లేదు
కలల్ని నిజం చేయటానికి మనం
అనంత జాగృతాయాత్ర చేస్తాం
కలల్ని పండించుకోవడానికి మనం
ముందుకు మునుముందుకు కదుల్తాం. ❑

**(కార్ల్ మార్క్స్ తన 18వ యేట 1836 అక్టోబర్-డిసెంబర్ నెలల మధ్యకాలంలో రాసిన వచనపద్యం)**

అనుబంధం

# అందాల పోటీలు - ఒక అవగాహన

- తోట జ్యోతిరాణి, కాత్యాయనీ విద్మహే, వి.శోభ

"ప్రజాస్వామిక తెలంగాణ సామాజిక సమన్యాయ తెలంగాణ వంటి ఆకాంక్షలతో ప్రజల క్రియాశీల భాగస్వామ్యంతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు. ప్రజల అవసరాలు తీర్చి ఆకాంక్షలు నెరవేర్చే దిశగా ప్రభుత్వం రూపొందించుకొంటున్న విధానాల సంగతేమో కానీ తెలంగాణ ప్రభుత్వం స్వయంగా 2025 మే 7 నుండి 72వ విశ్వసుందరి పోటీలకు ఆతిథ్యం ఇవ్వడమే ఇప్పుడు చర్చనీయాంశమైంది. 28 ఏళ్ల తరువాత మళ్లీ భారతదేశం ఈ వేడుకకు వేదిక అవుతున్నందుకు హర్షం వ్యక్తం చేసిన వాళ్లు అనేకులు. అంతకన్నా ఎక్కువగా దీనిని నిరసిస్తూ, ఖండిస్తూ నింపివేయాలని నినదిస్తూ తెలంగాణ అంతటా మహిళా సంఘాలు ఉద్యమిస్తున్నాయి. ఈ సందర్భంలో 28 ఏళ్ళ క్రితం బెంగళూరులో నిర్వహించబడిన మిస్‌వరల్డ్ అందాల సుందరి పోటీల సందర్భంగా దేశవ్యాప్తంగా సాగిన స్త్రీల ఆందోళనలు, తెలుగులో వచ్చిన సాహిత్యం గుర్తుకు వస్తున్నాయి. ఆ చరిత్రలో భాగంగానే వరంగల్ నుండి స్త్రీ జనాభ్యుదయ అధ్యయన సంస్థ బాధ్యులు మిత్రులు అయిన వి.శోభ, జ్యోతిరాణి, కాత్యాయనీ విద్మహే కలిసి అందాల పోటీల పై వ్రాసి ప్రచురించిన వ్యాసం వర్తమాన సందర్భాన్ని అర్థం చేసుకొనటానికి, విశ్లేషించుకొనటానికి సహాయపడుతుంది. ఆనాడు ఈనాడూ కూడా ఈ పోటీలకు ఆతిథ్యం ఇయ్యటంలో భారతీయ సంస్కృతి, కళా వైభవాలకు అంతర్జాతీయ స్థాయి ప్రచారం కల్పించటం, పర్యాటకులను ఆకర్షించటం తద్వారా దేశీయ స్థానిక చేతివృత్తుల ఉత్పత్తులకు, కళా నైపుణ్యాలకు మార్కెట్ కల్పించటం లక్ష్యంగా చెప్పబడ్డాయి.

1996 నాటి బెంగళూరు మిస్ ప్రపంచ సుందరి పోటీలు ప్రపంచీకరణలో భాగంగా రూపొందిన నూతన ఆర్థిక విధానాల తొలిదశలో జరిగినవి. తొండ ముదిరి ఊసరవెల్లి అయినట్లుగా ఈ ఇరవై ఎనిమిదేళ్ల కాలంలో అది కార్పొరేట్ శక్తిగా పరిణామం చెందింది. లాభాపేక్ష లక్ష్యంగా స్థానికంగా, ప్రపంచవ్యాపితంగా భిన్నరంగాలలో పెట్టుబడులు పెట్టి వ్యాపారం చేయటం, వస్తుసేవలను అందించటం, ఆస్తులు సంపాదించటం దీని లక్షణం. ఉద్యోగ పరికల్పన ద్వారా ఆయా ప్రాంతాల ఆర్థికాభివృద్ధికి అవి దోహదపడతాయి అన్నది ప్రయోజనానికి సంబంధించి చెప్పేమాట. ఈ నేపథ్యంలో ఇప్పుడు ప్రభుత్వాలన్నిటికీ తారక మంత్రం 'అభివృద్ధి అంటే పెట్టుబడులను ఆకర్షించటం' అయింది. పెట్టుబడుల ఆకర్షణకు



తెలంగాణ తల్లి విగ్రహం వద్ద

మిస్‌వరల్డ్ పోటీల నిర్వహణ ఒక మంచి మాధ్యమం అని తెలంగాణ ప్రభుత్వం నమ్ముతున్నది. ఆ మేరకు మిస్ వరల్డ్ పోటీల నిర్వహణకు స్వయంగా బాధ్యత వహించింది. వ్యాపారాభివృద్ధికి సాధనంగా ప్రారంభమైన అందాల పోటీలు ఈనాడు దేశవిదేశ కార్పొరేట్ కంపెనీల పెట్టుబడుల వేటకు వేసిన ఎర అయినాయి. ఈ నేపథ్యంలో 1997 నాటి ఈ వ్యాసం అవసరం ఈనాడు ఉంది.

- కొలిమి ఎడిటోరియల్ టీమ్

మూడు వందల కోట్ల ప్రపంచ ప్రజల సాక్షిగా, నూట యాభై దేశాలకు చెందిన ఇరవై వేల మంది ప్రత్యక్ష ఆహుతుల మధ్యన, ముప్పయి లక్షల ఖర్చుతో నిర్మించిన వేదికపైన, అట్టహాసమైన అలంకరణల మధ్య, 1996 నవంబర్ 23న భారతదేశంలోని బెంగళూరు నగరంలో, అనేక మహిళా సంఘాల వేదనల ఘోష మధ్య, నిరసన స్వరాల మధ్య అర్ధరాత్రి 12 గంటలకు ప్రపంచ సుందరి ఎన్నిక ఘట్టం ముగిసింది. అంతర్జాతీయ స్థాయిలో జరిగిన ఈ పోటీలో 88 దేశాల నుండి స్త్రీలు పాల్గొన్నారు.

అమెరికా, ఫ్రాన్స్, జపాన్ మొదలైన అభివృద్ధి చెందిన దేశాల నుండి, భారతదేశం, ఫిలిప్పైన్స్, తైవాన్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల నుండి, మహిళలపై జరిగిన సైనిక అత్యాచారాలతో ప్రపంచ దృష్టికి వచ్చిన బోస్నియా వంటి దేశాల నుండి జాతి పోరాటాలు, వర్గ పోరాటాలతో వుడుకెక్కిన దక్షిణాఫ్రికా, చైనా వంటి దేశాల నుండి స్త్రీలు ప్రపంచ సుందరి పోటీలలో ఒకే రకమైన ఉత్సాహ ఉద్వేగాలతో పాల్గొని సమానంగా అందాలను ప్రదర్శించడం ఒక పెద్ద వైరుధ్య

సన్నివేశం. వాళ్ళ వాళ్ళ దేశీయ భౌగోళిక వాతావరణంతో గాని, ఆర్థిక సమస్యలతో గాని, రాజకీయ సంక్షోభాలతో గాని, ప్రజా చైతన్యంతోగాని సంబంధం లేకుండా వాళ్ళ వాళ్ళ దేశాల నుండి ఎంపికై పోటీలో పాల్గొనటానికి వచ్చిన స్త్రీలు. ఈ అందరూ ఒకే రకమైన శారీరక కొలతల మధ్య బిగించబడి అంతర్జాతీయ స్థాయిలో స్త్రీల బూటకపు సమానత్వాన్ని ప్రదర్శించారు.

ఆకర్షణీయమైన స్త్రీలను ఒకచోటకు చేర్చే బాధ్యత భుజాన వేసుకొని ఎరిక్ మోర్లీజూలియా దంపతులు 1951లో ప్రారంభించిన 'మిస్‌వరల్డ్' సంస్థ ఆధ్వర్యంలో గత నలభై ఐదేళ్ళుగా ప్రపంచసుందరి పోటీలు జరుగుతున్నాయి. ఈసారి ఈ పోటీల నిర్వహణకు అమితాబ్‌బచ్చన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏబీసీఎల్) ముందుకు రావటంతో భారతదేశం దీనికి రంగస్థలం అయింది. ఈ సందర్భం మన ముందుకు ఎన్నో విషయాలను చర్చకు తెచ్చింది. భారతీయ కళలను, సంస్కృతిని ప్రపంచం ముందుకు తీసుకురాగలిగిన సదవకాశంగా, భారతదేశానికి విదేశీ మారకద్రవ్యం సంపాదించి పెట్టగల సందర్భంగా, అంతర్జాతీయ సౌమనస్యాన్ని సాధించగల సన్నివేశంగా, స్త్రీల ఆత్మ విశ్వాసాన్ని అధికార శక్తిని నిలబెట్టి చూపగల సంఘటనగా కొందరు దీనిని అభివర్ణించారు. అంతేస్థాయిలో స్త్రీలను ప్రదర్శన వస్తువుగా, వ్యాపారపు సరుకుగా చేస్తున్నాయని అందాల పోటీలకు వ్యతిరేకత కూడా పెల్లుబికింది. నిరసన ప్రదర్శనలు, కోర్టు కేసులు నడిచాయి.

ఇన్నేళ్ళుగా అందాల పోటీలు జరుగుతుంటే, స్థానికంగా అనేక సంస్థలు అందాల పోటీలను నిర్వహిస్తుంటే ఎప్పుడూ రాని వ్యతిరేకత ఇప్పుడే ఎందుకు రావాలని పోటీని సమర్థించేవారు ప్రశ్నించటమే కాక అందాల పోటీ వ్యతిరేకోద్యమం వెనుక రాజకీయాలున్నాయని ఆరోపించారు. అందాల పోటీ వ్యతిరేకోద్యమం వెనుక దేశీయ రాజకీయాలుంటే, అందాల పోటీల నిర్వహణ వెనుక అంతర్జాతీయ రాజకీయాలున్నాయని చాలా మంది ఆందోళనకారులు అభిప్రాయపడ్డారు. ఈ రాజకీయాల స్వరూప స్వభావాలను సూచించే వార్తా రచనలు ప్రపంచసుందరి పోటీలకు ముందు వెనుకలుగా అనేకం వచ్చాయి. ప్రపంచసుందరి పోటీల సందర్భాన్ని, ఆ సందర్భంగా మన ఆలోచనా ప్రపంచాన్ని కుదిపివేసిన అందం, స్వేచ్ఛ, సమానత్వం మొదలైన భావనలను, లైంగిక రాజకీయ దృక్పథం నుండి, రాజకీయార్థిక దృక్పథం నుండి ఏకకాలంలో విశ్లేషిస్తే తప్ప అందాల పోటీ వ్యవస్థలో వున్న మాయాజాలం అర్థం కాదనిపించింది. ఈ మాయాజాలాన్ని అర్థం చేసుకొనే క్రమంలో పొందిన మా అవగాహనను మీతో పంచుకొనటానికే స్త్రీ జనాభ్యుదయ అధ్యయన సంస్థ పక్షాన ఈ చిన్న పత్రం ప్రచురిస్తున్నాం.

అందాల పోటీలకు వ్యతిరేక ఉద్యమాలు ఇప్పుడే ప్రారంభమైనవి కావు. వీటి చరిత్ర మరీ తక్కువదేమీ కాదు. స్త్రీలు ప్రపంచ సంబంధాలలో తమను చూచుకొంటూ తమ అభివృద్ధిని అంచనావేసుకొనే నూతన చైతన్యంతో ఎదుగుతున్న అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో 1968లో మొదటిసారి అందాల పోటీకి వ్యతిరేకత వచ్చింది. 1963లో బెట్టీ ఫ్రైడన్ వ్రాసిన 'ఫెమినైన్ మిస్టేక్' అనే పుస్తకం వచ్చి స్త్రీల విషయంలో ఆమోదిత విలువలను, నమూనాలను ప్రశ్నించటం నేర్పింది. ఈ సాంస్కృతిక చైతన్యం నుండి అందానికి, స్త్రీల శరీరానికి పోటీ నిర్వాహకులు ఇచ్చిన నిర్వచనాలను తిరస్కరించటం మొదలైంది. 1975 అంతర్జాతీయ మహిళా సంవత్సరం. ప్రపంచవ్యాప్తంగా మహిళల అభివృద్ధి అభ్యుదయాల గురించిన అంచనాలు ఒక కొలిక్కి వచ్చి స్త్రీల స్థాయీ హోదాలను మెరుగుపరచటానికి చేయాల్సినదెంతో వుందని స్పష్టం చేశాయి. తత్ఫలితంగా ఆ చేయాల్సిన దానికి ఒక ప్రారంభంగా ప్రకటించబడిన అంతర్జాతీయ మహిళా సంవత్సరం ఆ తరువాత 1985 వరకు మహిళా దశాబ్దంగా కొనసాగింది. ఈ పదేళ్లలో జరిగిన పరిశోధనలు, సమీకరించబడిన స్త్రీల సంఘాలు, నిర్మించబడిన మహిళా ఉద్యమాలు స్త్రీల చైతన్యంలో గుణాత్మకమైన పరిణామాన్ని తీసుకువచ్చాయి. అందులో భాగంగా భారతీయ మహిళలు అనేకానేక సమకాలీన సమస్యల మీద స్పందించినట్లుగానే, పూర్వ నిర్ధారిత నిర్మాణల మీద తిరగబడ్డట్లుగానే తమను తమనుగా మిగలనీయకుండా ప్రదర్శన వస్తువుగా చేసిన అందాల పోటీలకు వ్యతిరేకంగా స్థానికంగా ఉద్యమాలు నిర్మించారు.

ఈ చరిత్రను తడిమినప్పుడు వరంగల్లులో అందాల పోటీలకు వ్యతిరేకంగా 1983లో స్త్రీ జనాభ్యుదయ అధ్యయన సంస్థ చేపట్టిన ప్రతిఘటనా కార్యక్రమం గుర్తుకు వస్తుంది. గ్రామీణ సాంస్కృతిక నేపథ్యం గల వరంగల్లులో హైదరాబాదు నమూనా లో 'ఎగ్జిబిషన్'ను నిర్వహిస్తూ అందులో భాగంగా అందాలపోటీ కార్యక్రమాన్ని చేర్చారు. ఒకరోజు పువ్వుల ప్రదర్శన, ఒకరోజు కుక్కల ప్రదర్శన, మరొక రోజు అందాల ప్రదర్శన – ఇది వాళ్ళ కార్యక్రమం. అందులోని అమానవీయతను, స్త్రీలను హీనంగా చేసిన సంస్కృతి లక్షణాన్ని వివరిస్తూ అందాల పోటీకి వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని మలచటానికి ఒక కరపత్రం ప్రచురించి, అందాల పోటీలను ఆపివేయవలసిందిగా ఎగ్జిబిషన్ కమిటీకి విజ్ఞప్తి చేయటం జరిగింది. దానికి అనుకూలంగా స్పందించి ఎగ్జిబిషన్ కమిటీ అప్పుడా పోటీలను ఆపివేసింది కూడా. దాదాపు ఆ సమయంలోనే విజయవాడలో జరిగిన అందాల పోటీలను వ్యతిరేకిస్తూ ఆంధ్రదేశంలోని మహిళా సంఘాల వాళ్ళు పెద్ద ఎత్తున ప్రదర్శనలు నిర్వహించారు. అప్పటినుండి నిన్న మొన్నటి హైద్రాబాద్' ప్రేరణ' వంటి సంస్థలు నిర్వహించే. మిస్ ఆంధ్ర పోటీలను ఎవరో ఒకరు

ఎక్కడో ఒకచోట ప్రతిఘటిస్తూనే వున్నారు.

1980వ దశకం ఆంధ్రదేశంలో స్త్రీల ప్రతిఘటనా చరిత్రకు స్పష్టమైన రూపురేఖలనియ్యటమే కాదు, సాహిత్యరంగాన్ని స్త్రీ వాదోద్యమంతో ఆనన్యంగా ప్రభావితం చేసింది. భావజాల ప్రసారానికి అనువైన సాధనం సాహిత్యమే కదా! సమాజం స్త్రీ అంటే ఇచ్చిన నిర్వచనాన్ని స్త్రీకి నిర్దేశించిన సామాజిక కుటుంబిక సాంస్కృతిక పాత్రలని నిరాకరిస్తూ తమను తాము నిర్వచించుకొంటూ కథలు, నవలలు, కవిత్వం వ్రాశారు. అందాల పోటీల వ్యతిరేక చైతన్యాన్ని పెంచే సాహిత్యానికి విమల వ్రాసిన 'సౌందర్యాత్మకహింస' ప్రతినిధి రచన. 1988లో వచ్చింది.

అందాల పోటీ వ్యవస్థ 34, 24, 35 కొలతల మధ్య స్త్రీని నిర్వచించింది. మొటిమలు రాకుండా ముఖ సౌందర్యాన్ని కాపాడుకోవడం, జుట్టు రాలకుండా కేశ సంపదను సంరక్షించుకోవడం, నడుం లావెక్కకుండా అనునిత్యం శరీర స్పృహతో జాగరూకులై వుండటం స్త్రీల జీవితమని నిర్వచించింది. తనకంటే భిన్నమైన ఒక వ్యవస్థ నిర్వచించిన పరిధిలో స్త్రీ తనను కుంచించుకొని జీవించటం ఒక హింసా ప్రక్రియ. వ్యవస్థ నిర్వచించిన పద్ధతిలో సౌందర్యాన్ని పొందే క్రమంలో క్షణక్షణం శరీరం గాయపడుతుంది. సౌందర్యం కోసం వెంపర్లాట స్త్రీ సహజ లక్షణమని, సహజాతమని అనుకొనేంతగా మాయ కమ్ముకొంటుంది. మనసు బాధపడుతుంది. దీనిని సౌందర్యాత్మక హింస అని చెబుతూ విమల అందం పోటీయైన చోట అందం సరుకైన చోట అందాల వ్యాపారాన్ని ద్వేషిద్దాం రండి అని పిలుపునిచ్చింది.

అందాల పోటీల వ్యతిరేక చైతన్యం ఒకవైపు అభివృద్ధి చెందుతూనే వున్నా 'అందం' ఒక సహజాతాంశమని స్త్రీలను పురుషులను నమ్మించటంలో వ్యాపార ప్రపంచ సంస్కృతి తగిన వ్యూహాలతో విస్తరిస్తూనే వుంది. చర్మ సౌందర్యాన్ని ఇనుమడింపచేసే తమ ఉత్పత్తులను, సబ్బులను, క్రీములను, వాడితే పిల్లల తల్లులు కాలేజీ అమ్మాయిల్లాగా, పెళ్లి కాని కన్నె పిల్లల్లాగా కనబడతారని, పెళ్లి కాని అమ్మాయిలు అబ్బాయిలను ఆకర్షించగలుగుతారని, అలాగే కేశ పోషణకు తమ ఉత్పత్తులను వాడితే ప్రౌఢ వయస్కులు(ఆంటీలు) అమ్మాయిల్లాగా కనబడతారని, భర్తల ఆదరానికి పాత్రులవుతారని చెప్పి చూపించే వ్యాపార ప్రకటనలు ఈ కాలంలోనే కోకొల్లలుగా వచ్చాయి. అందాన్ని పరిపోషించే బ్యూటీపార్లర్లు చిన్న నగరాలలో సైతం వీధి వీధినా వెలిశాయి. ఉన్నత మధ్య తరగతి స్త్రీల జీవితంలోకి శారీరక సౌందర్య స్పృహను అత్యంత ప్రధానాంశంగా ప్రవేశపెట్టాయి. స్త్రీలను పక్కదారులు పట్టించే ఈ వ్యాపార సంస్కృతి పట్ల మహిళా ఉద్యమకారులలో నానాటికీ పెరుగుతున్న ఆందోళన, స్త్రీల జీవితాలను నియంత్రిస్తున్న వ్యవస్థలను భావజాలాన్ని అర్థం చేసుకొనటానికి అందివచ్చిన లైంగిక రాజకీయ సిద్ధాంతాల అవగాహన కలిసి ఇటు ఆంధ్రదేశంలోను, అటు మొత్తం భారతదేశంలోను ప్రపంచ సుందరి పోటీల పట్ల, అవి భారతదేశంలో జరగటం పట్ల వ్యతిరేక ఉద్యమరూపాన్ని తీసుకొనేట్లు చేశాయి.

అబద్ధాలు మూడు రకాలు అంటారు. అవి : 1. అబద్ధాలు 2. శుద్ధ అబద్దాలు 3. స్టాటిస్టిక్స్ అంటే గణాంకాలు. ఈ మూడో రకానివి అత్యున్నత స్థాయి అబద్ధాలు. అంతేకాదు ఎవరూ ప్రశ్నించటానికి వీల్లేని వ్యవస్థీకృత అబద్ధాలు. సంఖ్యాపరమైనవి కావటం వలన శాస్త్రీయంగా చెప్పినట్లనిపిస్తాయి. సంక్లిష్టంగా వుండటం వలన సామాన్యులు ప్రశ్నించలేరు. అందువలన ఎటువంటి దాన్నయినా గణాంక వివరాలతో సమర్ధించటానికి వీలుంది. తిమ్మిని బమ్మిని చేయటానికి వీలుంది. ప్రపంచ సుందరి 96 పోటీలపై ప్రజాభిప్రాయాన్ని సేకరించటానికి జరిగిన సర్వేలలో నిగ్గుతేలిన నిజం వెనుక వున్న అసలు నిజం అదే. ప్రపంచసుందరి పోటీలు బెంగళూరులో జరగటానికి వీల్లేదంటున్న స్వచ్ఛంద సంఘాల, మహిళా సంఘాల అభిప్రాయం మీద జనాభిప్రాయ ప్రతిస్పందనలు ఎలా వున్నాయో తెలుసుకోవటానికి దక్కన్ హెరాల్డ్ దినపత్రిక, ఆఫ్ట్ రీసెర్చి గ్రూపు కలిసి బెంగళూరులో, బళ్ళారిలో ఒక సర్వేను నిర్వహించి అందాల పోటీలకు సర్వత్రా ఆమోదం లభించిందని 75.7 శాతం మంది అనుకూల్యాన్ని చెప్పారు. 78.8 శాతం మంది ఈ పోటీలు కొనసాగాల్సిందేనని పట్టు పట్టినట్లు పేర్కొన్నారు. ఓటు వేసింది ఎంతమంది అన్నది కాక, వెయ్య బడిన ఓట్లలో ఎవరికి ఎక్కువ వచ్చాయన్న దానిమీద ప్రజాస్వామ్య ప్రభుత్వాలు మనుగడ సాగిస్తున్నట్లే సర్వేలో ఎంత మంది పాల్గొన్నారన్నది కాక, పాల్గొన్న వాళ్ళలో ఎక్కువ మంది ఏ అభిప్రాయాన్ని ప్రకటించారన్న దాని మీద నిజాల నిగ్గు తేల్చటం జరుగుతుంటుంది. శాంపిల్ సర్వేలలోని బండారం ఇదే. ప్రపంచసుందరి-96 పోటీలు జరగాలా వద్దా అన్న దాని మీద జరిగిన ఈ సర్వేలో పాల్గొన్న వాళ్ళు దాదాపు 600 మంది. వీరిలో పురుషుల శాతం ఎక్కువ. అత్యధిక శాతం (29.8) నెలకు పది వేలు సంపాదించే ఆదాయవర్గాల వాళ్ళు. వ్యాపారస్తులు. ఇతర వ్యాపకాల వాళ్ళు ఎక్కువ మంది (12+21.8 శాతం)-బెంగళూరు నగరానికి వున్న కాస్మోపాలిటిన్ ప్రతిష్ట పట్ల వున్న భ్రమా విశ్వాసాల నుండి ప్రపంచసుందరి-96 పోటీలు బెంగళూరులో జరగటాన్ని గర్వంగా, గౌరవంగా భావించిన వర్గం వాళ్ళ అభిప్రాయమిది. సంఘర్షిస్తున్న ఈ భావాల అభిప్రాయాల వర్తమానంపై రేపటి మహిళల ప్రతిస్పందన ఎలా వుందో తెలుసుకొందామని స్త్రీ జనాభ్యుదయ అధ్యయన సంస్థ వరంగల్లులో 1996 నవంబరు 23న కాలేజీ విద్యార్థులతో "అందాల పోటీలు విభిన్న

దృక్పథాలు" అనే అంశం మీద ఒక సదస్సు నిర్వహించింది. అవును, కాదు వంటి జవాబులు చెప్పాలని నిర్దేశించే ప్రశ్నావళిని ఇయ్యటం కాక, అందాల పోటీల మీద తమ అభిప్రాయాలను తాము అనుకొన్న పద్ధతిలో చెప్పటానికి వీలుగా జరపబడింది ఈ సదస్సు. ఇందులో 20 మంది అండర్ గ్రాడ్యుయేట్ స్థాయి విద్యార్థులు పాల్గొన్నారు. మధ్యతరగతి నేపథ్యం వాళ్ళది. ఇప్పుడిప్పుడే అభిప్రాయాలు ఏర్పరుచుకొంటున్న వయస్సు వాళ్ళది. వాళ్ళలో ఇద్దరు మాత్రం అందాల పోటీలను సమర్ధించారు. పురుషులతో సమానంగా స్త్రీలు కూడా వుండాలంటే నాలుగు గోడల నుండి బయటపడి ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనటమే మార్గమని, ఇన్నాళ్ళు ఈ పోటీలు జరుగుతూనే వున్నపుడు ఇప్పుడు నిరసించటమెందుకని, ఇది వదిలి మిగిలిన స్త్రీల సమస్యల మీద దృష్టి కేంద్రీకరిస్తే బాగుంటుందని, తమకు ప్రత్యేకంగా లభించిన అందాన్ని ప్రదర్శించుకొనే హక్కు స్త్రీలకు వుందని వాళ్ళు అభిప్రాయపడ్డారు. సమానత్వం గురించి, హక్కుల గురించి అరకొర అభిప్రాయాలు ఏర్పరిచే సినిమాలు, సాహిత్యం మొదలైన వాటి ప్రభావం ఇక్కడ పరిగణనలోకి తీసుకోవటం అవసరం. పోతే మిగిలిన పద్దెనిమిది మందిలో ముగ్గురు మాత్రం భారతీయ సంస్కృతికి ఇవి వ్యతిరేకం కనుక వద్దన్నారు. బాహ్య సౌందర్యం కంటే ఆత్మిక సౌందర్యం ముఖ్యమన్నారు.

మిగిలిన పదిహేను మంది అందాన్ని వ్యాపారపు సరుకుగా మార్చటాన్ని గుర్తించి, బహుళ జాతి సంస్థల ప్రయోజనాలను కాపాడే ఇలాంటి పోటీలకు ప్రభుత్వం మద్దతునివ్వటాన్ని నిరసిస్తూ మాట్లాడారు. పురుషులకు లేని అందాల పోటీలు స్త్రీలకెందుకు అని ప్రశ్నించారు. వ్యక్తి కృషితో సంబంధంలేని బాహ్యసౌందర్య ప్రాధాన్యాన్ని నిరాకరించారు. మూడవ ప్రపంచ దేశాల స్త్రీలను బహుళజాతి సంస్థల ఉత్పత్తుల అమ్మకాన్ని పెంచే సాధనాలుగా మార్చే అందాల పోటీలను ఏవగించుకొన్నారు. స్త్రీల మనోభావాలను కించపరచటమేకాక టూరిజం పేరిట స్త్రీలను వ్యభిచారులుగా చేసే ప్రమాదం వీటిలో వుందని ఆందోళనపడ్డారు. ఈ పోటీలలో పాల్గొనటం వలన స్త్రీకి లభించే స్వేచ్ఛ వట్టి బూటకమని తేల్చేసారు. మధ్య తరగతి వర్గం మీద అందాల పోటీ సంస్కృతి ప్రసరించే ప్రతికూల ప్రభావాన్ని గురించి హెచ్చరించారు. దేశం అభివృద్ధి అందాల పోటీల నిర్వహణ మీద ఆధారపడిలేదని, ఇందుకోసం ఖర్చు పెట్టే డబ్బుని సంక్షేమ పథకాలకు, ఉత్పత్తుల పెరుగుదలకు ఉపయోగించటం న్యాయమని స్పష్టం చేశారు.

'అందాల పోటీలు - విభిన్న దృక్పథాలు' అన్న అంశం మీద 1996 నవంబరు 23 నాడు జరిగిన ఆ సదస్సులో పాల్గొన్న వాళ్ళ అభిప్రాయాలను బట్టి చూస్తే మొత్తం మీద 90 శాతం మంది, అందాల పోటీలకు వ్యతిరేకతనే వ్యక్తం చేశారు. భారతీయ సంస్కృతికి వ్యతిరేకమని అందాల పోటీలను తిరస్కరించిన ముగ్గురిని కూడా మినహాయించినా అందాల పోటీలను వ్యతిరేకించిన వారి శాతం 75 శాతం అవుతుంది. ప్రపంచ సుందరి పోటీలకు 75 శాతం మంది అనుకూలతను సంపాదించి చూపిన గణాంక వివరాలను సమాంతరంగా ప్రపంచసుందరి పోటీలకు అదే 75 శాతం మంది వ్యతిరేకతను ప్రాతినిధ్యం వహించే ఈ గణాంక వివరాలను నిలబెట్టినప్పుడు ఒక విషయాన్ని గురించిన అవగాహనకు సంఖ్యాబలం కంటే దృక్పథం చాలా ముఖ్యమని స్పష్టమవుతుంది.

అందాల పోటీలను ఎందుకు వ్యతిరేకించాలో అర్థం కావాలంటే అందం నిర్వచించబడిన తీరు, దాని పరిమితి తెలియాలి. అసలు అందం అంటే ఏమిటి ? అందం అనే భావన ఎలా మారుతూ వచ్చింది? అది స్త్రీపరంగానే ఎందుకు నిర్వచించబడుతుంది ? అది పోటీ రూపాన్ని ఎప్పుడు తీసుకున్నది? ఎందుకు తీసుకొన్నది-అనేవి ఇప్పుడు మన ముందున్న ప్రశ్నలు.

అందం అంటే వెంటనే స్ఫురించేది బాహ్యరూపం. బాహ్యరూపమంటే కను ముక్కు తీరు, ఎత్తు, లావు, రంగు, సౌష్టవమైన అంగ నిర్మాణం. భౌగోళిక భిన్నత్వాన్ని బట్టి ఈ అందం ప్రాంతానికి ప్రాంతానికి, దేశానికి దేశానికి మారుతూ వుంటుంది. జాతిని బట్టి ఈ అంశాలు విభిన్నంగా వుంటాయి. అందుకే అందానికి విశ్వజనీన నిర్వచనం లేదు. అందం అసలు బయటి విషయం కా౦ ేకాదు. ప్రకృతితో మనిషికి ఏర్పడ్డ సంబంధక్రమంలో రూపొందిన భావన అది. ప్రకృతిలోని ఏ వనరులయితే తమ ఆకలి దప్పులు తీర్చాయో, వేటి మీదయితే తమ జీవిత సమస్తం ఆధారపడి వుందో వాటిని గూర్చిన ఆత్మీయభావ ప్రపంచం నుండి తొలి మానవులలో 'అందం' అనే భావన కదలాడి వుంటుంది. నింగీ, నేలా, కొండా, కోనా, చెట్టు, చేమా, గాలి, నీరు ఆ విధంగా అందానికి తొలి ప్రతీకలయినాయి. ప్రకృతితో తమకున్న సజీవ సంబంధ జీవితానుభవం నుండి మనిషి తనను తాను నిర్వచించుకొనే క్రమంలో పొందిన మానసికోద్వేగం నుండి 'అందం' ఒక నిర్దిష్ట భావనగా రూపొందటం మొదలైవుంటుంది.

ఆహారోత్పత్తి దశలో ప్రకృతికున్న ఉత్పత్తి శక్తి స్వభావం స్పష్టమవుతూవచ్చింది. దానితో అందానికి సంబంధించిన మానవ భావన క్రమంగా స్పష్టమైన రూపాన్ని తీసుకొని నిర్దిష్టమైన ఆకృతి రూపంలో ఆరాధనీయమైంది. సమస్త ప్రకృతి పూజనీయమైంది. ఆ ఒరవడిలోనే ఉత్పత్తి పునరుత్పత్తి సంబంధాలలో వుండే స్త్రీ పురుషుల యవ్వన సహజమైన ఆకర్షణ బలం, ఆరోగ్యం ప్రాతిపదికలుగా మానవజీవన సంబంధాలలోకి అందం అనే భావన ప్రవేశించి వుంటుంది. ఉత్పత్తి శక్తులు ఎదుగుతున్న క్రమంలో వచ్చిన మిగులు

వర్గాలను సృష్టించింది. ఈ వర్గాల ప్రాతిపదికగా ఏర్పడిన బానిస సమాజపు ప్రధాన లక్ష్యం మిగులు ఉత్పత్తిని పెంచుకొనటం, అందువల్లనే బలం ఆరోగ్యం ఆ సమాజంలో కూడా అందానికి ప్రతీకలయ్యాయి. ఉత్పత్తి సాధనాల మీద పురుషుడి అదుపు పెరిగేకొద్దీ – స్త్రీని ఉత్పత్తి ప్రక్రియ నుండి దూరం చేసి పునరుత్పత్తి విధులకే పరిమితం చేయటం జరిగింది. ఆ చారిత్రక ఘట్టంలోనే ప్రకృతితోను, స్త్రీ పురుషులిద్దరి జీవనంతోను ముడిపడి వున్న 'అందం' అనే భావన సహజ సంబంధాల నుండి విడదీయబడి పురుషుని దృష్టి కోణం నుండి స్త్రీ పరంగా కొత్త నిర్వచనాన్ని తీసుకొంది. ఉత్పత్తి నుండి విడదీయబడిన స్త్రీని బలంతో నిమిత్తం లేని అందంతో అంచనా వేయటం మొదలయింది. భూస్వామ్య వ్యవస్థ పితృ స్వామ్య నిర్మాణాలతో విస్తరిస్తూ అందాన్ని స్త్రీ పరంగానే చూచే భావజాలాన్ని విపరీతంగా పెంచింది.

ఋగ్వేద కాలంలో ప్రారంభమైన ఈ ప్రక్రియా పరిణామాలు మధ్య యుగాల సాహిత్యంలో ప్రతిఫలించి కనబడతాయి. ఋగ్వేదంలో శచీసూక్తం శత్రునాశకుడైన కొడుకును, సుందరి అయిన కూతురిని ప్రస్తావిస్తుంది. వీరత్వం, బలం మగవాళ్ళ లక్షణంగా, సౌందర్యం ఆడవాళ్ళ లక్షణంగా విడిపోవటం మొదలైంది అక్కడే. పురాణేతిహాసాల దగ్గరకు నడుము నాజూకు తనం – వచ్చే సరికి అందం స్త్రీ శరీర అంగాంగ సంబంధి అయింది. శరీర నిర్మాణం, ముఖ వర్చస్సు, వక్షోజ సౌందర్యం, కేశ సంపద, ఇవన్నీ స్త్రీ అందాన్ని నిర్వచించే అంశాలయ్యాయి. భాగవతం ఈ చట్రంలోనే రుక్మిణి సౌందర్యాన్ని వర్ణించింది. వర్ణనా ప్రధానమైన ప్రబంధాలు స్త్రీల అందాన్ని ఈ చట్రంలోనే చిలవలు పలువలు చేసి వర్ణించాయి. ప్రబంధయుగానికి పరాకాష్ట రూపం 'విజయ విలాసం'. మను వసుచరిత్రల మార్గాన్ని మరింత విస్తరించి కొనసాగిస్తూ కళ్ళు, ముక్కు, పలువరుస, పెదవులు, గోళ్ళు, చెక్కిళ్ళు, నుదురు, గడ్డం, పిక్కలు, తొడలు, పాదాలు అన్నీ సౌందర్య స్థానాలుగా పైన వైనాలుగా వర్ణించింది. స్త్రీలో అందమంటే శరీర నిర్మాణమే. అదీ పురుష భోగానుకూలమైన యవ్వన దశా విశేష లక్షణ యుక్తమైన శరీరమే అన్న భావం స్థిరపడింది.

అంతే కాదు పురుషుడిపై ఆధారపడి వుండటమే స్త్రీకి లక్షణంగా లక్ష్యంగా చేసి పితృస్వామిక సమాజం ఆమె అధీనత్వాన్ని పెంచి పోషించే అంశాలే 'అందం' అని నిర్వచించింది. పురుషుడిని ఆలంబనగా చేసుకొని పైకి వచ్చే లతలాంటిదని స్త్రీకి నాజూకుతనమే అందమన్నారు. కుటుంబాధికారాన్ని ప్రశ్నించని అణుకువే ఆడదానికి అందం అన్నారు. తనను తాను వ్యక్తీకరించుకోకుండా సిగ్గుపడటమే స్త్రీకి అందం అన్నారు. పునరుత్పత్తి విధులే కుటుంబ స్త్రీ లక్ష్యం కనుక మాతృత్వమే స్త్రీకి అందం అన్నారు. ఇట్లా పునరుత్పత్తి విధులకే పరిమితం చేయబడి కుటుంబ నిర్మాణచట్రంలో ఒదిగి, ఇంటి పనులతో సతమతమవుతూ భార్య స్థానంలో వున్న స్త్రీ అన్ని వేళలా అనుభవయోగ్యంగా వుండదు. అందువల్ల పురుషుడి భోగానికి వీలుగా కుటుంబ వ్యవస్థకు సమాంతరంగా వేశ్యా వ్యవస్థ ఏర్పడింది. కుటుంబ వ్యవస్థలో స్త్రీకి అణుకువ, సిగ్గు అందమైతే వేశ్యా వ్యవస్థలో స్త్రీ అందం సిగ్గు నుండి, అణుకువ నుండి వేరు చేసి నిర్వచించబడింది. ఆట నైపుణ్యం, పాట మాధుర్యం, మాట చాతుర్యం వేశ్యాస్త్రీకి అందమని చెప్పబడింది. కుటుంబ స్త్రీ అందంలో భాగం కాని అలంకరణకు వేశ్యా స్త్రీ జీవితంలో అనితర ప్రాధాన్యత లభించింది. వేశ్యా స్త్రీ అందం పురుషులకు ఆనందం కలిగించే ఉమ్మడి సొత్తయింది. ఈ అందమైన తెరచాటున గాయపడే వాళ్ళ మనశ్శరీరాల బాధ ఎవరికీ పట్టనిదే అయింది.

ఇట్లా కుటుంబం లోపల స్త్రీ అందానికి, కుటుంబం బయట స్త్రీ అందానికి ఒకే వ్యవస్థా చట్రంలో రెండు భిన్న నిర్వచనాలు ఉండటం ఒక వైరుధ్యం. అందానికి ఈ రెండు సందర్భాలలో ఇచ్చిన నిర్వచనాలు పూర్తిగా పరస్పర విరుద్ధంగా వున్నప్పటికీ, అవి ఏకకాలంలో పురుషుని ప్రయోజనాలను నెరవేర్చటానికే ఉద్దేశించబడ్డాయి. ఇది ఇందులోని అంతర్గత వైరుధ్యం. ఈ రకంగా విశ్రాంతి వర్గాలకు చెందిన పురుషుల ప్రయోజనాల దృష్ట్యా అందం నిర్వచించబడింది. అందానికియ్యబడిన నిర్వచనాలు, సందర్భానుసారం మారుతూ వస్తున్న నిర్వచనాలు – అన్నిటికీ పురుషుని అవసరమే గీటురాయి అయింది. విశ్రాంతి వర్గానికి చెందిన స్త్రీలు పితృస్వామ్య సమాజం అందానికిచ్చిన ఈ నిర్వచనంలోని సారాన్ని తమ జీవిత సహజాతంగా మలుచుకొని ఆ పరిధిలోనే తమ అందాన్ని పెంచి పోషించుకొనే పనిలో నిమగ్నం కావటానికి శిక్షణ చిన్నప్పటి నుండే ప్రారంభమవుతుంది. కనుక 'అందం' అనేది విలువల రాహిత్యంతో గాని, విలువల తటస్థతతోగాని సంబంధం వున్న అంశం కాదు. పాక్షిక విలువలతో, పక్షపాత వైఖరితో ముడిపడి వున్న భావన అది.

పురుషుని కోణం నుండి స్త్రీ పరంగా అందం ఈ విధంగా నిర్వచించబడిన చారిత్రక క్రమంలో అసంఖ్యాకంగా వున్న వేశ్యలనుండి 'అందం' నాట్య గాన కళా ప్రావీణ్యం కలిగిన స్త్రీని 'నగర వధువు'గా ఎంపిక చేసుకొనటానికి భూస్వామ్య రాచరిక వ్యవస్థల్లో పోటీ కార్యక్రమాలు నిర్వహించటం జరిగేది. రాజ నర్తకి పదవి ఈ పోటీల ద్వారానే సంక్రమించేది. రాజ్య నియంత్రణలో రాజ్యం తరపున సాంస్కృతిక రాయబారుల పాత్ర నిర్వహించే స్త్రీలు వీళ్ళు. అందాల పోటీలకు ప్రారంభం అక్కడే జరిగివుంటుంది. ఈ విధంగా భూస్వామ్య రాచరిక వ్యవస్థ స్త్రీ అందాన్ని ప్రాథమిక స్థాయి ప్రాంతీయ పోటీ వస్తువుగా చేసింది.

పెట్టుబడులు విస్తరిస్తూ ప్రపంచ మార్కెట్టు రూపొందుతున్న

నేపథ్యంలో ఇంతకు ముందుకంటే విస్తృత స్థాయిలో అందాన్ని నిర్వచించే ప్రయత్నం మొదలైంది. అందాన్ని గురించిన ఒక విశ్వజనీన భావనను రూపొందించి దానిని అంతర్జాతీయ విపణిలోకి ప్రవేశబెట్టే ప్రయత్నం కొనసాగుతున్నది. పోటీ ప్రధానంగా గల పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రారంభ దశలో వ్యయాన్ని కనిష్ఠం చేస్తూ ఉత్పత్తులను ఎలా గరిష్ఠం చేయాలన్నదే లక్ష్యం. ఈ దశలో స్త్రీలు కూడా బయటకు వచ్చి ఉత్పత్తి ప్రక్రియలో భాగస్వాములయ్యారు. అట్లా ఆనాడు కేవలం శ్రమ మాత్రమే అమ్మకపు సరుకయింది. ఇందులోని పోటీ ఉత్పత్తులను పెంచిందేకానీ కొనుగోలుశక్తిని, వినియోగ సామర్థ్యాన్ని పెంచలేకపోయింది. అందువల్ల ఏర్పడిన ప్రపంచ ఆర్థిక మాంద్యం రెండవ ప్రపంచ యుద్ధానికి దారితీసింది. పారిశ్రామిక దేశాల ఉత్పత్తి విధానం గుత్త పెట్టుబడిదారి రూపాన్ని సంతరించుకోగా వలసలు తృతీయ ప్రపంచ దేశాలుగా ఆవిర్భవించాయి. వీటిపై రాజకీయంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా అదుపు సంపాదించటం కోసం వివిధ అంతర్జాతీయ సంస్థలు ఏర్పడ్డాయి. ఐక్యరాజ్యసమితి, ప్రపంచ బ్యాంకు ఏర్పడిన సందర్భంలో భాగంగానే అందాల పోటీలు నిర్వహించటానికి ఒక అంతర్జాతీయ సంస్థను 1951 లో ఎరిక్ మోర్లే స్థాపించాడు. అంతర్జాతీయ పెట్టుబడిదారీ వర్గాన్ని, అంతర్జాతీయ కార్మిక వర్గాన్ని సృష్టించిన ఆధునిక రాజకీయార్థిక సందర్భం అంతర్జాతీయ అందాన్ని నిరూపించటానికి రంగం సిద్ధం చేసింది. దీనితో పురుష ప్రయోజనాలకు అనుగుణంగా స్త్రీ పరంగా నిర్వచించబడిన అందం పెట్టుబడి దారీ వ్యవస్థ ప్రయోజనాలకు అనుకూలంగా వ్యవస్థీకృత రూపం తీసుకొనటం మొదలయింది.

వస్త్ర పరిశ్రమలో వచ్చిన విప్లవాత్మకమైన పరిణామాల ఫలితమైన పారిశ్రామిక విప్లవం పెట్టుబడిదారీ వ్యవస్థకు వస్త్ర పరిశ్రమను కీలకమైందిగా చేసింది. పెరిగిన వస్త్ర ఉత్పత్తులను ప్రపంచవ్యాప్తంగా వినిమయం చేయగల మార్కెట్టును వెతుక్కొనే క్రమం మొదలయింది. వస్త్ర ఉత్పత్తులకు అనుబంధంగా దుస్తుల తయారీలో వచ్చిన మార్పులు కూడా మార్కెటు విస్తృతిని, స్థిరీకరణను ఒక అవసరంగా ముందుకు తీసుకువచ్చాయి. ఈ పరిణామాల ఫలితంగానే వస్త్రధారణలో మెళుకువలు నేర్పే మిషతో 'మిస్ వరల్డ్' పోటీలకు అంకురార్పణ జరిగింది. అందాన్ని స్త్రీల ప్రత్యేక లక్షణంగా చేసి ఆలంకరణ ద్వారా మరింత ఆకర్షవంతంగా దానిని ప్రదర్శించి పురుషుడిని ఆకట్టుకొనటం స్త్రీల ధర్మంగా నిర్ధారించిన పితృస్వామ్య సామాజిక విలువను పెట్టుబడిదారి వ్యవస్థ తన అభివృద్ధికి, ప్రయోజనాలకు అనుకూలంగా మలుచుకొన్నది. అందువల్లనే ఈ అందాల పోటీలకు సంబంధించిన అంశాలన్నింట్లో పితృ స్వామిక సంస్కృతీ సారమే ఆధునిక రూపంలో చోటు చేసుకొని కనిపిస్తుంది.

ప్రపంచ సుందరి పోటీ నిబంధనలను, పోటీలు జరిగే తీరును పరిశీలించి చూస్తే పితృస్వామిక రాజకీయాలలో భాగంగానే ఈ పోటీలు జరుతున్నాయని స్పష్టమవుతున్నది. పెళ్ళి కావలసిన ఆడ పిల్ల అర్హతలకు ప్రపంచసుందరి పోటీలో పాల్గొనే స్త్రీలకు నిర్దేశించిన నిబంధనలకు పెద్ద తేడా కనిపించదు. పెళ్ళి కావలిసిన పిల్లకు యవ్వనం ఒక ఆవశ్యకత అంశం. ప్రపంచ సుందరి పోటీలలో పాల్గొనే స్త్రీకి యవ్వనం ఒక ప్రధానమైన అర్హత. 18 నుండి 25 సంవత్సరాల మధ్య వయసు వాళ్ళే ఈ పోటీలో పాల్గొనాలి అనే నిబంధన దానినే సూచిస్తుంది. పెళ్ళికి ముహూర్తం పెట్టినట్లే ప్రపంచసుందరి ఎంపికకు ఒక ముహుర్తం – అర్ధరాత్రి 12 గంటలు వుంది. ఈ ముహూర్తం వేళ ప్రపంచసుందరి తలపై కిరీటం పెడతారు. కిరీటం భూస్వామ్య రాచరిక విలువలకు ప్రతీక. దీనిని పెట్టుమడిదారీ వ్యవస్థ వాడుకోవటం ఒక ప్రపంచ సుందరి పోటీలు ఫైనల్స్ కు చేరుకున్న దశలో పోటీలో పాల్గొనే ఆ స్త్రీలను సూటూ బూటూ వేసుకున్న యువకుడు చేయి పట్టి తీసుకువచ్చి వేదిక మీదకి వదిలేసి తాను నిష్క్రమిస్తాడు. ఆడవాళ్ళు తమంతటతాము నడవను కూడా లేని నాజూకు బొమ్మలు. వాళ్ళకు కావల్సింది పురుషుడి ఆలంబన అన్న పితృస్వామిక భావాన్ని ఈ సన్నివేశం ప్రతిఫలిస్తుంది. స్త్రీల జీవితాన్ని నాలుగు గోడలకు పరిమితం చేసి, ఇంటికి కుదించిన పితృస్వామిక సంస్కృతిలో పెళ్ళి చూపులు, పెళ్ళి మొదలైన ప్రత్యేక సందర్భాలలో ఎవరో ఒకరి ఆలంబన లేకుండా స్త్రీకి నడకే వుండదు. ఇదే సంస్కృతిని ప్రపంచసుందరి పోటీ కూడా ప్రతిబింబిస్తుంది.

ప్రపంచసుందరి పోటీలో కేవలం అందమే ప్రాతిపదిక కాదని దయా నిష్కల్మషత, నిండైన వ్యక్తిత్వం, ప్రతిభా పాటవాలు కూడా ప్రాముఖ్యం వహిస్తాయని అంటారు. నిజానికి 70 శాతం వ్యక్తిత్వానికి 30 శాతం మాత్రమే అందానికి ప్రాముఖ్యత వుందని చెప్పే ఈ పోటీలో నూటికి నూరుపాళ్ళు ప్రముఖంగా వుండేవి శరీర ప్రదర్శన దుస్తుల ప్రదర్శన, కేశాలంకరణ, నవ్వులు, నడకలు. స్త్రీ అందాన్ని అవయవాల సంబంధంలో నిర్వచించిన భూస్వామ్య పితృస్వామిక విలువలే ఇక్కడకూడా కొనసాగటం స్పష్టమవుతూనేవుంది. ప్రతిభా పాటవాల నిర్ధారణకు, వ్యక్తిత్వ నిరూపణకు వేసేది ఒకే ఒక్క ప్రశ్న. అది కూడా ఫైనల్స్‌కు చేరుకొన్న అయిదుగురికి మాత్రమే వేస్తారు. అవి కూడా వేరు వేరు ప్రశ్నలు. ఈసారి పోటీలలో పితృస్వామిక సంస్కృతిని స్థిరపరిచే సమాధానం చెప్పిన 'ఇరేనే సవే' అనే గ్రీకు యువతికి ప్రపంచసుందరి కిరీటం లభించటం గమనించవలసిన విషయం. వర్తమాన సమాజంలో స్త్రీ ఎప్పుడూ ఒక తల్లిగా, చెల్లిగా, భార్యగా, సహచరిగా, సలహాదారుగా వివిధ పాత్రలను సమసామర్థ్యంతో నిర్వహిస్తుందని చెప్పిన

సమాధానం ఆమెను ప్రపంచసుందరిగా నిలబెట్టింది. పితృస్వామిక సమాజం స్త్రీని నిర్దేశించిన మూస నమూనా పాత్రలను ఆమోదించిన స్త్రీని ప్రపంచసుందరిగా చేసిన ఈ సందర్భం దానినే ప్రపంచ సంస్కృతిగా ప్రచారంలోకి తెచ్చినట్లయింది. స్త్రీల లైంగికతను పితృస్వామ్యం నిర్వచించిన పద్ధతిలోనే యథాతథంగా స్వీకరించి ప్రపంచసుందరి పోటీలకు ప్రధానమైన నిబంధనగా చేసుకొన్న మిస్ వరల్డ్ లిమిటెడ్ సంస్థ ఇట్లా కాక మరొకరకమైన సంస్కృతిని ప్రచారం చేస్తుందనుకొనటం పెద్ద భ్రమ.

స్త్రీవాద ఉద్యమ భావజాలం స్త్రీల శరీరం మీద, లైంగికత మీద స్త్రీల హక్కును ప్రతిపాదించి ప్రచారం చేసింది. అయితే ప్రపంచ సుందరి పోటీలలో పాల్గొనే స్త్రీలకు కన్యాత్వం ఒక షరతు. విడాకులకు, పునర్వివాహానికి, వివాహంతో నిమిత్తం లేని స్త్రీపురుష సంబంధాలకు, సంతానానికి చట్టబద్ధతను, సామాజిక ఆమోదాన్ని సంతరించి పెట్టే భావ జాలం ఈనాడు బలం పుంజుకొంటున్నది. స్త్రీవాద ఉద్యమ నేపథ్యంలో అందాల పోటీలకు వీటిని అనర్హతలుగా ప్రకటించటం గమనించవచ్చు. పెట్టుబడిదారి వ్యవస్థ చట్రంలో పితృస్వామిక విలువల ప్రభావానికి, ఆధిక్యతకు వున్న ప్రాధాన్యాన్ని ఇది స్పష్టం చేస్తుంది.

సమాజాల అభివృద్ధి క్రమంలో స్త్రీలు తమ అభ్యుదయంకోసం సాధించుకున్న లైంగిక హక్కులను తిరస్కరిస్తున్న ఈ పోటీలు అదే సమయంలో ఆ హక్కులతో పాటే ఆవిర్భవించిన స్త్రీలకు తమ శరీరం మీద తమకు హక్కు - అన్న అంశాన్ని మాత్రం ఆమోదించటం ఒక వైరుధ్యం. స్త్రీలకు తమ శరీరం మీద తమకు హక్కు దానిని ప్రదర్శించటం వరకే. ఆ శరీరం ఏ కొలతల మధ్య ఒదిగి, ఏ విధంగా ప్రదర్శించబడాలో మాత్రం నిర్దేశించేది అందాల పోటీ వ్యవస్థే. ఈ శరీరాన్ని నిర్దేశిత విలువల ప్రకారం ప్రదర్శించటానికి చేయవలసిన అలంకరణ ఎంతో వుంటుంది. ఇదంతా వాళ్ళకు శ్రమకలిగించేది. శరీరాన్ని గాయ పరిచేది కూడా అయి వుంటుంది. ఈ నిర్దేశిత కొలతలను, శరీర సౌష్టవాన్ని పరిపోషించుకోవటానికి తగిన వ్యాయామం చేస్తూ, తిండిని నియంత్రించుకుంటూ, నిరంతర సౌందర్య స్పృహతో నిద్రాహారాలకు దూరం కావలసి వస్తుంది. గత సంవత్సరం ప్రపంచ సుందరిగా ఎన్నికైన మిస్ వెనిజులా తననడిగిన ఒక ప్రశ్నకు జవాబుగా హాయిగా తిని, సుఖంగా నిద్రపోతానని చెప్పిన విషయం ఇక్కడ గమనించవలసిన అంశం. శరీరాన్ని ప్రదర్శించే హక్కు, ఎన్ని నిర్బంధాల మధ్య, ఎన్ని నియంత్రణల మధ్య అమలవుతుంటుందో స్పష్టం చేసింది ఈ సంఘటన. తమ శరీరం మీద తమకు హక్కు అన్న సూత్రం ప్రాతిపదికగా అందాల పోటీలను స్త్రీవాదులలో ఒక వర్గం సమర్థిస్తుంది. కాని తమ శరీరాన్ని తమ అనుభవం కోసం ఆనందంకోసం కాకుండా ఇతరులకు కనువిందు చేయటం కోసం, వ్యాపార ప్రయోజనాలకు వస్తువుగా చేయటం, బహుళ జాతి సంస్థల నియంత్రణలో, పురుషుల అధికారం క్రింద ప్రదర్శించాల్సిరావటం స్త్రీకి తన శరీరం మీద హక్కు అనే భావనను అభావం చేస్తున్న స్థితినే సూచిస్తాయి.

ఈ అందాలపోటీ వ్యవస్థ స్త్రీ స్వేచ్ఛకు సంబంధించిన అంశాన్ని కూడా చర్చకు తెచ్చింది. పెట్టుబడి దారి వ్యవస్థకు పునాది అయిన వ్యక్తి స్వేచ్ఛ అందాల పోటీలలో పాల్గొనటం ద్వారా స్త్రీలకు కూడా లభ్యమవుతుంది అంటున్నారు. స్త్రీకి అందాల పోటీలలో పాల్గొనే స్వేచ్ఛ అభివృద్ధికరమైందని భావిస్తున్నారు. కాని ఇది వాస్తవంకాదు. పెట్టుబడిదారీ వ్యవస్థలో వ్యక్తి స్వేచ్ఛ వుందనుకోవటం ఎంత భ్రమో స్త్రీ స్వేచ్ఛ వుంటుందనుకోవటం కూడా అంతే భ్రమ, వ్యక్తి తన ఇష్టం వచ్చినప్పుడు, ఇష్టం అయిన చోట ఇష్టమైన పనిని యధేచ్ఛగా చేసుకోవచ్చంటారు. కానీ ఉత్పత్తి సాధనాలనుండి దూరమైన వ్యక్తులకు తమ ఇష్టంతో నిమిత్తం లేకుండా యజమాని ఇష్టం మేరకు, యజమాని నిర్దేశించిన పనిని, నిర్దేశించిన వేతనానికి చేయాల్సిన అవసరం ఏర్పడుతుంది. అదే విధంగా ఏ శరీరం తనదనుకొని తన ఇష్టం వచ్చినప్పుడు ఇష్టమైన రీతిలో ఆ శరీర సౌందర్యాన్ని ప్రదర్శించవచ్చునని ఈ పోటీలలో పాల్గొనే స్త్రీలు భావిస్తున్నారో ఆ శరీరమే తమనియంత్రణలో లేకుండా పోతున్న విషయాన్ని గుర్తించలేకపోతున్నారు. స్పాన్సర్ చేసిన సంస్థల నియమానుసారం తమ సౌందర్యాన్ని ప్రదర్శించాల్సి రావటం ఆ స్వేచ్ఛ ఎంత భ్రమాన్విత సత్యమో స్పష్టం చేస్తున్నాయి. ఐశ్వర్యారాయ్ ఒక కిలో బరువు పెరిగిందనీ, ఆ విషయంలో అప్రమత్తంగా వుండక పోయినట్లయితే టైటిల్ వాపస్ తీసుకుంటానని స్పాన్సరింగ్ సంస్థ బెదిరించటం ఇక్కడ గమనించాల్సిన విషయం.

అందాల పోటీ వ్యవస్థ చర్చకు తెచ్చిన మరొక అంశం సమానత్వం. దేశాల జాతుల భేదం లేకుండా స్త్రీలందరిని ఏక వేదిక మీదకు తెచ్చే అందాల పోటీలు సమానత్వ సంస్కృతిని పెంచి పోషిస్తాయని అనుకొంటారు. కానీ అది నిజం కాదు. అసలు అందాల పోటీల వేదిక మీదకు రావటానికి ముందు అందం సంపాదించటానికి పెట్టాల్సిన పెట్టుబడి చాలా పెద్దది. ప్రత్యేక ఆహారం, ప్రత్యేక శిక్షణ, ప్రత్యేకంగా కనిపింపచేసే అలంకరణ, దుస్తులు అన్నీ ఖర్చుతో కూడిన వ్యవహారాలే. శరీరం మెరుపు కోసం, చర్మ సంరక్షణ కోసం, కేశ సంరక్షణ కోసం, ఉపయోగించాల్సిన ద్రవ్యాలు, ద్రవాలు వేల రూపాయల ఖర్చుతో కొనుగోలు చేయాల్సినవి. మిస్ నైజీరియా తన కనురెప్పలను వెడల్పుగా కనిపింప చేయటానికి 48 రంగుల్ని అయిదు కుంచెల్నీ ఉపయోగిస్తానని చెప్పిన విషయం అందం సంపాదనకు పెట్టుబడి ఎంత స్థాయిలో వుంటుందో

సూచిస్తుంది. అందాల కుందనపు బొమ్మలు కావాలంటే స్త్రీలు కాసులు కుమ్మరించాల్సిందే. అందం అంటే 'డెకరేషన్' అయిపోయిన ఈ స్థితిలో స్త్రీలందరూ సమానంగా అందం కొనుక్కోగలిగిన వాళ్ళైనా అన్న ప్రశ్న ఉదయించక మానదు. పై వర్గాల స్త్రీలు మాత్రమే అందం కొనుక్కోగలిగిన స్థాయిలో వుండగా పెట్టుబడిదారీ వ్యవస్థలో వుండే బోలుతనాన్నంతా ప్రతిఫలించే ఈ అందాల పోటీ వ్యవస్థ మిరుమిట్లు గొలిపే తన ఆకర్షణ లక్షణం చేత, లాంఛనంగా అంగీకరించి ప్రచారంలోకి తెచ్చిన సమానతా సూత్ర లక్షణం చేత మధ్యతరగతి స్త్రీలను తనదైన భ్రమాన్విత సత్యంలోకి లాగుతుంది. అందమే జీవిత మనకుకొనేట్లు చేస్తుంది. అందాన్ని కొనుక్కొనేందుకు ప్రోత్సహిస్తుంది. అందుకోసమే వీధి వీధినా బ్యూటీ పార్లర్లు సృష్టిస్తుంది.

నూతన ఆర్థిక విధానాల ఫలితంగా కాస్మటిక్ పరిశ్రమలో వచ్చిన పరిణామాలు స్త్రీలను శాశ్వతమైన వినియోగదారులుగా చేసుకొనే క్రమంలో అందం గురించిన మోహ మాయాజాలాన్ని సృష్టించాయి. ఈ మోహ మాయాజాలం చివరికి స్త్రీలను కాస్మటిక్ శస్త్ర చికిత్సల ద్వారా శరీర నిర్మాణ చర్మకేశ సౌందర్యాలను పరిపోషించుకొనే కృత్రిమ జీవిత లాలసలోకి నెడుతుంది. పైవర్గాలలోకి చేరేందుకు తహతహలాడుతూ, గుర్తింపుకోసం తాపత్రయ పడే మనస్తత్వాన్ని మధ్యతరగతి మహిళలలో పెంచి పోషిస్తుంది. ఈ క్రమంలో అందం ఒక సమానతా ప్రాతిపదిక సూత్రమై ఉన్నత మధ్య తరగతి స్త్రీల మధ్య అగాధాన్ని పూడ్చేస్తుందన్న భ్రమను సృష్టిస్తూనే వాస్తవంలో వాళ్ళ మధ్య అంతరాలను మరింత పెంచుతుంది. ఎంత తాపత్రయపడ్డా ఏ నాటికి తాము అందాన్ని కొనుక్కొనే విషయంలో పై వర్గం స్త్రీలతో పోటీ పడలేక మధ్యతరగతి స్త్రీలు నిరాశా నిస్పృహలకు లోనవుతూ పక్కదారులు పట్టడమో, పలాయన వాదాన్ని ఆశ్రయించటమో జరుగుతుంది.

శ్రామిక స్త్రీలు ఎలాగూ ఈ రెండు వర్గాల స్త్రీలకంటే భిన్నంగా తమ నిత్య జీవన పోరాటాలలో తాము నిమగ్నమయ్యే వున్నారు. కనుక ఉన్నత మధ్య తరగతి శ్రామిక వర్గ స్త్రీల మధ్య వున్న వర్గ వైరుధ్యాలు కొనసాగి వస్తూనే వుంటాయి. అప్పుడు 'స్త్రీలుగా స్త్రీలంతా ఒకటే జాతి' – అనే స్త్రీవాద సూత్రం కూడా అందాల పోటీల వ్యవస్థలో అన్వయదశకు రాకుండానే పోతుంది.

23–11–96 నాటి 'వార్త' దిన పత్రికలో ప్రపంచసుందరి 96 పోటీలకు బెంగళూరు వచ్చిన వాళ్ళలో ఒక తెల్ల జాతి సుందరి, నల్లజాతి సుందరి కలిసి వున్న ఫోటోను ప్రచురించింది. ఆ ఫోటోకు 'తెలుపో నలుపో జానేదేవ్ – ఆ తేడాలిక్కడ లేనేలేవ్' – అన్న వ్యాఖ్యానాన్ని కూడా ఇచ్చింది. అందాన్ని కొనుక్కోగలిగిన వాళ్ళ సమానత్వాన్ని మాత్రమే చెబుతుందీ సందర్భం. ప్రపంచ వ్యాపితంగా అతి తీవ్రస్థాయిలో వున్న జాతి వివక్షలను, ఆర్థిక అసమానతలను కప్పిపుచ్చే సమానత్వమిది. ఈ పోటీలలో మూడవ ప్రపంచదేశాల స్త్రీలు, నల్లజాతి స్త్రీలు ప్రపంచ సుందరులుగా ఎన్నికయినా అభివృద్ధి చెందిన దేశాల సరసన తమ దేశాలను నిలపలేరు. దేశాల అభివృద్ధికి ప్రపంచసుందరి ఎంపికకు లేని సంబంధాన్ని ఊహించటం, అంతర్జాతీయ సమానతకు దానినొక ప్రతీకగా చెప్పటం–రెండూ కూడా సమానత్వానికి సంబంధించిన భ్రమల కల్పనలో భాగాలే. సారంలో ఇవి అగ్రదేశాలకు మూడవ ప్రపంచ దేశాలకు, శ్వేత వర్ణ జాతులకు, నల్ల జాతులకు మధ్య అధికార అధీన సంబంధాలను కొనసాగించటానికి, అభివృద్ధి చెందిన దేశాల ఆధిపత్యాన్ని స్థిరీకరించటానికి తోడ్పడతాయి. అందువలన అందాల పోటీలలో వుంటుందని చెప్పబడే స్త్రీ స్వేచ్ఛా సమానత్వాలు నేతి బీరకాయలో నెయ్యి వంటివే కాని మరొకటి కాదు. స్త్రీల లైంగిక హక్కులు, పునరుత్పత్తి స్వేచ్ఛా పూర్తిగా నిరాకరించబడిన స్థితిలో కృత్రిమ అలంకరణలతోటి, అతికించుకొన్న నవ్వులతోటి స్త్రీలను నిలబెట్టే ప్రపంచసుందరి పోటీలు సారంలో స్త్రీ స్వేచ్ఛకు పూర్తిగా వ్యతిరేకమైనవి.

పెట్టుబడిదారీ వ్యవస్థ స్థిరీకరణ పొందుతూ విస్తరించిన క్రమంలో స్థానిక మార్కెట్టు కుంచించుకుపోతే మార్కెట్ విస్తరణకు వలసలను అభివృద్ధి చేయాల్సి వచ్చింది. తూర్పు ఇండియా కంపెనీ తన పెట్టుబడులతో మార్కెటును వెతుక్కుంటూ భారతదేశానికి వచ్చిన క్రమం అలాంటిదే. అది భారతదేశాన్ని వలస దేశంగా మార్చింది. 1857లో భారతదేశం బ్రిటిష్ ఇండియాగా మారటంతో తదితర కంపెనీలకు కూడా భారతదేశానికి పెట్టుబడులు తరలించే అవకాశం దొరికింది. వలసల విస్తరణ వలన ప్రపంచమంతటా ఇటువంటి పరిణామాలే సంభవించాయి. జాతి పోరాటాలు వలస విముక్తి పోరాటాలుగా సాగి దేశాలు స్వతంత్రమైన తరువాత కూడా బ్రిటన్, అమెరికా వంటి అగ్రరాజ్యాలు తమతమ పెట్టుబడులను ఆయా దేశాలలోని పరిశ్రమలలో పెట్టి వెళ్ళాయి. ఏదో ఒక విదేశీ కంపెనీ పెట్టే పెట్టుబడి గానీ, ఏ రెండు మూడు విదేశీ కంపెనీలయినా కలిసి పెట్టే పెట్టుబడిగానీ బహుళ జాతి సంస్థల పెట్టుబడి అవుతుంది. తమ తమ పెట్టుబడుల నిష్పత్తుల మేరకు ఆయా దేశాలనుండి మిగులు విలువలు బహుళజాతి సంస్థలకు తరలించబడతాయి. తమ పెట్టుబడి ద్వారా దేశీయ పరిశ్రమల మీద నియంత్రణను, మిగులు విలువలో వాటా ద్వారా దేశీయ సంపద మీద హక్కును బహుళజాతి సంస్థలు కలిగి వుంటాయి. బహుళజాతి సంస్థలు తమ ఉత్పత్తులకు సమాజంలోని భిన్న వర్గాల నుండి వినియోగదారులను సమకూర్చుకొనటానికి, తాము ఉత్పత్తి చేస్తున్న వస్తు వినిమయానికి, అనుకూలంగా ప్రజల అభిరుచులను మలచటానికి ప్రచార ప్రకటనా మాధ్యమాన్ని అభివృద్ధి చేశాయి. వస్తువుల గురించి వాటి

ఉపయోగ ప్రయోజనా విలువల గురించి చెప్పటానికి కావలసిన మోడల్స్ ను తయారు చేయటానికి అందాల పోటీ వ్యవస్థను ఆవిష్కరించాయి. అందువలన అందాల పోటీలలో ఎంపిక అయ్యే స్త్రీల మీద నియంత్రణాధికారం బహుళ జాతి సంస్థలదే అవుతున్నది.

భూస్వామ్య వ్యవస్థలో స్త్రీని నియంత్రించేది, పురుష ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించేది వివాహ వ్యవస్థ అయితే పెట్టుబడిదారీ వ్యవస్థలో కూడా పురుష ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించేది బహుళజాతి సంస్థలు. భూస్వామ్య వ్యవస్థలో స్త్రీల నడకను, నడతను కట్టు బొట్టు తీరును ఎవరితో ఎప్పుడు ఎట్లా ప్రవర్తించాలి అన్న అంశాలన్నింటినీ నియంత్రించేది భర్త, కుటుంబం అయితే ఈ పోటీలలో గెలిచిన స్త్రీలు ఏం తినాలి. ఎలా వుండాలి, ఎలా నవ్వాలి, తన అంగ సౌందర్యం వ్యక్తమయ్యే రీతిలో ఎలా నడవాలి, ఏ సంస్థతో మోడలింగ్‌కు ఒప్పందం కుదుర్చుకోవాలి అనే అంశాలన్నీ నియంత్రించే అధికారం పోటీలను స్పాన్సర్ చేసిన బహుళ జాతి సంస్థలదే. పెళ్ళితో స్త్రీ భర్తకు జీవిత కాలపు బందీ అవుతుంది. అదే విధంగా ప్రపంచసుందరిగా ఎంపికయిన స్త్రీ బహుళజాతి సంస్థల చేతిలో బందీ అవుతుంది. ఫ్యూడల్ వ్యవస్థలో పురుషుడి ఆస్తిగా వున్న స్త్రీ పెట్టుబడి దారీ వ్యవస్థలో గుత్తపెట్టుబడి సంస్థల అదుపు క్రింద ప్రపంచపు ఆస్తయింది.

స్త్రీకి తన శరీరం గురించి, సౌందర్యం గురించి నిర్వచించుకొనే హక్కు, అవకాశం భూస్వామ్యపు వ్యవస్థలో లేనట్లుగానే పెట్టుబడిదారీ వ్యవస్థలో కూడా లేదు. బహుళ జాతి సంస్థల వ్యాపార ప్రయోజనానికి అనుకూలంగా పితృస్వామిక సమాజం ఇచ్చిన నిర్వచన పరిధిలోనిదే అయింది స్త్రీ సౌందర్యం. బహుళజాతి సంస్థలు ఉత్పత్తి చేసే కాస్మటిక్స్, ఫ్యాషన్ టెక్నాలజీని వినియోగంలోకి తీసుకు రాగల అందమే స్త్రీల అందంగా నిర్వచించబడింది. ఇదే స్త్రీల నిజమైన అందమని స్త్రీలు భ్రమపడి ఆ నిర్వచన పరిధిలోని అందానికి సంబంధించిన ప్రమాణాలను తామందుకొనటానికి నిరంతరం ఆరాట పడుతూ తమనుతాము తమకు తెలియకుండానే ఈ వ్యవస్థకు బానిసలను చేసుకుంటారు. అందుకే అక్కడ గృహబానిస అయిన స్త్రీ ఇక్కడ ప్రపంచ బానిస అయింది.

అందం శక్తికి మూలమని, తద్వారా మొత్తం ప్రపంచాన్ని నియంత్రించవచ్చని ఒక భావం వుంది. అందాలపోటీల నిర్వహణలో కీలక పాత్ర వహించే అంశం అదే. ప్రపంచ మార్కెట్ మొత్తాన్ని గుప్పిట్లోకి తీస్కుకొనటానికి స్త్రీ అందంలోని శక్తి ఒక మూల వనరు అయింది. ఫ్యూడల్ వ్యవస్థలో పురుషుడి జీవితానందానికి ముఖ్యాంశాలుగా కీర్తి, కాంత, కనకాలు పేర్కొనబడ్డాయి. ఆ మూడింటిని పురుషులు విడివిడిగానే సాధించుకొని తద్వారా సమగ్ర జీవితాన్ని అనుభవించాలి. కాని పెట్టుబడిదారీ వ్యవస్థలో అందాల పోటీ ద్వారా కాంత మీద సంపాదించే అదుపు కనకాన్ని స్వంతం చేసుకొనటానికి ఉపకరిస్తుంది. కీర్తి అంటే ఇక కాంత ద్వారా వస్తువుకు సంపాదించే ప్రచారమే. ఈ క్రమంలో స్త్రీ అందం లాభాల నార్జించి పెట్టే వస్తువయింది. శ్రామికుల శ్రమతో పాటు స్త్రీ అందం కూడా వస్తువుకు అదనపు విలువను సంపాదించి పెడుతుంది. ఆ అదనపు విలువ శ్రామికులకు చెందనట్లుగానే స్త్రీలకూ చెందదు. ఈ క్రమంలో శ్రమ పరాయీకరణకు శ్రామికులు గురయినట్లుగానే అందం నుండి స్త్రీలు పరాయీకరణకు గురవుతారు. సరుకుల్లో సరుకై తమకు తామె కరువవుతారు.

ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరిగే అందాల పోటీలలో స్త్రీలను ఆయా ప్రాంతాలకు ప్రాతినిధ్యం వహించే వస్తువులుగా చూస్తారు తప్ప ప్రత్యేకమైన పేరున్న మనిషిగా గుర్తించరు. మిస్ హైద్రాబాద్, మిస్ ఆంధ్రా, మిస్ ఇండియా, మిస్ గ్రీస్ ఈ రకంగా వాళ్ళు సుందరులుగా ఎంపికయిన సంవత్సరంతో కలిపి చెప్పబడుతుంటారు. ఇల్లలుకుతూ పేరు మరిచిపోయిన ఈగ చందంగా ఇంటి చాకిరిలో నిమగ్నులైన స్త్రీలు తమ పేరును ఉనికిని మరిచిపోయి గృహిణులుగా మాత్రమే మిగిలిపోతున్నారు. అదే విధంగా తమ శరీరాన్ని సాధనంగా చేసుకొని బహుళ జాతి సంస్థల ఉత్పత్తులకు ప్రచారం కల్పిస్తున్న సుందరీమణులు కూడా తమ పేరు నుండి ఉనికి నుండి పరాయీకరింపబడుతున్నారు.

ఇకపోతే ఈ పోటీలలో పాల్గొనటంద్వారా సాంఘిక, ఆర్థిక హోదాను పొందుతామని, సామాజిక శక్తిగా రూపొందుతామని, అటువంటప్పుడు తాము అందాల పోటీలలో పాల్గొన టానికి ఎవరికి మాత్రం ఎందుకు అభ్యంతరం వుండాలని ఈ పోటీలలో పాల్గొనే వాళ్ళు అంటున్నారు. కానీ నిజానికి ఈ పేరుమీద స్త్రీల అందం సులభమార్గాన డబ్బు సంపాదనా సాధనమవుతున్నది. తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ రకమైన పోటీలలో పాల్గొనటానికి ప్రోత్సహించటం వెనుకవున్నది కూడా డబ్బు సృష్టించిన మాయాజాలమే. ఈ విధంగా స్త్రీల అందాన్ని సాధనంగా చేసుకొని భౌతిక అవసరాలు తీర్చుకొనటానికి, వస్తుజాలాన్ని సమకూర్చుకొనటానికి జరిగే ఈ ప్రయత్నక్రమం వస్తుజాలం యొక్క శక్తిని, పెత్తనాన్ని తీవ్రతరం చేస్తుంది. వస్తు వినిమయం కోసం స్త్రీల అందం వాడుకోబడుతున్నదా ? లేదా తమ అందం ద్వారా స్త్రీలు వస్తువులు సమకూర్చుకొంటున్నారా ? వస్తువులకోసం అందమా, అందంవల్ల వస్తు సమీకరణా ? వీటిలో ఏది ముందో, ఏది వెనుకో తెలియనంతగా విషవలయాన్ని సృష్టించిందీ పెట్టుబడిదారీ వ్యవస్థ. ఈ విషవలయంలో చిక్కుకొని, ఇందులో భాగంగానే వుంటూ ఇదే తమ ప్రగతికి గీటురాయని

అనుకొంటూ స్త్రీలు అవమానాల అణిచివేతల చరిత్రను మరిచిపోవటానికి ప్రయత్నిస్తున్నారు.

అందాల పోటీలలో పాల్గొని ప్రపంచసుందరిగా ఎంపికయి, ప్రాముఖ్యత గల వ్యక్తులుగా గుర్తింపును పొంది, గుర్తింపుకు తగ్గ హోదాను అనుభవిస్తూ అంతులేని డబ్బు సంపాదించే స్త్రీలు అణచివేతకు అవమానాలకు గురవుతారంటే చాలామంది నమ్మకపోవచ్చు. కానీ వాస్తవంలో సరుకుల నమ్మేక్రమంలో తానొక లైంగిక ప్రతీక అయిన స్త్రీ అణచివేతకు గురయిందంటే అందులో అసహజాంశం ఏమీలేదు. మిస్ మనీలా ప్రపంచ పర్యటన జరిపిన తరువాత తన అనుభవాలను వ్రాస్తూ Daizi World of Travel & Excitementలో ప్రపంచ సుందరికి చివరకు మిగిలేది చిరాకు అణిచివేత అవమానాలు అని స్పష్టంగా పేర్కొన్నది. అందాల పోటీలలో పాల్గొనే మహిళలు అణచివేతకు గురవుతారని ఈ పోటీలను వ్యతిరేకించే ఆందోళనకారులు భావించటం వారి అవగాహనాలోపానికి నిదర్శమని మిస్ ఇండియా 1996 రాణి జేరాజ్ అనటం (నవంబర్ 20, 1996, ఈనాడు) ఎంత అసంబద్ధమైందో మిస్ మనీలా అనుభవం చెప్పకనే చెబుతుంది.

మిస్ వరల్డ్ పోటీలకు అనుబంధమైన మాట 'బ్యూటీ విత్ ఎ పర్పస్'. సామాజిక మంచికోసం. ప్రపంచమంతటా చేపట్టే బృహత్ కార్యక్రమాలకు వేలకొలది యు ఎస్ డాలర్ల నిధుల సమీకరణ జరుగుతుంటుంది. సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణ ఆదర్శమే అందం కానీ, అందం తో దానికి పనేమిటో అర్థం కాదు. అందాల పోటీలు వ్యాపార ప్రయోజనాలకు కావు సామాజిక సేవా దృక్పథ ప్రచారానికి అని మన్నించే ప్రయత్నమా ఇది ? 'రెవలాన్' విప్లవాత్మకమైన ముఖాలంకరణ సౌందర్య ద్రవ్యాలను ఉత్పత్తి చేసే సంస్థ. ఆ ముఖాలంకరణ సౌందర్య సాధనాలకు ప్రచారం చేసే మోడల్ మెహర్ భాసిన్–'రెవలాన్ అమ్మాయి'గా ప్రసిద్ధురాలు. అందం వ్యక్తికి ఆత్మ విశ్వాసాన్ని కలిగిస్తుందని, వ్యక్తి వికాసానికి తోడ్పడుతుందని అంతకంటే కాస్త ఎక్కువగా ఒకళ్ళు మిగిలిన అందరికంటే భిన్నంగా ప్రత్యేకంగా ఎదగటానికి దోహదపడుతుందని అంటుంది. అందం వ్యక్తి ప్రత్యేకతను నిలుపుతుంది. నిజమే. కాని వ్యక్తి ప్రత్యేకత ప్రజాస్వామ్య విరుద్ధం. వ్యక్తి తన సృజనాత్మక ప్రతిభతోగాని, భావుకత్వ లక్షణం చేత గాని ప్రయత్నంతో సాధించగలిగింది కాదు అందం, అయితే అది ఆజన్మ సిద్ధం. కాకపోతే పోషణ ద్వారా మేకప్ ద్వారా పొందేది. మొదటి పద్ధతిలో అందం పొందటం ఎవరి చేతిలోనూ వున్నది కాదు. రెండవరకం అందం పొందటానికి అది చాలా ఖరీదయింది కనుక అందరికీ అవకాశాలుండవు. ఇటువంటి అందానికి ప్రాధాన్యత ఇయ్యటం ఆధునిక ప్రజాస్వామ్య సంస్కృతికి విరుద్ధం, అందానికి ఇంత గుర్తింపు, ప్రాధాన్యం వున్నాయంటే దానికి అవతలివైపున అందవిహీనం ఒక సమస్య అయి తీరుతుంది. ఈ సమస్య గురించి 1940ల నుండి తీవ్రంగా ఆలోచించి రకరకాలుగా తన కథలల్లో, నవలల్లో చర్చించిన రచయిత కొడవటిగంటి కుటుంబరావు. సాంఘిక పరిణామం యొక్క తొలి దశలలో ఈ సమస్య ఒక్కొక్క దశే గడిచిన కొద్ది వ్యక్తిగతమైన సమస్యగా రూపొంది పదునెక్కుతున్నదని, భూర్జువా సంస్కృతిలోనే అది ఒక సమస్యగా పైకి తేలిందని 'కురూపి' నవలకు వ్రాసిన ఉపోద్ఘాతంలో చెప్పాడు కొడవటిగంటి కుటుంబరావు. సామాజిక జీవితం భౌతికంగా సుప్రతిష్ఠితమయ్యే కొద్దీ మానవుడి ఆధ్యాత్మికశక్తులు పెరిగి తీరుతాయని, మనిషి నుంచి మనిషి పొందే లక్షలాది అనుభూతులలో అందం ఇచ్చే అనుభూతి ఒకటి మాత్రమేనని అంతకంటే గాఢమైన అనుభూతులు చాలా వుంటాయని ఆయన స్పష్టం చేశాడు. ఆలోచనలో, ఆచరణలో అనాకారితనాన్ని మించిన దౌర్భాగ్యం లేదని, ఆలోచన, ఆచరణ సహజమైన మానవీయ స్వభావంతో వ్యక్తీకరించబడటమే అందం అని ఆయన సాహిత్యం చెప్తుంది.

అయితే 21 శతాబ్దంలోకి అడుగు పెడుతున్న ఈ భారతీయ సమాజం భౌతికంగా ఇంకా సుప్రతిష్ఠితం కాలేదా అని అనుమానించే పరిస్థితులు ఈనాడున్నాయి. మనిషి నుంచి మనిషి పొందగల మిగిలిన సమస్త అనుభూతుల విషయం విస్మరించి స్త్రీ నుండి అందం ఒక్కటే కీలకాంశంగా అనుభూతిని పొందే ప్రయత్నం చేయటం జరుగుతున్నది. ఇక్కడ స్త్రీ అనుభూతితో అసలు ప్రమేయమే లేదు. స్త్రీ పురుషుల మధ్య వున్న అసమానతలు సమానతాభావాన్ని పెంచుకొనటానికి అవరోధంగా వున్న పితృస్వామిక అధికార అహంకార అహంభావాల అడ్డుగోడలు స్త్రీ పురుషులను అనుభవాలు అనుభూతులును సమస్థాయిలో పంచుకోగలిగిన స్థితిలో వుంచలేదు. పురుషుడు మాత్రమే అనుభూతిని పొందగల మానవ జీవి. స్త్రీ పురుషుడి అనుభూతికి ఆధారం ఈ నాడు సమాజంలో వున్న ఈ విలువే అందాల పోటీల వ్యవస్థను సృష్టించింది. వస్తువిలువను ప్రచారం చేయగల అనుభూతిని కలిగించే అంశంగా స్త్రీ అందాన్ని మిగిల్చింది.

స్త్రీ పురుషుల మధ్య వున్న మిగిలిన అనేకానేక వివక్షతలు అభావం అయ్యేకొలదీ అందానికి వున్న విలువ కూడా క్రమంగా తగ్గిపోతుంది. అందాన్ని మించి మానవీయ సంబంధాల అనుబంధాల భావనలు బలపడతాయి. ఇప్పటికీ తల్లి అందం గురించి ఆలోచనే పిల్లలో రాకపోవటం గమనించవచ్చు. సహజ మానవ సంబంధాలలోని మానవీయ చైతన్య సౌందర్యం తల్లి **(మిగతా 53వ పేజీలో)**

# అందాల పోటీలు అనేక సవాళ్లు

- ఎ.సునీత

హైదరాబాద్‌లో జరుగుతున్న మిస్ వరల్డ్ పోటీలు, అధికారుల్లో అత్యుత్సాహాన్ని, ఆలోచనాపరుల్లో కొంత కలవరాన్ని కలిగిస్తున్నాయి. ఈ పోటీలకు పెద్ద ఖర్చు పెట్టడం లేదనీ, పైగా దీని ద్వారా తెలంగాణాలో టూరిజం పెరుగుతుందని ప్రభుత్వం అంటోంది. డబ్బు తక్కువైన రాష్ట్ర ప్రభుత్వాలు విదేశీ పెట్టుబడులని ఆహ్వానించటానికి పడే తంటాల్లో ఇదీ ఒకటని అర్థం చేసుకుందాం అనుకున్నా, అంతకుమించి గత ప్రభుత్వం చేయలేనిది తామేదో కొత్తది చేసి, తామెంత గొప్ప వాళ్ళమో నిరూపించుకోవాలన్న కోరికే ఇక్కడ ఎక్కువ కనిపిస్తోంది. మిస్ వరల్డ్ నిర్వాహకులు దీనివల్ల ఆడవాళ్ళలో 'స్ఫూర్తి' పెరుగుతుందని ప్రకటించారు. కానీ, ఈ కార్యక్రమం ప్రధానంగా మగవాళ్ళలోనే ఎక్కువ స్ఫూర్తిని నింపుతోందని మీడియా రిపోర్టులు చూస్తే తెలుస్తుంది.

దక్షిణాది రాష్ట్రాల్లో మానవ అభివృద్ధి సూచికలో, ముఖ్యంగా చదువు, ఆరోగ్యంలో వెనకబడి, అన్ని రకాల హింసనీ ఎక్కువగా ఎదుర్కొంటున్న సాధారణ తెలంగాణ మహిళలకి, రాజకీయాలు, ఉద్యోగాలు, పరిశ్రమల్లో వాటా లేనట్లే ఈ ప్రపంచ సుందరి పోటీలని టీవీలలో చూడటం తప్ప ఏమీ దొరకదు. వాళ్ళకేమీ సౌందర్య పిపాస తక్కువ లేదు. ఉన్నంతలో మంచిగా తయారవుతారు. చీరల రంగులు, జాకెట్ల డిజైన్లు, మ్యాచింగ్ నగల విషయంలో అన్ని సమూహాల స్త్రీలకీ, తమ స్థోమతని బట్టి కావాల్సినంత ఆసక్తి ఉంది. అదే లేకుంటే ఇన్ని రకాల దుకాణాలు, ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్లు, గల్లీ చివర మగ్గం వర్క్ షాపులు పెరిగేవి కాదు. ఈ గల్లీ ఫ్యాషన్ ప్రపంచంలో భర్తలు, మగవాళ్ల కంటే, తోటి ఆడవాళ్ళ ప్రశంసలే ప్రధానం.

తెలుగు సినిమాలు ఆడవాళ్లకి ఉండాల్సిన ప్రధాన గుణం అందం అనీ, వాళ్ళు కేవలం మగవాళ్ళ కోసమే అందంగా తయారవుతారనీ దశాబ్దాలుగా అందర్నీ నమ్మించటానికి ప్రయత్నిస్తున్నాయి. 20వ శతాబ్దం మధ్యలో చదువులు, ఉద్యోగాల కోసం పరదా నుంచి బయటకొచ్చిన ఆధిపత్య కుల స్త్రీలకి ఆధునిక సంస్కృతి తొడిగిన కొత్త పరదాల్లో ఒకటి అందం. చీర, దాన్నుండి కనీ కనిపించకుండా అతి సన్నటి నడుము, పెద్ద జడ, బొట్టు ఉండే స్త్రీ శరీర రూపాన్ని తెలుగు సౌందర్యానికి ప్రతీకగా చేసిన బాపు బొమ్మ కొన్ని తరాల ఊహల్ని నిర్దేశించింది. ఓల్గా రాజకీయ కథలు, స్త్రీవాద కవిత్వం స్త్రీల జీవితాలని ఇటువంటి ఊహలు ఎంత బలంగా నియంత్రిస్తాయో వివరంగా విశ్లేషించినప్పటికీ, వాటి ప్రభావం చదువుకుని ఆలోచించే ప్రజలకే పరిమితమైంది. తెలుగు సినిమాల్లో హీరోయిన్ల పాత్రలు, కొద్ది మినహాయింపులతో, స్త్రీలు అందం అనే మూసలోనే బందీగా ఉండిపోయాయి. హీరోయిన్ల శరీర కొలతల గురించి బహిరంగంగా మాట్లాడటం, 'మిల్కీ బ్యూటీ', 'అందాలు ఆరబోయటం', 'నడిచొచ్చిన అందం' అంటూ వర్ణించటం ఇప్పటికీ తెలుగు సినిమా పరిశ్రమ రోజువారీ పదజాలంతో భాగం.

ఇలా ఆడవాళ్ళని అందమైన శరీరాలుగా మాత్రమే చూసే భావన 1990లో జరిగిన ప్రపంచీకరణ తర్వాత వస్తు ప్రధాన సంస్కృతిలో బాగా ఊపందుకుంది. 1990లలోనే సుస్మితా సేన్, ఐశ్వర్యరాయ్ ప్రపంచ సుందరీమణులు అయ్యారు. గత ఇరవయ్యేళ్ళల్లో వస్తువుల ఉత్పత్తితోపాటు వాటిని అమ్ముకోవటానికి స్త్రీల అందం ఒక ప్రధాన వనరుగా మారింది. ఈ సంస్కృతిలో అందమనే భావన కూడా రూపాంతరం చెందింది. అప్పటి వరకూ పుట్టుకతో వచ్చిన శరీర సౌందర్యం కొంత మంది ఆడవాళ్ళకి పెళ్లి కోసం పనికొచ్చేది. అందాన్ని ఆడవాళ్ళందరికీ తప్పకుండా ఉండాల్సిన గుణాల్లో ఒకటిగా మార్చింది మార్కెట్. అందానికి ఒక కొత్త మూసని తయారు చేసింది. శరీరంపై ఒక్క వెంట్రుక లేకుండా, గీసిన కనుబొమలు, నల్లటి జుట్టు, సన్న ముక్కు, తెల్లటి చర్మం, ఎర్రని పెదవులు కలిగి ఉండటం దీనిలో భాగం. అత్యధిక శాతం భారతీయ స్త్రీలు దీనిలో ఇమడరు. చక్కగా కనిపించాలనే వారి సహజమైన కోరికని మార్కెట్ సంస్కృతి వాళ్ళ బలహీనతగా రూపుదిద్దింది. మా ఉత్పత్తులు వాడితే మీరు అందంగా తయారవుతారు అంటూ ఊదరగొట్టింది. అంతే కాదు, అందంగా ఉంటేనే సంతోషం, ఉద్యోగం, కెరీర్ అన్నీ సాధ్యమవుతాయనే సరికొత్త సక్సెస్ నమూనాని సమాజంలో ప్రవేశపెట్టింది. ఈ క్రమంలో అందాల పోటీలు ప్రపంచస్థాయి నుండి సాధారణ కాలేజీ ఫెస్టివల్‌లో భాగంగా మారితే చర్మ సౌందర్య ఉత్పత్తులు, మేకప్ సామాగ్రి అనేక మంది విద్యార్థులు, ఉద్యోగినుల నెలవారీ సామాన్లలో భాగమయ్యాయి. తెల్ల జుట్టు ఉండే ఆడవాళ్లు సినిమాలు, సీరియళ్లలోనే కాదు, నిజ జీవితంలో కూడా కనిపించటం మానేశారు. మార్కెట్ సంస్కృతిని తీవ్రంగా విమర్శించే వాళ్ళు దీని నుంచి బయట

పడలేనంత లోతుగా ఈ సౌందర్య భావజాల ప్రభావం వ్యాపించింది. ఈ నిర్దేశిత సౌందర్య నమూనా నుండి పక్కకి జరిగితే చాలు, దాన్నొక జీవిత వైఫల్యంగా చూడటం మొదలైంది.

అయితే, సౌందర్య భావజాలం కేవలం శరీరం బయట ఆగిపోదు, లోపలికి ఇంకుతుంది. అది ఆడవాళ్ల ఆంతరంగిక చూపులో భాగంగా మారి, వాళ్ళు తమని తాము అంచనా వేసుకునే తీరునీ, ఆత్మ విశ్వాసాన్నీ ప్రభావితం చేస్తుంది. ఈ ప్రభావం టీనేజీ అమ్మాయిలు, యువతులలో తీవ్రంగా కనిపిస్తుంది. ఈ సౌందర్య మూసల్లో ఇమడటానికి అమ్మాయిలు తిండి మానెయ్యటంతో వారిలో అనేక శారీరక రుగ్మతలు పెరుగుతున్నాయి. ఇంటర్నెట్ పుణ్యమాని నగరాలకి పరిమితమైన ఈ రుగ్మతలు అన్నిచోట్లకీ పాకాయి. ముప్పై ఏళ్ల ప్రపంచీకరణ తర్వాత, బ్యూటీ పార్లర్లు ప్రతి గల్లీలో పుట్టుకొచ్చి, అనేకమంది యువతుల జీవితాల్లో సౌందర్య ఉత్పత్తులు భాగమైపోయి, అందం పరిశ్రమగా మారిపోయిన తర్వాత తెలంగాణ ప్రభుత్వం ఈ పోటీలని నిర్వహించి కొత్తగా ఏం సాధించాలని అనుకుంటోంది? దీనితోపాటు ఒక సమాజంగా మనం ఇప్పుడు వేరే ప్రశ్నలు అడగాలి. ఫ్యాషన్ పరిశ్రమలోకి వెళ్లే ఆడవాళ్ళని మినహాయిస్తే, ఈ అందం నమూనాలలో ఇమడలేని అత్యధిక శాతం అమ్మాయిల మానసిక సంఘర్షణ గురించి మన వ్యవస్థలో అసలేమైనా అవగాహన ఉందా? ప్రభుత్వం గానీ, ఇతర విద్యా సంస్థలు గానీ దీని గురించి అధ్యయనాలు చేశాయా? చదువు, ఉద్యోగాలతో వచ్చే ఆత్మవిశ్వాసాన్ని ఈ సౌందర్య నమూనాలు ఏ విధంగా దెబ్బతీస్తున్నాయి?

ఈ విమర్శ మార్కెట్ నుంచి బయటపడి, అందంగా కనిపించాలనే ఆశని, చక్కగా తయారవ్వాలనే కోరికని వదిలేసుకొమ్మని, ఇతరులిచ్చే కాంప్లిమెంట్లని ఆస్వాదించరాదని చెప్పదు. అలంకరణలో స్త్రీల వ్యక్తిగత ఇష్టాలు, నిర్ణయాధికారం ఉంటాయి. కానీ వారి నియంత్రణలో లేని మార్కెట్ పెద్దది, అక్కడ స్వయం నిర్ణయాధికారం తక్కువ. మార్కెట్ ఆడవాళ్ళకిచ్చే 'ఛాయిస్' ఎటువంటిది? బట్టలు, చెప్పులు, హెయిర్ క్లిప్పులు చవకగా అందించటం సరే, మన వేడి వాతావరణానికి సరిపడే సౌకర్యవంతమైన బట్టలు దొరుకుతున్నాయా? ఆడవాళ్ళ చెప్పులు గట్టిగా నడిస్తే తెగిపోయేటట్లు ఎందుకు తయారు చేస్తున్నారు? సల్వార్‌లకి జేబులు ఎందుకుండవు? అత్యధిక శాతం వాడే చర్మ సౌందర్య ఉత్పత్తులకి ప్రభుత్వ నియంత్రణ ఉందా? వివిధ వయసుల ఆడవాళ్ల ఆరోగ్యంపై వీటి ప్రభావం ఏంటి? ఇవి కేవలం ఆడవాళ్లే కాదు, ఈ మధ్య ఫ్యాషన్ ప్రపంచంలోకి వచ్చిన మగవాళ్ళ గురించి కూడా వెయ్యాలి. వాళ్ళు వేసుకుంటున్న బిగుతు జీన్స్, వాడుతున్న హెయిర్ జెల్స్ శరీరంపై ఎటువంటి ప్రభావాన్ని చూపిస్తాయి?

ఈ వ్యవస్థీకృత సౌందర్య నమూనా మనుషులకి తమతో, ఇతరులతో ఏర్పడే సంబంధాలని ప్రభావితం చేసి, జీవితంలో వచ్చే ఒత్తిళ్లకి తోడయినప్పుడు దాని గురించి లోతుగా ఆలోచించాలి. మా ఆవిడ ఎప్పుడూ దుప్పటి లాంటి నైటీ వేసుకు తిరుగుతుంది అంటూ ఇంట్లో పని చేసేటప్పుడు కూడా అందంగా ఉండాలని ఆశించే భర్తలు, నేను అందంగా లేను కాబట్టే నాకు స్నేహితులు లేరు అని ఆత్మవిశ్వాసం దెబ్బతిన్న టీనేజీ పిల్లల కుంగుబాటు, ఉద్యోగినులు 'స్మార్ట్'గా తయారైతేనే ప్రమోషన్లు ఇచ్చే బాసులు, అమ్మాయిలు వ్యాక్సింగ్ చేసుకోకుంటే డేటింగ్ కష్టం అని నమ్మే యువతీ యువకులు – ఈ పరిణామాలన్నీ అందం ఒక సామాజిక సమస్యగా తయారయిందని తెలియచేస్తున్నాయి. వ్యక్తిగతంగా సంతోషం కలిగించే స్థాయి నుంచి మనల్ని నియంత్రించే పనిముట్టుగా తయారయిన సౌందర్య పిపాసని మళ్ళా మన నియంత్రణలోకి ఎలా తెచ్చుకోవాలన్నది ఇప్పుడు మన ముందున్న సవాలు!


# అందాల పోటీలు ఒక అవగాహన

**(50వ పేజీ తరువాయి)**

అందవిహీనతను దృష్టి పథంలోకే రానీయదు. అందువలన ఉత్తమ మానవ సంస్కృతిని పెంపొందించటం ఒక్కటే అందానికి ఈ కాలంలో లభించిన అనితర ప్రాధాన్యానికి ప్రత్యామ్నాయంగా చూపగల మార్గం. అందువలననే కొడవటిగంటి కుటుంబరావు తన రచనలలో అందాన్ని మించిన హృదయ సౌందర్యాన్ని ప్రదర్శించిన వాళ్ళకు ఉన్నత స్థానం ఇచ్చాడు. మనిషిలోని ప్రేమించే లక్షణం, జీవిత లాలస, ఆపేక్ష, ఎదుటి వాళ్ళ కష్టానికి స్పందించగల హృదయ సౌకుమార్యం వీటిని గొప్పగా ఆవిష్కరించి అందవిహీనులను కూడా ప్రేమించగలిగిన కథా పురుషులను సృష్టించాడు.


స్త్రీ పురుషుల మధ్య ఇప్పుడుండే గోడలు పడిపోయినాక అతీతమైన అనుభూతులు స్త్రీ పురుషుల అనుభవంలోకి వస్తాయని నలభై ఏళ్ళ క్రితం (ఇప్పటికి 68 ఏళ్ళ క్రితం) కొడవటిగంటి కుటుంబరావు ఊహించాడు. దానినిప్పుడు జీవిత వాస్తవంగా చేసుకోవలసిన అవసరాన్ని ఈ చారిత్రక సందర్భం గుర్తుచేస్తున్నది. ఇప్పుడున్న గోడలు స్త్రీలకు హానికరమైనవి అవమానకర మైనవి కనుక గోడలు పగులగొట్టే పనికి స్త్రీలే పూనుకోవాలి.


**(తొలి ప్రచురణ 3-3-1997)**




రాహుల్ బాటలో..

వెనకడుగు పాలన









మాటలు తూటాలు

కార్టూన్స్ : సతీష్ ఆచార్య

**RNI Title Code : APTEL 16175 - DAARI DEEPAM (Telugu Monthly)**
Vol : 3 - Issue No : 8 May 2025


## కొత్త పుస్తకాల స్వీకారం










if undeliverd please return to:
**B.Ramesh Chandra Babu**
34-15-1, Doddipatla Vaari Thota
Veedhi, Tanuku - 534 211
West Godavari, Ap
Phone No : 93971 14495

Printed Matter - Book Post

To :

Printer, Publisher and Owner Bhupatiraju Ramesh Chandrababu, Published from 34-15-1, Doddipatla Vaari Thota Veedhi, Tanuku - 534 211, AP. Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, 520 004. Editor : DVVS Varma.